అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 9-2-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 39 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50



పారిస్ : ఎస్ప్లనేడ్ దెస్ ఇన్వాలిడ్స్‌లోని గ్రాండ్ పలైస్ మ్యూజియం ముందు ట్రాక్టర్‌లు పార్క్ చేసి రైతుల నిరసన. పురుగుమందుల నిషేధంతో జీవనోపాధిని దెబ్బతీస్తోందని ఆందోళన

బీజేపీకే అమృత కాలం

జనానికి ఆపద

సకల జనుల బడ్జెట్

- కాపీ కొట్టినా పనులు చేయలే..
- బీజేపీ సక్సెస్ ఇందులోనే..!
- అంత్యోదయను వదిలేసి.. అదానీ సిద్ధాంతంవైపు
- ప్రజలపై మోడీ లక్షల కోట్ల అప్పు
- బీజేపీపై ఆర్థికమంత్రి తీవ్ర విమర్శలు
- బడ్జెట్‌పై హరీశ్‌రావు సమాధానం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సకల జనుల సంక్షేమం, సమీకృత సమ్మిళిత సమగ్ర సుస్థిరాభివృద్ధి ఉందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి టి. హరీశ్‌రావు అన్నారు. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన బడ్జెట్‌పై బుధవారం శాసనసభలో సుదీర్ఘ చర్చ చోటుచేసుకుంది. శాసనసభ్యులు పద్మాదేవేందర్‌రెడ్డి, మల్లు భట్టివిక్రమార్క, అక్బరుద్దీన్ ఓవైసీ, ఈటల రాజేందర్, గువ్వల బాలరాజు తదితర సభ్యులు అడిగిన పలు ప్రశ్నలు, సందేహాలకు సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ, తెలుగుదేశంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. చరిత్రను ప్రస్తావిస్తూ కాంగ్రెస్, బీజేపీ తప్పిదాలను ఎత్తిచూపారు. కేసీఆర్ ప్రభుత్వ విధానాలు, ఫలితాలు చెబుతూనే, కేంద్రంలోని బీజేపీ పాలన, దుష్పరిణామాలు, గత పాలకుల విధానాలు, అప్పటి పరిస్థితుల గురించి వివరించారు. ప్రభుత్వం ఎన్నో మంచి పనులు చేస్తున్నదన్నారు. కంటివెలుగు, రైతుబంధు, రైతు బీమాను అమలు చేస్తున్నదనీ, కానీ ప్రతిపక్షాల తీరు 'నిండుపున్నమిలో చందమామ వెలుగులు చూడాల్సింది పోయి.. ఆ చందమామ మీద ఉన్న మచ్చలు వెతికే ప్రయత్నం చేసినట్టుంది' అంటూ మంత్రి హరీశ్ తీవ్రంగా స్పందించారు. వెనుకటికి ఏం వంక అంటే.. ఏలువంక అన్న చందంగా బీజేపీ, కాంగ్రెస్ వ్యవహరిస్తున్నాయని చెప్పారు. బడ్జెట్‌లో అధికంగా నిధులు పేదలు, బడు బలహీన వర్గాల కోసం కేటాయించామన్నారు. విపక్షాల మాటలు వింటుంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, అగ్రవర్ణ పేదలకు ఏమి చేయొద్దన్నట్టుగా అర్థమవుతున్నదని చెప్పారు. సమాధానం ఆయన మాటల్లోనే...

వృద్ధులకు రక్షణ.. పిల్లలకు పోషణ

బడ్జెట్‌లో ముసలవ్వలకు రక్షణ ఉంది. పసిపిల్లలకు పోషణ, బడి పిల్లలకు శిక్షణ, ఉన్నత విద్యకు ఉపకారం, యువత ఉద్యోగ కల్పన, ఆరిపోని కరెంటు వెలుగులు ఉన్నాయి. నదీ జలాలను ఎత్తిపోసే విజయాలున్నాయి. మత్తడి దుంకుతున్న చెరువుల తళతళలు, చెరువులో చేపపిల్లల మిలమిలలు, జలరాశుల గలగలలు, ధాన్యరాశుల కళకళలున్నాయి.

రైతుల ముఖంపై విరబూస్తున్న చిరునవ్వులు, గొర్రెల మందల అరుపులు, గొల్లకురుమల కండ్లలో మెరుపులు, నేతన్నకు భరోసా, గీతన్నకు కులాసా ఉన్నవి. దళితబంధు ఇచ్చే దిలాసా, ఆకుపచ్చని అడవులు, మళ్లీ ఊపిరిపోసుకున్న పక్షి జాతులున్నాయ్, కాలుష్యంపై కథనం ఉంది.. పర్యావరణ సమతుల్యం ఉన్నది.. పేదింటి ఆడపిల్లల పెళ్లిపందిళ్లున్నాయి.. వారి తల్లిదండ్రుల కండ్లల్లో ఆనంద భాష్పాలున్నాయి. కంటి వెలుగు కాంతి ఉంది.. కొత్త హాస్పిటళ్లు ఉన్నాయి.. జిల్లాకో మెడికల్ కాలేజీ ఉంది. పెరిగిన బెడ్లు ఉన్నయ్.. చికిత్స మార్గం ఉంది.. ఆరోగ్య భాగ్యం.. సబ్బండ వర్ణాల సంక్షేమం ఉంది. సకలజనుల సౌభాగ్యం, సమీకృత సమ్మిళిత సమగ్ర సుస్థిర అభివృద్ధి ఉంది. ఇవి ప్రతిపక్షాలకు కనపడకపోతే మేం ఏం చేయాలి' అని మంత్రి ప్రశ్నించారు.

గతంలో ఖాళీ బిందెల ప్రదర్శనే

'గతంలో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్నాయంటే ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచో, తెలంగాణ అమరవీరుల స్థూపం నుంచో ఖాళీ బిందెల ప్రదర్శనలతో అసెంబ్లీకి వచ్చేవాళ్లం. మొదటిరోజు రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి మీద విపక్షాలన్నీ వాయిదా తీర్మానం ఇచ్చేవి. మొదటి వాయిదా తీర్మానం కరెంటు కోతలు, తాగునీటి బాధలపై ఉండేవి. బడ్జెట్ సమావేశాల్లో మంచినీటి కొరత గురించి మాట్లాడకుండా సభ జరిగిందే లేదు. మిషన్ భగీరథ వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఏ రోజైనా భట్టీ విక్రమార్క గానీ, ఇతర విపక్ష సభ్యులుగానీ రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తీర్మానాలు ఇచ్చారా? వాగ్యుద్ధాలు ఉన్నాయా? ఖాళీ కుండల ప్రదర్శన ఉందా? ఇవన్నీ లేవంటే ప్రతిపక్షాలు కూడా రాష్ట్రంలో మంచినీటి సమస్య లేదని ఒప్పుకున్నట్టే కదా? ఇంత మంచి పని జరిగితే ఒక్కనాడైన మంచి అని అన్నారా ? అంటూ వ్యంగ్య వాఖ్యానం చేశారు.

యథావిధిగా డబుల్ బెడ్రూం ఇండ్ల పథకం

డబుల్ బెడ్రూం ఇండ్ల పథకం యథావిధిగా కొనసాగుతుంది. ఉద్యోగులు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన మూడు డీఏల్లో మొన్న ఒక డీఏ ఇచ్చాం. మరో రెండు డీఏలపై కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. న్యూ ఉస్మానియా బిల్డింగ్ నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. యునాని హాస్పిటల్‌ను కూడా అభివృద్ధి చేస్తాం. ఎలాంటి కొత్త పన్నులు వేయం. సొంత ఆదాయ వనరులపై దృష్టి సారించాం. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ సమస్యలు లేకపోతే.. పవర్ హాలిడేలు, క్రాప్ హాలిడేలు ఎందుకు ప్రకటించారు. ఇందిరా పార్క్ వద్ద పారిశ్రామికవేత్తలు ఎందుకు ధర్నాలు చేయాల్సి వచ్చిందని హరీశ్‌రావు భట్టిని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు కృష్ణా జలాలను తీసుకొస్తే.. ఇదే సభలో దివంగత ఎమ్మెల్యే పీజేఆర్ నీళ్ల గురించి ఎందుకు ప్రశ్నించారని మంత్రి గుర్తు చేశారు. రాష్ట్రానికి సంబంధించిన స్పోర్ట్స్ పాలసీ రెడీగా ఉంది. ఆ పాలసీని త్వరలోనే ప్రకటిస్తాం. క్రీడల విషయంలో ప్రభుత్వం ...3లో

ఈ-కుబేర్ పేరుతో బిల్లులు పెండింగ్‌లో పెట్టొద్దు

కనీసవేతనం రూ.25 వేలు ఇవ్వాలి

- యూనివర్సిటీల రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసి పోస్టులు భర్తీ చేయాలి
- పీహెచ్‌సీలు 24 గంటలు పనిచేసేలా చూడాలి
- అందరికీ విద్యా,వైద్యం అందితేనే సంక్షేమం : బడ్జెట్‌పై చర్చలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

వివరాలు 3లో..



కేంద్రం ఆర్థిక అడ్డంకులు



- ఆశించిన అభివృద్ధిని సాధించకపోవడానికి ఇదే కారణం : అక్బరుద్దీన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఆర్థిక అడ్డంకులు సృష్టిస్తున్నదని శాసనసభలో ప్రతిపక్ష నేత ...6లో

మతం పేరిట ప్రజల మధ్య చిచ్చు



- దేశంలో ఆర్థిక అసమానతలు
- అనుమానస్పదంగా రాష్ట్ర బడ్జెట్ అంకెలు: బీజేపీపై భట్టి ఫైర్

వివరాలు 12లో

అదుపులోనే ద్రవ్యోల్బణం

లోక్‌సభలో ప్రధాని .. అదానీపై నో కామెంట్

- మోడీ ప్రసంగాన్ని అడ్డుకున్న ప్రతిపక్షాలు



న్యూఢిల్లీ : దేశంలో ద్రవ్యోల్బణం అదుపులో ఉందని ప్రధాని మోడీ అన్నారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని సమాధానమిచ్చారు. కానీ దేశంలో సంచలనం అయిన, ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అదానీ వ్యవహారంపై మాత్రం ఆయన స్పందించలేదు. ప్రధాని మోడీ మాట్లాడుతూ రాష్ట్రపతి ప్రసంగం దేశ ప్రజలకు మార్గదర్శనం చేసిందన్నారు. ఒక పెద్ద నాయకుడు రాష్ట్రపతిని విమర్శించారనీ, నేతల వ్యాఖ్యలు వారి మనసులోని ద్వేషాన్ని బయటపెట్టాయని మోడీ ...5లో

బీజేపీతో ఉన్న ఆ బంధంతోనే అదానీ ఎదుగుదల

- లోక్‌సభలో సీపీఐ(ఎం) ఎంపీ ఆరీఫ్



వివరాలు 5లో



ఆగని అదానీ ప్రకంపనలు

ఉభయ సభల్లో ప్రతిపక్షాల ప్రశ్నలు

న్యూఢిల్లీ :పార్లమెంటులో 'అదానీ' ప్రకంపనలు బుధవారం కూడా కొనసాగాయి. అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ నివేదిక చేసిన ఆరోపణలపై దర్యాప్తు జరిపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అదానీ గ్రూప్ షేర్ల విలువ పతనమవడం అతి పెద్ద కుంభకోణమని విమర్శించారు. ప్రభుత్వ రంగంలోని ఎల్ఐసీ, ఎస్‌బీఐ ఈ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టినందువల్ల ఇది సామాన్యుల ...5లో



మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ అరెస్టు

- జమ్మూ కాశ్మీర్‌లో కూల్చివేతలకు వ్యతిరేకంగా ఢిల్లీ విజయ్ చౌక్ వద్ద ఆందోళన..

న్యూఢిలీ:మాజీ సీఎం, పీడీపీ నేత మెహబూబా ముఫ్తీని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని కూల్చివేతలకు వ్యతిరేకంగా బుధవారం విజయ్ చౌక్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. బీజేపీకి వ్యతిరేకంగా పీడీపీ నేతలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అయితే అనుమతి లేకుండా ఆందోళనకు పూనుకోవడంతో మెహబూబా ముఫ్తీతోపాటు పలువురు పీడీపీ కార్యకర్తలను కూడా ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు..జమ్మూ కాశ్మీర్‌లో గూండా ప్రభుత్వం నడుస్తున్నదని మెహబూబా ముఫ్తీ నిరసన వ్యక్తం చేశారు. కాశ్మీర్‌ను ఆఫ్ఘనిస్తాన్‌లా ...5లో

అదానీ ఆస్తుల్ని జాతీయం చేయాలి

- బీజేపీ తన పవిత్రతను నిరూపించుకోవాలి : సుబ్రహ్మణ్యస్వామి



న్యూఢిల్లీ : అదానీ గ్రూప్ వ్యవహారం మోడీ సర్కార్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఆరోపణలు, అనుమానాలపై స్పందించాలని, దేశ ప్రజలకు జవాబు చెప్పాలని ప్రతిపక్ష నాయకులు మోడీ సర్కార్‌ను డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశంపై బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి సుబ్రహ్మణ్యస్వామి తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. అదానీ గ్రూపు ఆస్తులను కేంద్ర ప్రభుత్వం జాతీయం చేసి, వాటిని వేలం వేయాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. తాజాగా పీటీఐ వార్త సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన..అదానీ వ్యవహారం, కేంద్ర బడ్జెట్, ముషారఫ్ మరణంపై సానుభూతి వంటి అంశాలపై తన అభిప్రాయాలను ...5లో

ఢిల్లీలో మళ్లీ విద్వేష ప్రసంగాలు

- 'సనాతన్ ధర్మ సన్సద్'లో మైనార్టీలపై విషం వెళ్లగక్కిన వక్తలు
- ట్విట్టర్‌కు నోటీసులు జారీచేసి..చేతులు దులుపుకున్న ఢిల్లీ పోలీసులు

వివరాలు 6లో..



కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు

ఉద్యోగ భద్రత కల్పించాలి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్

- ప్రభుత్వ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ- ముషీరాబాద్

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కు వద్ద బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో ...5లో

హక్కుపత్రాలెప్పుడు?

త్వరలోనే పోడు భూములకు పట్టాలంటున్న ప్రభుత్వవర్గాలు

- కలెక్టర్లతో మంత్రులు, సీఎస్ వరుస వీడియో కాన్ఫరెన్స్‌లు
- పూర్తికాని ఏర్పాట్లు
- లబ్దిదారుల సంఖ్యపై అనుమానాలు
- కటాఫ్ తేదీ పొడిగించేందుకు అంగీకరించని కేంద్రం

ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్న పోడు భూముల అపరిష్కృత సమస్యలకు పరిష్కారం లభించనుందా?. అవుననే అంటున్నాయి ప్రభుత్వవర్గాలు. గిరిజనులు, గిరిజనేతరులు ఏండ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు త్వరలోనే పట్టాలు ఇవ్వబోతున్నట్టు ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. అయితే ఇది సాధ్యమా అనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.



నవతెలంగాణ-మొఫిసిల్ యంత్రాగం


పోడు భూములకు పట్టాలు ఇవ్వడానికి జిల్లాల వారీగా గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టాల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని, ఎలాంటి అవరోధాలూ రాకుండా చూడాలని అధికారులను మంత్రులు ఆదేశిస్తున్నారు. అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్టు అధికారులు చెబుతున్నా.. ఆ పరిస్థితి అన్నిచోట్ల లేదని తెలుస్తోంది. ఆయా జిల్లాల్లో అధికారులు లబ్దిదారుల వివరాలను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసినా.. ఎంతమంది పట్టాలు అందుకుంటారన్నది అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చాలా చోట్ల దరఖాస్తులను తిరస్కరించినట్టు సమాచారం. తక్కువ ...3లో



ఆర్‌బీఐ ఆరోసారీ...

రెపోరేటు పావు శాతం పెంపు

- గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు మరింత భారం



ముంబయి : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వరుసగా ఆరోసారి వడ్డీ రేటు బాదుడును కొనసాగించింది. రెపోరేటును మరో పావు శాతం లేదా 25 బేసిస్ పాయింట్లు పెంచి ...6లో

యూనివర్సిటీలకు నిధుల కేటాయింపులో అన్యాయం

విద్యారంగం అభివృద్ధి ఎలా..? : ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్. మూర్తి

- రాష్ట్ర వ్యాప్తంగా నిరసన.. బడ్జెట్ ప్రతుల దహనం



నవతెలంగాణ-ఓయూ/విలేకరులు

యూనివర్సిటీలకు తక్కువ నిధులు కేటాయించడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్.మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగానికి, ప్రభుత్వ యూనివర్సిటీలకు రాష్ట్ర బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించినందుకు నిరసనగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నిరసన కార్యక్రమాలు చేశారు. బడ్జెట్ ప్రతులను ...3లో

బిజినెస్

పెన్నార్ లాభాలు రెట్టింపు

హైదరాబాద్: విలువ ఆధారిత ఇంజనీరింగ్ ఉత్పత్తులు, పరిష్కారాలు అందిస్తున్న పెన్నార్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం(క్యూ3)లో ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే దాదాపు రెండింతలై 97.19 శాతం వద్ధితో రూ.21.12 కోట్ల నికర లాభాలు సాధించింది. 2021-22 క్యూ3లో రూ.10.71 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఎబిటా 40.61 శాతం అధికమై రూ.66 కోట్లుగా ఉందని పెన్నార్ కార్పొరేట్ స్ట్రాటజీ వైస్ ప్రెసిడెంట్ కె.ఎం.సునీల్ తెలిపారు. కంపెనీ టర్నోవర్ 29.88 శాతం పెరిగి రూ.692.22 కోట్లను తాకిందని చెప్పారు. 2022-23 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ కాలంలో నికరలాభం రెండింతలకుపైగా పెరిగి 104.76 శాతం వద్ధితో రూ.51.58 కోట్లకు చేరుకుంది. ఇదే సమయంలో టర్నోవర్ 41.53 శాతం ఎగసి రూ.2,226 కోట్లకు పెరిగింది.

చౌక ధరలో ఇవి మోటార్ సైకిల్



- ప్యూర్ ఇవి వెల్లడి

హైదరాబాద్: భారతదేశంలో అత్యంత అందుబాటు ధరలో విద్యుత్ మోటర్ సైకిల్‌ను ఆవిష్కరించినట్లు ప్యూర్ ఇవి వెల్లడించింది. ఈకోడ్రిఫ్ట్ పేరుతో ఆవిష్కరించిన ఈ మోటార్ సైకిల్‌ను పలు రాష్ట్రాల్లో రూ. 99,999 నుంచి రూ.1,14,999 ధరతో అందిస్తున్నట్లు పేర్కొంది. ఈ మోటార్‌సైకిల్ నలుపు, ఉదా, బ్లూ, ఎరుపు రంగుల్లో లభిస్తుందని తెలిపింది. ఎకోడ్రిఫ్ట్‌ను హైదరాబాద్‌లోని ప్యూర్ ఇవి యొక్క సాంకేతిక, తయారీ కేంద్రం వద్ద రూపొందించి, అభివద్ధి చేసినట్లు తెలిపింది. ఇది గంటకు గరిష్ఠంగా 75 కిలోమీటర్ల వేగంతో వెళ్తుందని పేర్కొంది. ఒక్క సారి ఛార్జింగ్‌తో 130 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని ఆ కంపెనీ వెల్లడించింది. ఈ డ్రైవ్ ట్రైన్‌లో ఎఐఎస్ 156 సర్టిఫైడ్ 3.0 కిలోవాట్ అవర్ బ్యాటరీ, స్మార్ట్ బిఎంఎస్‌తో ఉందని పేర్కొంది.

పిఎన్‌బి 'ఎంఎస్‌ఎంఇ మీట్'



హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) హైదరాబాద్ లోని ఎఫ్‌టిసిసిఐలో ఎంఎస్‌ఎంఇ కస్టమర్ మీట్‌ను ఏర్పాటు చేసింది. ఎంఎస్‌ఎంఇలోని వివిధ విభాగా లకు చెందిన వ్యాపారస్తులకు మద్దతును ఇవ్వడానికి దీనిని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి పిఎన్‌బి హైదరాబాద్ జోనల్ హెడ్ మహ్మద్ మక్సూద్ అలీ, సర్కిల్ హెడ్ ఎస్‌వియస్ రెడ్డి, బ్యాంక్ అధికారులు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మ నిర్భార్ అభియన్ ఎంఎస్‌ఎంఇలకు మద్దతును ఇస్తుందని మక్సూద్ అలీ పేర్కొన్నారు. బ్యాంక్ ఎంఎస్‌ఎంఇలకు అందిస్తున్న పలు పథకాలను ఆయన వివరించారు. ఈ మీటింగ్‌కు 80 మంది ఎంఎస్‌ఎంఇ రుణ గ్రహీతలు హాజరయ్యారు. రూ.70 కోట్ల రుణాలకు గాను ప్రతిపాదనలు ఇచ్చారు. పలు పథకాల కింద రూ.40 కోట్ల ఎంఎస్‌ఎంఇ రుణాల జారీకి అనుమతించారు.

జీబ్రానిక్స్ స్మార్ట్‌వాచ్ ఆవిష్కరణ



చెన్నై : ప్రముఖ ఎలక్ట్రానిక్ పరికరాల సంస్థ జీబ్రానిక్స్ తన కంపెనీకి చెందిన తాజా స్మార్ట్‌వాచ్‌ను ఆవిష్కరించింది. ఈ జీబ్రానిక్స్ ఐకానిక్ అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లో కొత్త ఫీచర్లను తీసుకొచ్చింది. స్మార్ట్ వాచ్ ఆవిష్కరణ కార్యక్రమంలో డైరెక్టర్ యష్ దోషి పాల్గొని మాట్లాడారు. వినియోగదారుల లైఫ్‌స్టైల్‌కు అనుగుణంగా తమ పరికరాలను ఆవిష్కరిస్తామని చెప్పారు. ఈ స్మార్ట్‌వాచ్ కూడా అలాంటిదేనని అన్నారు. ఈ స్మార్ట్ వాచ్ 1.78 ఇంచుల అమోల్డ్ డిస్‌ప్లేను కలిగి ఉన్నది. 2.5డి లామినేటెడ్ స్క్రీన్‌ను కలిగి ఉన్నది. ఇందులో 9 ఇన్‌బిల్ట్ అప్లికేషన్లు ఉంటాయి. వందకు పైగా కస్టమైజ్డ్ అప్లికేషన్లకు అవకాశం ఉంటుంది. అమెజాన్‌లో దీని ప్రారంభ ధర రూ. 3299 గా అందుబాటులో ఉన్నది.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాల దరఖాస్తు గడువు 15

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో ఆరో తరగతితోపాటు ఏడు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువు ఈనెల 15 వరకు ఉన్నది. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఉషారాణి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని తెలిపారు. ఆరో తరగతిలో ఒక్కో పాఠశాలలో వంద సీట్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీ సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఓసీలు రూ.200, ఎస్సీ,ఎస్టీ,బీసీ, వికలాంగులు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125 దరఖాస్తు ఫీజు చెల్లించాలని కోరారు. ఇతర వివరాల కోసం www.tsmodelschools.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఇప్పటి వరకు 34,644 దరఖాస్తులొచ్చాయని వివరించారు.

కేంద్ర రైతు వ్యతిరేక విధానాలపై
దేశవ్యాప్త ఉద్యమాలు

బడ్జెట్‌లో కేటాయింపుల్లో వివక్ష

- 9,10 తేదీల్లో ఆందోళనలు :ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై దేశ వ్యాప్త సమరశీల ఉద్యమాలు చేపట్టాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకెఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజూ కష్ణన్ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏఐకేఎస్ జాతీయ ఆఫీస్‌బేరర్ల సమావేశం జాతీయ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్ల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విజూకృష్ణన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందన్నారు. కనీస మద్దతు ధరల చట్టం చేస్తామని చెప్పి అమలు చేయలేదని తెలిపారు. రైతుల ఆత్మహత్యల నివారణకు బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదన్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కి కేటాయిం చాల్సిన నిధులను పూర్తిగా తగ్గించేశారని చెప్పారు. ఫలితంగా మధ్య దళారీలు రైతుల నుండి కనీస మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నారని అన్నారు.

ఎరువుల సబ్సీడీని కుదిం చడంతో రైతాంగానికి, ఆహార భద్రతకు తీవ్ర ముప్పు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధిని చూపిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధులు కోత పెట్టారని విమర్శించారు. కనీసం వంద రోజులు పని కల్పించాలంటే రూ.2 లక్షల 25 వేల కోట్లు అవసరమవు తుందనీ, కానీ కేంద్ర ప్రభుత్వం గత ఏడాది కంటే నిధులు తగ్గించిందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా ఫిబ్రవరి 9, 10 తేదీల్లో దేశవ్యాప్త ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా, మండల కేంద్రా లు, గ్రామాల్లో కేంద్ర బడ్జెట్ ప్రతుల దగ్ధం, దిష్టిబొమ్మల దగ్ధం, ప్రదర్శనలు, సభల రూపంలో నిరసనలు వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐకేఎస్ అఖిల భారత కోశాధికారి కృష్ణ ప్రసాద్, ఉపా ధ్యక్షులు విజయ కుమార్, అమల్ హల్దా, అమ్రరాం, ఎస్‌కె ప్రీజ, షణ్ము గం, బిప్లవ్ మజుందార్, ఇంద్రజిత్, సహాయ కార్యదర్శులు టి సాగర్, బాదల్ సరోజ్, వల్సన్ పనోలి, ముకుత్ సింగ్, రవీంద్రన్, డాక్టర్ అజిత్ నవలే, అవదేశ్ కుమార్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంటీలో ఎంపిక కాని అభ్యర్థులకు తిరిగి అవకాశం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు జరుగుతున్న రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో పీఎంటీ పరీక్షలో ఎంపిక కాని అభ్యర్థులకు కోర్టు ఆదేశంతో మరోసారి టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ అవకాశాన్ని కల్పించింది. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మెన్ వీవీ శ్రీనివాసరావు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో నిర్వహించిన పీఎంటీ (ఫిజికల్ మెజర్‌మెంట్) పరీక్షలో బోర్డు నిర్దేశించిన ఎత్తు కంటే ఒక సెంటీమీటరు తక్కువ అయినా అభ్యర్థులను డిస్‌క్వాలిఫై చేశారు. దీనిపై కొందరు అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లగా వీరికి అనుకూలంగా కోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఒక సెంటీమీటరు ఎత్తు తక్కువై పీఎంటీ పరీక్షలో ఎంపిక కాని అభ్యర్థులకు తిరిగి పీఎంటీ పరీక్ష నిర్వహిస్తున్నామని శ్రీనివాసరావు తెలిపారు. సెంటీ మీటరు తక్కువై ఎంపిక కాని అభ్యర్థులు ఈనెల 10 నుంచి 12వరకు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దీనికి సంబంధించిన దరఖాస్తు ఫారం టీఎస్ ఎల్‌పీఆర్‌బీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో నింపి దరఖాస్తు చేసు కోవాలని ఆయన తెలిపారు. అడ్మిట్ కార్డులనూ డౌన్ లోడ్ చేసుకోవాలని చెప్పారు. వీరికి అంబర్ పేట్‌లోని సీపీఎల్ గ్రౌండ్స్‌లో, కొండాపూర్‌లోని 8వ బెటాలియన్ లో పీఎంటీ పరీక్షలను నిర్వహిస్తామనీ, తర్వాత పీఈటీ పరీక్షను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రేవంత్ తోడో యాత్ర చేస్తున్నారు

- మావోయిస్టులను సమర్థిస్తున్నారా.. :

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి క్రిమినల్ మాదిరిగా మాట్లాడుతున్నారని, రాహుల్ గాంధీ జోడో యాత్ర చేస్తే, రేవంత్ తోడో యాత్ర చేస్తున్నారని జయశంకర్ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి ములుగు జిల్లా పర్యటనలో మాట్లాడిన భాష చూస్తే ఆయన ఫ్రస్టేషన్‌లో ఉన్నట్టు అనిపిస్తోందన్నారు. బుధవారం శాసనసభ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో తన ఉనికిని కాపాడుకునేందుకు మాట్లాడినట్టుగా ఉందన్నారు. మావోయిస్టులను రేవంత్ రెడ్డి సమర్థిస్తున్నారా అని ప్రశ్నించారు. మావోయిస్టులపై కాంగ్రెస్ స్టాండ్ ఏమిటో తేల్చుకోవాలన్నారు. పేల్చేయడం, కూల్చేయడం అసాంఘిక శక్తులు మాట్లాడే మాటలన్నారు.

పీసీసీ అధ్యక్షుడిపై పీడీ యాక్ట్ పెట్టాలి
ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

ప్రగతి భవన్‌ను పేల్చాలన్న రేవంత్ వ్యాఖ్యలను నర్సంపేట్ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తీవ్రంగా ఖండిం చారు. రేవంత్ రెడ్డి మాటలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా ఉన్నాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకులు దీనిని సమర్థిస్తున్నారా అని ప్రశ్నించారు. ప్రగతి భవన్‌ను గ్రెనేడ్లతో పేల్చాలన్న రేవంత్‌పై పీడీ యాక్ట్ నమోదు చేసి, జైల్లో పెట్టాలన్నారు. డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. మహాత్మాగాంధీ మూల సిద్ధాంతాలను కాంగ్రెస్ పార్టీ మార్చుకుందా అని ప్రశ్నించారు.

అసెంబ్లీని.. వారి ఎల్పీ ఆఫీస్‌గా మార్చేశారు
హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

గవర్నర్ ప్రసంగం మీద మంత్రి కేటీఆర్.. బడ్జెట్ మీద హరీశ్‌రావు రెండు మూడేసి గంటలు మాట్లాడారు తప్ప ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వలేదని, అసెంబ్లీని వారి ఎల్పీ ఆఫీస్‌గా మార్చేసి స్వైర విహారం చేశారని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. మాఇంటి పేరు కస్తూరి.. మా ఇల్లంతా గబ్బిలాల వాసన అన్నట్టు ఉంది వీరితీరు అని ఎద్దేవా చేశారు. మంత్రి హరీశ్‌రావు ప్రసంగం అంతా అబద్ధాలతో నిండిపోయిందన్నారు. తాను అసెంబ్లీలో మాట్లాడిన దానికి కట్టుబడి ఉన్నానని, భూముల అమ్మకం ద్వారా రూ.13వేల కోట్లు వస్తాయనడం తప్పు.. రూ.25వేల కోట్లు కేంద్రం అసిస్టెన్స్ వస్తుందని పెట్టారు అదీ తప్పు.. జీఎస్టీ కాంపెన్సేషన్ ఒక అబద్ధం అని.. ఇలా 55 వేల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో అక్రమంగా పెట్టి ప్రజలను వంచించే.. నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

బొగ్గు గనులు
కేటాయించే అధికారం కేంద్రానిదే...

- రాష్ట్ర ప్రభుత్వానికి లేదు....
- నామా ప్రశ్నకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సమాధానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా బొగ్గుల గనుల కేటాయింపు అధికారం కేంద్రానికే తప్ప రాష్ట్ర ప్రభుత్వానికి లేదని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. బీఆర్ఎస్ లోక్‌సభా నాయకులు నామా నాగేశ్వర రావు, దేశ వ్యాప్తంగా బొగ్గు బ్లాకులను ప్రయివేటు కంపెనీలకు కేటాయించడం వాస్తవం కాదా ? ఇప్పటి వరకు సింగరేణి కంపెనీకి చెందిన ఎన్ని బొగ్గు బ్లాకులను వాటికి కేటాయించారు ? సింగరేణి బొగ్గు బ్లాకులను వాటికి కేటాయించే ముందు తెలంగాణ ప్రభుత్వాన్ని సంప్రదించారా? అని బుధవారం లోక్ సభలో ప్రశ్నించారు.

దీనికి మంత్రి లిఖితపూర్వక సమాధానామిచ్చారు. దీనికి జోషి, సింగరేణి బొగ్గు బ్లాకులను ప్రయివేటు కంపెనీలకు కేటాయించలేదని తెలిపారు. బొగ్గు గనుల చట్టం (ప్రత్యేక నిబంధనలు)-2015లో నిబంధనల ప్రకారం కేటాయింపుదారుడిని ఎంపిక చేసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందని పేర్కొన్నారు. మైన్స్, మినరల్ చట్టంలోని నిబంధనల ప్రకారం బొగ్గు బ్లాకుల కేటాయింపునకు ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించడం తప్పనిసరి కాదని తెలిపారు.

ఈ-కుబేర్ పేరుతో బిల్లులు పెండింగ్‌లో పెట్టొద్దు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ఈ కుబేర్ ఆన్‌లైన్ వచ్చాక అనేక బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయి. బిల్లులు వెంటనే చెల్లించాలి. వైద్యం చేయించుకుంటే సకాలంలో రీయింబర్స్ మెంట్ రాదు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలిచ్చేదే నాలుగైదు నెలలకోసారి. అందులోనూ మళ్లీ ఈ కుబేర్ పేరుతో పెండింగ్‌లో పెట్టడం అన్యాయం. బిల్లులు పెండింగ్‌లో లేకుండా చేయాలి. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు ప్రతినెలా ఐదు నుంచి ఏడో తేదీల్లోపు జీతాలు చెల్లించాలి' అని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. బుధవారం శాసనమండలిలో రాష్ట్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంకా కొంత మంది భార్యాభర్తల బదిలీలు మిగిలిపోయాయనీ, వారికి భరోసా కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. స్థానికత పోయింది అనే భావనలో ఉన్న వారికి భవిష్యత్‌లో అవకాశం వచ్చినప్పుడు సొంతజిల్లాలకు పంపిస్తామనే భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేజీబీవీలలో పనిచేసే వారికి రూ.26 వేలకు మించి వేతనం ఇవ్వడంలేదనీ, అదే పనిచేసే రెగ్యులర్ ఉద్యోగులకు రూ.56 వేల నుంచి 80 వేల వరకు వేతనాలు అందుతున్న పరిస్థితి ఉందని చెప్పారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలన్నారు. చాలా రంగాల్లోనూ కార్మికులకు రూ.8 వేల నుంచి రూ.9 వేలకు మించి అందటం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 25 వేల కనీస వేతనం ప్రకటిస్తే లక్షలాది మంది పనిచేసేందుకు ముందుకు వస్తారని తెలిపారు. 11వేల మంది కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణను స్వాగతిస్తున్నామని చెప్పారు. వర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లకు 30 శాతం పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గవర్నర్ చొరవ తీసుకుని యూనివర్సిటీల రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లును ఆమోదించాలని కోరారు. వర్సిటీల్లోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీఈఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జిల్లాకో ఇంటర్మీడియట్ అధికారిని నియమించాలనీ, ఖాళీగా ఉన్న వరంగల్ ఆర్జేడీ పోస్టును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 2015లో పాఠశాల విద్యలో 7000 ఎస్జీటీలు మిగిలిపోయాయనీ, వాటిని భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాల నుంచి సర్దుబాటు చేసైనా సరే పాఠశాల విద్యకు అధిక నిధులు అందేలా చూడాలన్నారు. రూ.500 కోట్ల నిధులను వర్సిటీలకు పంచి అభివృద్ధి కోసం వెచ్చించాలని కోరారు. ఉన్నత విద్యలోని సెమీ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలు పనిచేసేలా చూడాలనీ, ప్రతి పీహెచ్‌సీకి ముగ్గురు డాక్టర్లు, ఆరుగురు నర్సులు ఉండేలా చూడాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే డాక్టర్లకు ప్రత్యేక అలవెన్సులు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. విద్య, వైద్యం అందరికీ అందేలా చూడాలని కోరారు.

ఖాళీగా 10 లక్షల కేంద్ర ప్రభుత్వ పోస్టులు : ఎమ్మెల్సీ కవిత



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు 10 లక్షల మేరకు ఖాళీగా ఉన్నాయనీ, వాటిని భర్తీ చేసే పనికి మోడీ సర్కారు పూనుకోవడం లేదని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆ పోస్టులను భర్తీ చేస్తే అందులో కనీసం 2 లక్షల పోస్టులు తెలంగాణ బిడ్డలకు దక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా, మండల పరిషత్ సమావేశాల్లో మాట్లాడాల్సిన అంశాలను, కలెక్టర్ల వద్ద పరిష్కారమయ్యే అంశాలను కొందరు సీనియర్ సభ్యులు మండలిలో ప్రస్తావించడం బాధాకరమంటూ వ్యాఖ్యానించారు. దీనికి జీవన్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తూ కవిత అలా మాట్లాడటం సరిగాదన్నారు. మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ అన్‌పార్లమెంటరీ పదజాలం, కించపరిచే మాటలుంటే తొలగిస్తామనీ, జీవన్‌రెడ్డి కూర్చోవాలని చెప్పటంతో వివాదం సద్దుమణిగింది. ఆ తర్వాత కవిత మాట్లాడుతూ...ఏ రాష్ట్రాల్లోనూ లేనన్ని మినహాయింపులను కానిస్టేబుల్, ఎస్‌ఐ పోస్టుల భర్తీలో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నదనీ, అయితే, కొందరు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. టీ-ఐడియా ద్వారా సృజనాత్మకత ప్రదర్శించే ఎంతో మంది పిల్లలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

రైతు రుణమాఫీకి రూ.20 వేల కోట్లు కావాలి : ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి



రైతు బంధు పేరుతో రైతులకు గతంలో ఉపయోగకరంగా ఉన్న సబ్సిడీలను, పంటరుణాలను నిలిపేయడం సరిగాదని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణ రైతాంగానికి ఉపయోగపడే చెక్కర ఫ్యాక్టరీని ఓపెన్ చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ డెయిరీలకు పాలు పోసే రైతులకు లీటర్ పాలపై రూ.4 ఇన్సెంటివ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మేకలు, గొర్రెల పెంపకం దారులకు షెడ్ల నిర్వహణ భారంగా మారిందనీ, వారికి ఉచిత విద్యుత్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కోతుల బెడద ఎక్కువైందనీ, అవి పంటలను మొత్తం నాశనం చేస్తున్నాయని చెప్పారు. కోతుల బెడద నివారణకు ప్రతి మండలంలోనూ నిర్మల్‌లో మాది రిగా స్టెరిలైజేషన్ సెంటర్ పెట్టాలని సూచించారు. గల్ఫ్‌లోని మన కార్మికుల సంక్షేమం కోసం కేరళ ప్రభుత్వ తరహాలో సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎంపీ, పీఎంపీ డాక్టర్లకు ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. బడ్జెట్‌పై చర్చలో ఎమ్మెల్సీలు భానుప్రకాశ్, ఫారూఖ్ హుస్సేన్, జనార్ధన్‌రెడ్డి, ఎమ్ఎస్ ప్రభాకర్, బండా ప్రకాశ్, రఘోత్తంరెడ్డి, కోటిరెడ్డి, తదితరులు మాట్లాడారు.

యూనివర్సిటీలకు నిధుల కేటాయింపులో అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

దహనం చేశారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట కార్యక్రమంలో మూర్తి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉన్నత విద్యకు తక్కువ నిధులు కేటాయించిందన్నారు. విద్యను బహుజన, బడుగు, బలహీన, మధ్యతరగతి, మైనారిటీ, పేద విద్యార్థులకు దూరం చేసే విధంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో ఓయూకు రూ.457 కోట్లు మాత్రమే కేటాయించడం బాధాకరమన్నారు. ఎస్ఎఫ్ఐ ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, రవి నాయక్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాలలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసే ప్రక్రియ మొదలుపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఓయూ ఉపాధ్యక్షులు రామటెంకి, శ్రీను, సాయి కిరణ్, కృష్ణ, రమ్య, రాజు, సందీప్, శ్రీనాథ్ సాంబశివరావు పాల్గొన్నారు. విద్యారంగాన్నికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కొర్ర సైదానాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మూడవత్ జగన్‌నాయక్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆకాష్, సమద్, లోకేష్, ఆనంద్, అఖిల్, సాయి తదితరులు పాల్గొన్నారు. దేవరకొండలో జాతీయ రహదారిపై బడ్జెట్ ప్రతులను కాల్చేశారు. బడ్జెట్లో విద్యారంగానికి నిధులు కేటాయించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఎస్ఎఫ్ఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. అరకొర నిధులతో ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి ఎలా సాధ్యమని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశ్నించారు. కామారెడ్డిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల ఎదుట బడ్జెట్ ప్రతులను కాల్చేసి నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్ ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలోని ఒకేషనల్ కళాశాల ఎదుట విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. డీవైఎఫ్ఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ధర్మారపు సాంబమూర్తి ఆధ్వర్యంలో నాయుడు పంపు జంక్షన్ వద్ద నిరసన తెలిపారు.

పాపాల భైరవుడు సీఎం కేసీఆర్

- ప్రగతి భవన్‌పై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం
- ఎమ్మెల్యే శంకర్ నాయక్‌ను పొలిమేరలు దాటించండి
- మెడికల్ కళాశాల పేరుతో భూములు ఆక్రమణ
- టీపీసీసీ అధ్యక్షులు అనుముల రేవంత్ రెడ్డి



నవతెలంగాణ-మహబూబాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఈ తొమ్మిదేండ్లలో అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు, రైతులు, దళితులు, గిరిజనులు, మహిళలు అవస్థలు పడ్డారని, పాపాల భైరవుడు కేసీఆర్‌ను 100 మీటర్ల గొయ్యి తీసి పాతి పెడితేనే తెలంగాణకు రక్ష అని టీపీసీసీ అధ్యక్షులు అనుమల రేవంత్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి చేపట్టిన 'హాత్ సే హాత్' జోడో యాత్ర మూడవ రోజు బుధవారం మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో కొనసాగింది. ఉదయం కేసముద్రం మండలం పెనుగొండలో ప్రారంభమైన పాదయాత్ర మహబూబాబాద్ మండలం ఈదుల పూసపెల్లి వరకు కొనసాగింది. మానుకోట అంబేద్కర్ సెంటర్లో ఎమ్మెల్యే సీతక్క, మాజీ కేంద్రమంత్రి బలరాం నాయక్‌తో కలిసి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ నిజామ్ నవాబ్‌లా మారాడని, టీఆర్ఎస్ నాయకులు రజాకార్లులా వ్యవహరిస్తున్నారని, ఎమ్మెల్యే శంకర్ నాయక్ కేసీఆర్‌కు సామంత రాజుగా ఉన్నారని విమర్శించారు. మానుకోటలో అపారమైన ఖనిజ సంపద ఉందని, ఉక్కు పరిశ్రమ ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. మానుకోటలో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎవరికి వచ్చినా కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి గెలిపించాలని కోరారు. యాత్రలో.. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు జన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ తెలంగాణ నేత రోహిత్ చౌదరి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ విజయ్ రమణారావు, పీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి, నాయకులు సిరిసిల్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

హక్కుపత్రాలెప్పుడు?

(మొదటిపేజీ తరువాయి)

స్థాయిలోనే దరఖాస్తులకు ఆమోదం తెలిపినట్టు తెలుస్తోంది. గిరిజనేతరులను గుర్తించడం లేదని మంత్రులు తేల్చిచెబుతున్నారు. ఆన్‌లైన్‌లో వారికి సంబంధించిన సమాచారాన్ని చేర్చకపోవడంతో ఆ దరఖాస్తులను పక్కన పెట్టినట్టు అధికారులు తెలిపారు. అర్హులైన వారందరికీ పోడు పట్టాలు ఇవ్వాలని గిరిజన సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. షెడ్యూల్డ్ తెగలు, ఇతర సంప్రదాయ అటవీ నివాసుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం- 2006 కింద పట్టాల మంజూరు కోసం 2021 నవంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్ని గ్రామ, డివిజన్, జిల్లా స్థాయి కమిటీల్లో పరిశీలించారు. 2,845 గ్రామ పంచాయతీల్లో గిరిజన, గిరిజనేతర రైతుల 12.49 లక్షల ఎకరాల అటవీ భూములకు సంబంధించి 4.14 లక్షల ధరకాస్తులు చేశారు. వారిలో అర్హులను ఎంపిక చేయాలి. దానికి సంబంధించి తుదిరూపు ఇచ్చేందుకు అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే, 11.50 లక్షల ఎకరాలకు పట్టాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారని సమాచారం.

విచారణపై ఆరోపణలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 29,949 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 20,446 దరఖాస్తులు రాగా, సూర్యాపేట జిల్లాలో 7,373, యాదాద్రి భువనగిరి జిల్లాలో 2130 దరఖాస్తులు వచ్చాయి. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా మిర్యాలగూడ డివిజన్లో 12,337 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 10 నుంచి 20 శాతం దరఖాస్తులకే అధికారులు ఆమోదం తెలిపినట్టు సమాచారం.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 66 వేల దరఖాస్తులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 38 మండలాల్లో 248 పంచాయతీల్లోని 711 గ్రామాల్లో గిరిజనులు, ఇతర రైతుల నుంచి 66 వేల దరఖాస్తులు అందాయి. నాలుగు జిల్లాల్లో 2,27,129 ఎకరాల అటవీ భూములను సాగు చేస్తున్నట్టు దరఖాస్తుదారులు సూచించారు. మరోవైపు దరఖాస్తులు స్వీకరించి చాలారోజులు దాటినా వాటిపై ఎటువంటి మార్గదర్శకాలూ విడుదల చేకపోవడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పోడు రైతులు నిరాశలో ఉన్నారు. పోడు భూములు ఉన్న గిరిజన, గిరిజనేతర రైతులు పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో నమోదు చేసుకున్నారు. జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు 2510 దరఖాస్తులకు చెందిన 1032 ఎకరాల్లోనే సర్వే పూర్తి చేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని 66 గ్రామాల్లో పోడు ఉన్నట్టు అధికారులు గుర్తించారు.

ఆన్‌లైన్‌లో ఆప్షన్ లేని గిరిజనేతరుల దరఖాస్తులు

పోడు భూముల్ని సాగు చేసుకుంటున్న గిరిజనేతరులను పక్కన పెట్టినట్టు తెలిసింది.. ఆన్‌లైన్‌లో వారికి సంబంధించిన ఆప్షన్ లేకపోవడంతో సబ్ డివిజన్ స్థాయిలోనే గిరిజనేతరుల దరఖాస్తుల్ని తిరస్కరించినట్టు సంగారెడ్డి, సిద్దిపేట గిరిజనాభివృద్ధి శాఖ అధికారి ఫిరంగి తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 1,130 మంది గిరిజనులు 1,770 ఎకరాల్ని సాగు చేసుకుంటున్నట్టు గ్రామ స్థాయి కమిటీలో గుర్తించారు. 312 మంది గిరిజనేతరులు 509.20 ఎకరాల్ని సాగు చేసుకుంటున్నట్టు గుర్తించారు. మెదక్ జిల్లాలో 1061 మంది గిరిజనులు, 2954 గిరిజనేతరులు పోడు భూములు సాగు చేసుకుంటున్నట్టు ప్రతిపాదించారు. మెదక్ జిల్లాలో గ్రామ సభల నుంచి 510 గిరిజనులు అర్హులుగా ప్రతిపాదిస్తూ సబ్ డివిజన్ స్థాయి కమిటీకి పంపారు. అయితే, మెదక్‌లో సబ్ డివిజన్ కమిటీ 171 మంది పేర్లను మాత్రమే జిల్లా కమిటీకి పంపింది.

కొందరికేనా...?

కొత్తగూడెం, భద్రాచలం డివిజన్ల పరిధిలోని హాబిటేషన్ల నుంచి 11532 ధరకాస్తులకు 30,684.29 ఎకరాలకు పోడు పట్టాలు జారీ చేయాలని నిర్ణయించినట్టు అధికారులు చెబుతున్నారు. తొలి విడత విచారణ పూర్తయిన క్లెయిమ్స్ ఆధారంగా అర్హుల ఎంపిక జరుగుతుంది. ఖమ్మం జిల్లాలో 10 మండలాలకు చెందిన 94 గ్రామ పంచాయతీల్లో 132 ఆవాసాల నుంచి దరఖాస్తులు అందాయి. షెడ్యూల్ తెగలకు సంబంధించి 9,507 దరఖాస్తులు 25,515 ఎకరాల్లో హక్కు పత్రాల కోసం రాగా, గిరిజనేతరుల నుంచి 8,980 దరఖాస్తులు 17,678 ఎకరాలు, మొత్తంగా 18,487 దరఖాస్తులు 43,193 ఎకరాల్లో హక్కు పత్రాల కోసం వచ్చాయి. అయితే, పోడు భూముల దరఖాస్తుదారుల్లో కొందరికే హక్కు పత్రాలందుతాయని గణాంకాలను బట్టి అంచనా వేస్తున్నారు.

రాష్ట్రం విజ్ఞప్తులు పట్టని కేంద్రం

2005 డిసెంబర్ 13 కంటే ముందు పోడు సాగు చేసుకున్న వారిని ఎంపిక చేయడం వల్ల అందరికీ అవకాశం ఉండదని కటాఫ్ తేదీని 2018 వరకు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. రాష్ట్రం విజ్ఞప్తులను కేంద్రం పట్టించుకోలేదు. కానీ, అటవీ సంరక్షణ నియమాలు-2022 పేరుతో అడవులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు బీజేపీ ప్రభుత్వం చట్టం తీసుకురాబోతుంది. సాగు చేసుకుంటున్న గిరిజనులను ఆదుకోకుండా.. కార్పొరేట్లకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. కేంద్రం వైఖరిని గిరిజన సంఘాలు, వామపక్షపార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

మా కల నెరవేర్చండి.. : గిరిజనులు

మా తాతతండ్రుల కాలం నుంచి పోడు భూమిని సాగు చేసుకుంటున్నాం. వర్షాధార పంటలైన పత్తి, కంది పండిస్తాం. దీనిపై వచ్చే డబ్బులతోనే బతుకుతం. కేసీఆర్ సీఎం అయ్యాక పట్టాలిస్తామని ప్రకటించారు. సీఎం సారు మా దశాబ్దాల కల నెరవేరుస్తారని చూస్తున్నం.

మైనార్టీ, గిరిజన బంధును అమలు చేయాలి : జాఫ్రీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళితబంధుతోపాటు మైనార్టీ, గిరిజన బంధును కూడా అమలు చేయాలని శాసనమండలిలో ఎంఐఎం పక్షనేత అమీనుల్ హసన్ జాఫ్రీ డిమాండ్ చేశారు. బుధవారం శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ, గిరిజన బంధును అమలు చేస్తామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అది ఎప్పటి నుంచి అమలు చేస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయని విమర్శించారు. వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామంటూ 2018 ఎన్నికల్లో హామీ ఇచ్చారని చెప్పారు. ఎన్నికల హామీని నాలుగేండ్లయినా అమలు చేయలేదన్నారు. ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని అన్నారు. దీనిపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని కోరారు.

బీజేపీకే అమృత కాలం....జనానికి ఆపద కాలం

(మొదటిపేజీ తరువాయి)

క్రియాశీలకంగా పని చేస్తున్నది.

పాలకులకు అమత్‌కాలమైతే ప్రజలకు ఆపద కాలం

దేశ పాలకులకు ఇది అమత్ కాలమైతే.. ప్రజలకు మాత్రం కనీసం తాగునీరు దొరకని ఆపద కాలం. రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంతో దేశం ముందు ఓ మోడల్‌ను పెట్టింది. దీన్ని చూసి కూడా మిగతా రాష్ట్రాలు ఎందుకు చేయలేక పోతున్నయ్. నిధులు లేకనా? నీళ్ల లేకనా? అసలు విషయం ప్రజల పట్ల ప్రేమ, మమకారం లేకపోవడం. ఏ రాష్ట్రంలోనూ మన తరహాలో పథకాలు అమలుకావడం లేదు. దేశంలోని కొన్ని రాజకీయ పార్టీలకు రాజకీయాలంటే ఒక గేమ్. కానీ, సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి పాలిటిక్స్ ఒక టాస్క్. ఏ లక్ష్యాన్ని అయినా పట్టుదలతో పూర్తిచేసేలా ప్రజల కోణంలో, మానవీయ కోణంలో పని చేసేది బీఆర్ఎస్ ప్రభుత్వం. మూడునాలుగేండ్లల్లో పూర్తి చేయడం ఓ భగీరథ యత్నం. సీఎం కేసీఆర్ ఒక టాస్క్‌గా తీసుకోవడంతోనే ఇది సాధ్యమైంది. ఇదీ మాకు మిగతా పార్టీలకు ఉన్న తేడా.

కాపీ కొట్టినా పనులు చేయలే..

రాష్ట్రంలో బీఆర్ఎస్ పరిపాలన, దేశంలో మోడీ నాయకత్వంలో బీజేపీ పరిపాలన ఒకేసారి ప్రారంభమయ్యాయి. మేం 2020 నాటికి మిషన్ భగీరథను పూర్తి చేశాం. కేంద్ర జల్‌జీవన్ మిషన్ 2022లో మిషన్ భగీరథలో ఇంటింటికి మంచినీరు ఇచ్చినందుకు రాష్ట్రానికి అవార్డు ఇచ్చింది. మన పథకాన్ని 'హర్‌ఘర్‌కో జల్' పేరుతో కాపీ కొట్టారు కానీ.. పనులు నేటికీ పూర్తికాలేదు. కేసీఆర్ ఇచ్చిన పథకాన్ని తీసుకువస్తే కేంద్రం దీన్ని దేశమంతా అమలు చేయడం రాష్ట్రానికి గర్వకారణం. దేశ ప్రజలకు సురక్షితమైన తాగునీరు ఇవాళ 49శాతం మందికి మాత్రమే అందుతుంది. అమత్ కాలమని గొప్పలుచెప్పుకుంటున్నవారు, ఇంకా 51శాతం మంది ప్రజలు కనీస సౌకర్యమైన తాగు నీటికి దూరంగా ఉన్నారని గుర్తించలేకపోతున్నారు. మిషన్ భగీరథ ప్రాజెక్టుకు రూ.44,933.66 కోట్ల అంచనాతో ప్రభుత్వం పరిపాలనా అనుమతులను మంజూరు చేసినా, వాస్తవ వ్యయం రూ.36,900 కోట్లు మాత్రమే. రూ.8,033.66 మిగిలింది.

బీజేపీ సక్సెస్ అయింది ఇందులోనే..!

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. గతంలో బడ్జెట్లను ప్రవేశపెట్టేటప్పుడు ఒక దశ దిశ ఉండేది. ఆర్థిక సర్వేలకు దగ్గరగా కేంద్ర బడ్జెట్ ఉండేది. కానీ బీజేపీ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేండ్లలో బడ్జెట్‌లో చెప్పేది ఒకటి, ఆచరణలో చేసేది మరొకటి. మోడీ మొదటి బడ్జెట్‌లో చెప్పిన "సబ్ కా సాత్.. సబ్ కా వికాస్". కానీ ఆ ఏడాదంతా మాబ్ లించింగ్‌లు జరిగాయి. రెండో బడ్జెట్‌లో నల్లధనాన్ని అరికడుతాం అని చెప్పారు. కానీ మరుసటి సంవత్సరమే పెద్ద నోట్లను రద్దు చేశారు. ఆర్థిక వ్యవస్థ చితికి పోయిందని గుర్తు చేశారు. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజల బతుకులు రోడ్డున పడ్డాయి. నల్లధనం తెచ్చి, ప్రజల ఖాతాల్లో వేస్తామని మోడీ చెబితే.. ప్రజలు జన్‌ధన్ ఖాతాలు తెరిచి ఎదురు చూస్తున్నారు. ఇప్పటికి కూడా ఒక్క పైసా డిపాజిట్ కాలేదు. మూడో బడ్జెట్‌లో రైతులకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు ప్రకటించారు. కానీ రైతులను పట్టించుకోకుండా, 2020లో మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకొచ్చారు. 750 మంది రైతుల ఉసురు పోసుకున్నారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు అన్నారు.. ఇవ్వలేదు. అర్హులైన వాందరికి ఇండ్లు అని ప్రకటించారు.. అది అడ్రస్ లేదు. రైతుల ఆదాయం రెట్టింపు చేయలేదు. నదుల అనుసంధానం కాలేదు. అంతే కాదు.. బీజేపీ విజయాలు కూడా కొన్ని చెప్పుకోవాల్సిన అవసరం ఉంది.

బీజేపీ అంత్యోదయ సిద్ధాంతాన్ని వదిలేసి అదానీ సిద్ధాంతాన్ని అమలు చేస్తున్నది

బీజేపీ ప్రభుత్వం అంత్యోదయ సిద్ధాంతాన్ని వదిలేసి.. అదానీ సిద్ధాంతాన్ని అమలు చేస్తున్నది. చిట్ట చివరి వ్యక్తి వరకు సంక్షేమ ఫలాలు అందించాలన్నదే అంత్యోదయ సిద్ధాంతం. కానీ బీజేపీ "పేద ప్రజల సంక్షేమం వద్దు, కార్పొరేట్లకు దోచిపెట్టుడే ముద్దు" అన్నచందంగా వ్యవహరిస్తున్నది. దేశానికే ఆదర్శంగా మారిన తెలంగాణ ప్రగతి విపక్షాలకు కనబడటం లేదు.. వినపడటం లేదు. వారు నిస్సారమైన విమర్శలు చేస్తున్నారు తప్ప.. వారికి నిర్మాణాత్మకమైన ధోరణి లేదు. తాము అప్పులు తగ్గించుకుంటూ వస్తుంటే.. కేంద్రం అప్పులు పెంచుకుంటూ పోతుంది. ఈ రాష్ట్రం యొక్క జీఎస్‌డీపీ ఎంత..? దానిలో ఎంత శాతం ఈ రాష్ట్రం అప్పులు కలిగి ఉన్నది. అది అప్పులను చూసే పద్ధతి. అప్పులు ఇన్ని లక్షల కోట్లు పెంచారని విపక్ష సభ్యులు అంటున్నారు.

సంపాదకీయం

పాలక, కార్మికవర్గానికి సవాలుగా ఫ్రెంచి పెన్షన్ సంస్కరణ!

పెన్షన్ సంస్కరణల పేరుతో తమ మీద తలపెట్టిన దాడిని ఫ్రెంచి కార్మికవర్గం తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. ఉద్యోగ విరమణ వయస్సును 62 నుంచి 64కు పెంచాలని అధ్యక్షుడు ఇమ్మాన్యుయల్ మక్రాన్ చేసిన ప్రతిపాదనకు నిరసనగా మరోసారి మంగళవారంనాడు సమ్మె, నిరసన ప్రదర్శనలు జరిగాయి. శనివారంనాడు ఆందోళన పునరావృతం కానుంది. ప్రభుత్వ మొండి వైఖరి కారణంగా అవసరమైతే నిరవధిక సమ్మెకు దిగాలన్న

> మంగళవారంనాడు నిరసన ప్రదర్శనల్లో ఉన్నవారు ఏడున్నరలక్షల మంది అని అధికారులు చెప్పినప్పటికీ కార్మిక సంఘాల సమాచారం ప్రకారం 20లక్షల మంది కార్మికులు పాల్గొన్నట్లు అంచనా. ఒక్క పారిస్ నగరంలోనే నాలుగు లక్షల మంది ఉన్నారు. రైలు, విమాన,బస్సు సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా తగ్గింది, పెట్రోలు బంకులు పని చేయలేదు. నిరసన ప్రదర్శనలు, దిగ్బంధనం, సమ్మెలో అనేక చోట్ల టీచర్లు, విద్యార్థులు, పర్యావరణ ఉద్యమ కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

అభిప్రాయం రోజు రోజుకూ బలపడుతోంది. వెనక్కు లాగాలని చూస్తున్న కొందరు కార్మిక నేతలను ఏమిటీ మెతక వైఖరి అంటూ నిలదీస్తున్నారు. పెన్షన్ సంస్కరణలకే పరిమితం కాకుండా మొత్తం ప్రభుత్వ విధానాల గురించి చర్చ సాగుతోంది. 1995 నిరసనల తరువాత కార్మికవర్గం మరోసారి పెద్ద ఎత్తున వీధుల్లోకి వస్తున్నట్లు కొందరు చెబుతున్నారు. ఎలాగైనా సరే నిరసనను అణచివేసేందుకు ప్రభుత్వం దారులు వెతుకుతోంది. గతేడాది జరిగిన ఎన్నికల్లో మక్రాన్ అధ్యక్షుడిగా నెగ్గినప్పటికీ పార్లమెంటులో మెజారిటీని సాధించటంలో అధికారపక్షం విఫలమైంది. దీంతో ప్రతిపక్ష మితవాద పార్టీలను కలుపుకొని పెన్షన్ సంస్కరణల బిల్లును నెగ్గించుకోవటం, లేకుంటే ఓటింగ్‌తో నిమిత్తం లేకుండా అధ్యక్షుడికి ఉన్న అధికారాలతో ఉత్తరువులు జారీ చేయటమా అన్న గుంజాటనలో అధికారపక్షం ఉంది.



ఐరోపాలోని అనేక దేశాల్లో ఉద్యోగ విరమణ వయస్సుతో పోల్చితే ఫ్రాన్స్‌లో తక్కువగా ఉందని ప్రభుత్వం వాదిస్తోంది. ఇప్పుడు గనుక పెంచకపోతే తరువాత మొదటికే మోసం అంటూ బెదిరిస్తోంది. పెన్షన్ చెల్లింపు సంవత్సరాలను తగ్గించుకొనేందుకు, కార్మికుల నుంచి వసూలు చేసే మొత్తాలను పెంచేందుకు అనేక దేశాల్లో పాలకవర్గం చూస్తోంది. వివరాలను చూసినపుడు పూర్తి మొత్తం పెన్షన్ పొందాలంటే కార్మికులు నిర్దిష్ట ఉద్యోగ విరమణ వయస్సుకంటే ఎక్కువ సంవత్సరాలు పని చేయాల్సి వస్తోంది. ఫ్రాన్సులో 62 ఏండ్లే ఉన్నప్పటికీ 64.5 సంవత్సరాలు చేస్తే తప్ప పూర్తి పెన్షన్‌కు అర్హత రావటం లేదు. నిర్మాణం వంటి కొన్ని రంగాలలో యజమానులు వృద్ధులుగా ఉన్న వారిని పనిలోకి తీసుకొనేందుకు నిరాకరిస్తుండటంతో పాక్షిక పెన్షన్ మాత్రమే లభిస్తోంది. అదే విధంగా మహిళలు ప్రసూతి ఇతర కారణాలతో తీసుకొనే సెలవుల వలన వారు కూడా ఎక్కువ సంవత్సరాలు పని చేయాల్సి వస్తోంది. అందువలన మక్రాన్ ప్రభుత్వం మరో రెండు సంవత్సరాలు అధికారికంగా పెంచితే ఆ మేరకు అదనంగా పనిచేయాలి. పూర్తి పెన్షన్ పొందాలంటే 43 సంవత్సరాల పాటు సర్వీసులో ఉండాలి.

మంగళవారంనాడు నిరసన ప్రదర్శనల్లో ఉన్నవారు ఏడున్నరలక్షల మంది అని అధికారులు చెప్పినప్పటికీ కార్మిక సంఘాల సమాచారం ప్రకారం 20లక్షల మంది కార్మికులు పాల్గొన్నట్లు అంచనా. ఒక్క పారిస్ నగరంలోనే నాలుగు లక్షల మంది ఉన్నారు. రైలు, విమాన,బస్సు సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా తగ్గింది, పెట్రోలు బంకులు పని చేయలేదు. నిరసన ప్రదర్శనలు, దిగ్బంధనం, సమ్మెలో అనేక చోట్ల టీచర్లు, విద్యార్థులు, పర్యావరణ ఉద్యమ కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకించే వారు పెరుగుతున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలంటూ ప్రతిపక్ష మితవాద పార్టీలను అధికారపక్షం కోరుతోంది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో పెన్షన్ సంస్కరణలపై వామపక్ష ఎంపీలు కార్మికవర్గం తరఫున గట్టిగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. సోమవారంనాడు సమావేశం వాడివేడిగా జరిగింది. అడుగడుగునా అడ్డు తగలటంతో వచ్చే పదిహేను రోజులూ ఇలాగే సభను సాగనివ్వరా అంటూ మక్రాన్ మండిపడ్డాడు. అవును అంటూ ప్రతిపక్షం అంతే గట్టిగా చెప్పింది.

పార్లమెంటులో మెజారిటీ లేనందున ప్రభుత్వం ప్రజాస్వామ్యవిరుద్ధమైన చర్యలకు పూనుకొనేందుకు సిద్ధమవుతోంది. రాజ్యాంగంలోని 49.3 నిబంధన ప్రకారం చర్చతో నిమిత్తం లేకుండా ఉత్తరువుల జారీకి అవకాశం ఉంది. అయితే ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం పెట్టి పాలకపార్టీని ఓడిస్తే కొత్తగా ఎన్నికలు జరపటం తప్ప మరొక అవకాశం లేదు. ప్రతిపక్ష పార్టీలు అందుకు సుముఖంగా లేనందున మక్రాన్ ముందుకు పోవచ్చు. మరొక నిబంధన ప్రకారం 50 రోజుల పార్లమెంటు చర్చల తరువాత కూడా ఆర్థిక అంశాలకు ఆమోదం పొందకపోతే అధ్యక్షుడి ప్రత్యేక అధికారాలను వినియోగించి అమలు జరపవచ్చు. ఇంతవరకు ఈ అస్త్రాన్ని ఏ ప్రభుత్వమూ ఉపయోగించనందున అది మరింత పెద్ద రాజ్యాంగ చర్చకు దారితీస్తుంది. వామపక్షాలు మినహా మిగిలిన మితవాద ప్రతిపక్షాలన్నీ అధికారం కోసం తగాదా పడటం తప్ప కార్మిక వ్యతిరేక సంస్కరణల మీద పెద్దగా పట్టుబట్టే అవకాశం లేదు. పశ్చిమ దేశాల్లో మాంద్యం ముంచుకు వస్తున్నందున పాలకవర్గం ఎంతకైనా తెగించే అవకాశం ఉంది. అందువలన పాలకవర్గంతో పాటు ఫ్రెంచి కార్మికవర్గానికి కూడా ఇది ఒకసవాలు వంటిదే.

నీవు నేర్పిన విద్యయే నరేంద్ర భాయి!

> ఇన్ని సవాళ్ల మధ్యనా ధైర్యంగానే పఠాన్ విడుదల చేశారు. చాలా కాలం తర్వాత వచ్చిన షారుఖ్ సినిమా వివాదాలన్నిటినీ తోసిపుచ్చి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అడ్వాన్స్ బుకింగ్స్‌తోనే పద్నాలుగు కోట్లు వసూలు చేసింది. నిన్నటివరకు చూస్తే దాదాపు రూ.నాలుగు వందల నలభై తొమ్మిది కోట్లు రాబట్టినట్టు తెలుస్తోంది. నాలుగేండ్ల తర్వాత ఆయనకు లభించిన ఘన విజయం సంఘ్ పరివార్ ప్రచారాలను వారు పట్టించుకోబోరని చాటింది. బహుశా ప్రధాని హఠాత్తుగా మారిపోవడానికి ఇదో కారణం కావచ్చు. విశ్వహిందూ పరిషత్ కూడా నిరసనను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించింది. ఇక మొదట్లో చెప్పుకున్న మధ్యప్రదేశ్ మంత్రి కూడా చిత్రం సెన్సార్ సర్టిఫికెట్ పొందిన తర్వాత ఇంకా దాన్ని నిరసించడంలో అర్థం లేదని తోక ముడిచారు.

సినిమాలపై అనవసర వ్యాఖ్యలు చేసి వివాదాలు పెంచవద్దని ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో చెప్పడం బాగా ప్రచారం పొందింది. ఆలస్యంగానైనా మోడీ సరైన పిలుపునిచ్చారని కొందరు కొనియాడారు. సహజంగానే చిత్రపరిశ్రమ సంఘాలు స్వాగతించాయి. ఆ ఉపన్యాసానికి కొద్దిగా ముందే మధ్యప్రదేశ్ మంత్రి నరోత్తమ్ మిశ్రా 'పఠాన్' సినిమా గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేసి దుమారం రేపారు. చాలాకాలం తర్వాత హిందీ తెరపై మళ్లీ తన స్థాయిలో పునఃప్రవేశం చేసిన షారుఖ్ ఖాన్, దీపికా పదుకునే నటించిన ఈ చిత్రం విడుదలకు ముందే 'బేషరమ్ రంగ్...' అనే ఒక పాట విడుదలైంది. అందులో నాయిక ధరించిన బికినీ కాషాయ రంగులో ఉండటం సంఘ్ పరివార్ దాడికి కారణమైంది. ఇది పదిహేను సెకన్ల వ్యవహారం మాత్రమే. వారితోపాటు ఎప్పుడూ బీజేపీకి వత్తాసుగా ఉండే కేంద్రమంత్రి రామ్‌దాస్ అథవాలే కూడా వంతపాడారు. కాషాయం కేవలం బీజేపీ రంగు మాత్రమే కాదు, గౌతమ బుద్ధుడు కూడా అవే ధరించేవాడు అంటూ తనకు తోచిన చరిత్ర చెప్పారు. ఇది పార్లమెంటులోనూ చర్చకు వచ్చింది. బీఎస్‌పీ సభ్యుడు దానిష్ అలీ మాట్లాడుతూ సనాతన ధర్మం గానీ, ఇస్లాం గానీ ఒక పాటతోనే కొట్టుకు పోయేంత బలహీనమైనవి కావని వ్యాఖ్యానించారు. ఎందుకంటే ఈ పాటలో ఆకుపచ్చ రంగు వాడటంపై కూడా కొందరు మౌల్వీలు నిరసన తెలిపారట. బేషరమ్ రంగ్ అంటే సిగ్గులేని రంగు అనే పాటపదాలు కాషాయాన్ని అవమానిస్తున్నాయని వారి ఆరోపణ. అయితే పూర్తి పాట వింటే గనక నా అసలు రంగు మీకు తెలియదు అని అర్థం. కాని కావాలని చేసిన దుష్ప్రచారంతో ఆ పాటను, చిత్రాన్ని నిషేధించాలనే వరకూ కథ నడిచింది. ఈ మొత్తం పాట వేరే రంగులతో రీషూట్ చేయాలంటూ షారుఖ్ దీపికల ఫొటోలను దగ్ధం చేశారు. కొన్నేండ్లు పోతే తాము మన సంస్కృతికి అనుగుణంగా ఉండే రంగులనే ఉపయోగించేలా చేస్తాం గనక రంగు రాజకీయాలు చెల్లబోవని బీజేపీ కార్పొరేటర్ వినోద్ మిశ్రా హెచ్చరించారు. ఒక రంగును సిగ్గులేనిదిగా చెప్పడమే తప్పు అని కూడా ఆయన సెలవిచ్చారు. మొత్తంపైన ఇది తీవ్ర వివాదంగానే పరిణమించింది.

ఈ వివాదంపై దర్శకుడు ఆనంద్ పట్వర్ధన్ మాట్లాడుతూ మితవాద పార్టీలు సినిమాను రాజకీయాల కోసం వాడుకుంటున్నాయని విమర్శించారు. వినోదం కోసం ఉద్దేశించిన సినిమాను మత రాజకీయాల కోసం వివాదంగా మారుస్తున్నారన్నారు. కాశ్మీర్ ఫైల్స్ వంటి చిత్రాన్ని కేవలం ఈ భావాల కోసమే ప్రోత్సహించారు. అది కేవలం ప్రచారం కోసం తీసిన సినిమా. ఆఖరుకు దాన్ని గోవా చలన చిత్రోత్సవంలోనూ తగాదాగా మార్చారు. ప్రచార చిత్రంగనక అవార్డుకు ఎంపిక చేయలేదని జ్యూరీ అధ్యక్షుడు చెబితే అతనిపై దాడి చేశారు. ఈత దుస్తుల్లో స్త్రీ శరీర కదలికలున్నాయని మతవాదులు ఎప్పుడూ గొడవ చేస్తుంటారు. కాని 'దిల్ వాలే' చిత్రంలోనూ 'రంగ్ దే తూ మోహె గేరువా...' అని పాట ఉంది కదా! దానికి ఎలాంటి అభ్యంతరం రాలేదే? అని రచయిత శ్రీమోయి పి కుందు ప్రశ్న వేశారు. ఈ విషయం అలా ఉంచితే షారుఖ్ ఖాన్ పాత వ్యాఖ్యలను కూడా తవ్వి తీసి వివాదం రగిలించే కుట్రలు చాలా జరిగాయి. సుశాంత్ రాజ్‌పుత్ ఆత్మహత్య తర్వాత కంగనా రనౌత్ వంటి వారు రేపిన రభస కారణంగా ఆమీర్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, షారుఖ్‌ఖాన్‌లను బహిష్కరించాలనే రచ్చ చాలాకాలం నడిచింది. ఈ కారణంగా లాల్ సింగ్ చద్దా, రామ్ సేతు వంటి చిత్రాలు ఊహించినదానికన్నా చాలా ఘోరంగా దెబ్బతిన్నాయి. బ్రహ్మాస్త్ర కూడా. వాస్తవానికి చివరి రెండు చిత్రాలు హిందుత్వ భావజాలానికి కొంత అనువుగా ఉన్నవే. అయితే వాటిలో నటించిన వారిపై విద్వేష ప్రచారంతో నడవకుండా చేశారు. ఇవన్నీ బాలీవుడ్‌ను కుదిపేశాయి.

ఇదే సమయంలో కాశ్మీర్ ఫైల్స్‌ను ఆకాశానికెత్తారు. ఏకపక్ష హిందుత్వ భావజాలంతో తీసిన ఆ చిత్రాన్ని



ఏకంగా ప్రధాని నరేంద్రమోడీ ఆకాశానికెత్తి ప్రచారం కల్పించారు. అదే కోవలో ఆర్‌ఆర్‌ఆర్‌కూ ఊతమిచ్చారు. అచ్చంగా అలాంటిదే కాకున్నా తెలుగు వీరుల గురించి ఊహలు జోడించి తీసిన ఈ చిత్ర కథకుడు విజయేంద్ర ప్రసాద్‌ను రాజ్యసభకే నామినేట్ చేశారు. దాంట్లో ఒక నాయకుడుగా నటించిన జూనియర్ ఎన్టీఆర్‌ను స్వయంగా అమిత్‌షా వచ్చి కలుసుకున్నారు. తనతో ఆరెస్సెస్ ఇతివృత్తంతో ఒక చిత్రం తీయనున్నట్టు సమాచారం. కాశ్మీర్ ఫైల్స్ నిర్మాతలే కార్తికేయ-2 ద్వారకానగర పురాణంతో తీశారు. బాహుబలి ప్రభాస్‌తో ఆదిపురుష్ తీస్తున్నారు కూడా. రంగస్థలం, పుష్ప చిత్రాల దర్శకుడు సుకుమార్‌తోనూ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇలా చెబుతూ పోతే సినిమా రంగంలో కాషాయ కథలజోరు బాగా పెరిగింది. ఇందుకు సమాంతరంగా షారుఖ్ వంటి వారిపై వ్యతిరేక ప్రచారమూ నడుస్తున్నది. ఇవన్నీ భరించలేకనే కోల్‌కతా చిత్రోత్సవంలో అమితాబ్ బచన్, షారుఖ్ ఖాన్‌లు గతంలోని చిత్రాలకూ ఇప్పటికీ తేడాను చెబుతూ ఆందోళన చెందారు.

ఇన్ని సవాళ్ల మధ్యనా ధైర్యంగానే పఠాన్ విడుదల చేశారు. చాలా కాలం తర్వాత వచ్చిన షారుఖ్ సినిమా వివాదాలన్నిటినీ తోసిపుచ్చి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అడ్వాన్స్ బుకింగ్స్‌తోనే పద్నాలుగు కోట్లు వసూలు చేసింది. నాలుగేండ్ల తర్వాత ఆయనకు లభించిన ఘనవిజయం సంఘ్ పరివార్ ప్రచారాలను వారు పట్టించుకోబోరని చాటింది. బహుశా ప్రధాని హఠాత్తుగా మారిపోవడానికి ఇదో కారణం కావచ్చు. విశ్వహిందూ పరిషత్ కూడా నిరసనను ఉపసంహరించు కుంటున్నట్టు ప్రకటించింది. ఇక మొదట్లో చెప్పుకున్న మధ్యప్రదేశ్ మంత్రి కూడా చిత్రం సెన్సార్ సర్టిఫికెట్ పొందిన తర్వాత ఇంకా దాన్ని నిరసించడంలో అర్థం లేదని తోకముడిచారు. అందితే జుట్టు అందకపోతే కాళ్ల అనే ఫాసిస్టు నీతిని అమలు చేశారు. షారుఖ్ ఖాన్ విజయం పట్ల బాలీవుడ్‌లో ఆయన సన్నిహితులు, అభిమానులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. కరణ్ జోహార్ ప్రత్యేకంగా వ్యాసం రాశారు. ప్రకాశ్‌రాజ్ ఈ చిత్రం విజయాన్ని, వసూళ్లను గురించి ట్వీట్ చేశారు. ఇక జావేద్ అక్తర్ ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ బారుకాట్ బాలీవుడ్ వంటి వాటిని గురించి మాట్లాడటమే దండగని, అవి పని చేయవనీ కొట్టిపారేశారు. షారుఖ్ పెద్దమనిషి మాత్రమేగాక నేను ఎంత లౌకికవాదిగా ఉన్నానో ఆయనా అంతేనని మెచ్చుకున్నారు.

ఇవన్నీ ప్రజలకూ పరిశ్రమకూ ఉన్న లౌకిక ధోరణులు చెబుతాయన్నది నిజమే. అయితే ఇదే సమయంలో కనిపిస్తున్న ఆందోళనకరమైన ఇతర కోణాలను విస్మరిస్తే పొరబాటవు తుంది. సినిమా వివాదాలు వద్దని చెప్పినందుకు మోడీని మెచ్చుకుంటున్న సమయంలోనే 'మోడీ క్వశ్చన్' పేరిట బిబిసి తీసిన డాక్యుమెంటరీని నిషేధించారు. వాటిని ప్రసారం చేయకుండా ట్విటర్, యూట్యూబ్, ఫేస్‌బుక్‌లను ఆదేశించారు. వాస్తవానికి బ్రిటిష్ ప్రభుత్వ అధికారిక సమాచారం మేరకు తీసిన ఆ డాక్యుమెంటరీలో కల్పన ఏదీ లేదు. ఆ కాలంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోడీ సర్కారు గురించిన వాస్తవాలను వెల్లడించింది. అప్పట్లో జరిగిన విచారణలనూ విమర్శలనూ వినిపించింది. బ్రిటిష్ మాజీ హోం మంత్రి అందులో మాట్లాడారు. అయినా సరే అవన్నీ దుష్ప్రచారా లంటూ దేశంలో ప్రసారం కానివ్వలేదు. అందుబాటులో ఉన్న ఇతర మార్గాలలో చిత్రం డౌన్‌లోడ్ చేసుకున్న ఎస్ఎఫ్ఐ వంటి సంస్థలు ప్రదర్శన ఏర్పాటు చేశాయి. గతంలో నిర్బంధానికి గురైన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వంటి చోట్ల ప్రదర్శనలపై పోలీసులు విరుచుకుపడ్డారు. అంతకన్నా దారుణం ఎబివిపి వంటి సంస్థలు దీనికి పోటీగా కాశ్మీర్ ఫైల్స్ ప్రదర్శన నిర్వహించారు. కళారంగంలో భిన్న శక్తుల ఘర్షణకు ఇంతకు మించిన ఉదాహరణ అక్కర్లేదు. దీపికా పదుకునే జేఎన్‌యూ పోరాటానికి కొన్నేండ్ల కిందట సంఘీభావం చెప్పడం కూడా పఠాన్ పాటపై దాడికి ఒక కారణం. ఇంతకూ ఈ చిత్రంలో ప్రకంపనాలు పుట్టించిన 'బేషరమ్...' పాటలో స్పానిష్ చరణాలు పాడిన కారాలిసా మాంటెరో మాట్లాడుతూ... ఈ దేశంలో బికినీ పాటపై వివాదాన్ని మించిన సమస్యలు చాలా ఉన్నాయన్నారు. కాషాయం రంగును జాతీయ జెండాలో చూడటం ఒక్కటే నాకు గుర్తున్న విషయం. దాన్ని ధైర్యానికి, నిస్వార్థతకు చిహ్నంగా భావిస్తాం. మధ్యప్రదేశ్ మంత్రికి అదే ఎందుకు పెద్ద సమస్య అయిందో నాకు తెలియదు అన్నారు. కారాలిసా గతంలో దిల్ చాహతా హై చిత్రంలో పాట పాడటంతో బాగా పాపులర్ అయిన గాయని. ఇలాంటి సానుకూల వ్యాఖ్యలు, వాస్తవాలు ఎన్నయినా ఇవ్వచ్చు. కానీ అవేవీ మన పాలకులకు అవసరంలేదు. సినిమాలే గాక ఇప్పుడు సోషల్ మీడియాలో వార్తలను కూడా ప్రెస్ ఇన్ఫర్‌మేషన్ బ్యూరో తప్పని చెబితే తీసేస్తామని ప్రకటించారు. అయినా మీడియా కళ్లు తెరవకుండా స్వీయ సెన్సార్‌షిప్ పాటిస్తోందని సాయినాథ్ తీవ్రంగా ఆక్షేపించారు.

గాంధీలు, గాడ్సేలు మొత్తంపైన వెనక్కు తిరిగి చూసుకుంటే 2022లో బారుకాట్ బాలీవుడ్, బాయ్ కాట్ విక్రమ్ వేద, బారుకాట్ పఠాన్... అంటూ వచ్చిన పిలుపులు పరిశ్రమను కుదిపేశాయి. ఈ సమయంలోనే దక్షిణాది చిత్రాల అఖండ విజయాలు బాలీవుడ్‌కు ఆందోళన కలిగించాయి. ప్రపంచ దేశాలను ఆకర్షించే దశకు చేరాయి. మన ఎగుమతులలో కాస్తో కూస్తో సొమ్ములు తెచ్చేది చిత్రాలే, మన నిర్మాణాల సంఖ్య ప్రపంచంలోనే అత్యధికం. ఇంగ్లీషు వారికి మన మార్కెట్ కూడా ఎక్కువే. ఈ సమయంలో బహిరంగ వివాదాలు, బారుకాట్లు దేశానికే హానికరమని ఆర్థికవేత్తలూ పరిశ్రమ వర్గాలు కూడా గుర్తించక తప్పని స్థితి. అదే సెగ ప్రధానినీ తాకినట్టుంది. కాని నిజంగా మార్పు లేదనడానికి గాంధీ గాడ్సే చిత్రం ఒక ఉదాహరణ. వివాదాల వల్ల మన గొప్పతనం చెప్పుకోలేకపోతున్నామని మోడీ అన్నది వచ్చే ఎన్నికల కోణం తప్ప ప్రజాస్వామ్య స్ఫూర్తి ఎంతమాత్రం కాదు! అందుకే పారాహుషార్ మరి!

-పీపీ


పాలకుల విధానాలు... వ్యవసాయ సంక్షోభం

> తమ వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటైన మార్కెట్ ధర కల్పించాలని చలిలో, వానలో, ఎండలో వీధుల్లో నిలబడి రైతులు పోరాడారు. పని లేకపోవడంతో రైతు కూలీలు వలసబాట పట్టారు. ఆహార భద్రతా చట్టం నీరుగారిపోయిందని ఆకలి చావులు సూచిస్తున్నాయి. పౌష్టికాహారం అందని కుటుంబాలు, బరువు తక్కువ పిల్లలు, రక్తహీనతకు గురవుతున్న మహిళలు దేశంలో ఎక్కువగా ఉన్నారని అంతర్జాతీయ సూచికలు బహిర్గతపరుస్తూనే ఉన్నాయి. అయినాసరే నిస్సిగ్గుగా అబద్ధాలతో, దొంగ అంకెలతో, ఆర్థిక సర్వేలు, బడ్జెట్లు నిర్వహిస్తూనే ఉన్నారు.

మొన్నటి మన్మోహన్-చిదంబరం నుండి నేటి మోడీ-సీతారామన్ వరకూ తమ సంస్కరణలన్నీ భారతదేశాన్ని ఉద్ధరించేందుకేనని చెప్పడం చూశాం. దేశంలో సింహభాగంగా ఉన్న వ్యవసాయ ఆధారిత ప్రణాళికలన్నిటినీ కేంద్రీకరించామని చెప్పుకొస్తున్నారు. మానవీకరణ అనే ఫూతతో నడిచే మొన్నటి అభివృద్ధి "ఆత్మ నిర్భరత", "అమృత్ కాల్" కవచాలు తొడిగిన నేటి 'ముందడుగు' రైతుల బాగు కోసమేనన్నారు పాలకులు. మరో అడుగు ముందుకేసి 2023 నాటికి రైతుల ఆదాయాన్ని ద్విగుణీకృతం చేస్తామన్నారు. పాలనా రంగ పైలెట్ చైనాను మించిపోయే ఆర్థిక స్థాయి సాధించబోతున్నట్లు పదే పదే ప్రకటిస్తున్నారు. బుకాయింపు ఏ స్థాయికి వెళ్లిందంటే... "శ్రీ అన్న" పథకం ద్వారా భారత దేశాన్ని చిరుధాన్యాల నిలయంగా (మిల్లెట్ గ్రెయిన్ హబ్) గుర్తింపు తేబోతున్నట్లు పలికారు. తాము ప్రవేశపెట్టే డిజిటల్ సాంకేతికాల నేపథ్యంలో వ్యవసాయ ఉత్పత్తులు పెరగడమే గాదు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్ స్టార్టప్ సంపదలు సమకూర్చబోతున్నామన్నారు. దాని కోసం ప్రస్తుత బడ్జెట్‌లో 20లక్షల కోట్ల రూపాయలను కేటాయిస్తున్నారట. పరపతి సౌకర్యాన్ని పెంచారట. ముఖ్యంగా పశుపోషణ డెయిరీలు, జల జంతువుల ఉత్పత్తిదారులకు వీటిని కేటాయిస్తారట. దాన్నే వారు "వ్యవసాయ వేగవంత అభివృద్ధినిధి"గా ప్రముఖంగా పేర్కొన్నారు. సమాంతరంగా కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ పంటల సాగులోకి దించబోతు న్నారట. దానికి తగిన జీవ సంబంధ లేక సేంద్రీయ వనరుల ఉత్పాదకాల కేంద్రాలను నెలకొల్పుతారట. దేశీయంగా రూపొందించబోతున్న బడ్జెట్ రాబోయే 25సంవత్సరాల ప్రగతికి నాందిగా ఉంటుందట. తమ వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటైన మార్కెట్ ధర కల్పించాలని చలిలో, వానలో, ఎండలో వీధుల్లో నిలబడి రైతులు పోరాడారు. పని లేకపోవడంతో రైతు కూలీలు వలసబాట పట్టారు. ఆహార భద్రతా చట్టం నీరుగారిపోయిందని ఆకలి చావులు సూచిస్తున్నాయి. పౌష్టికాహారం అందని కుటుంబాలు, బరువు తక్కువ పిల్లలు, రక్తహీనతకు గురవుతున్న మహిళలు దేశంలో ఎక్కువగా ఉన్నారని అంతర్జాతీయ సూచికలు బహిర్గతపరుస్తూనే ఉన్నాయి. అయినాసరే నిస్సిగ్గుగా అబద్ధాలతో, దొంగ అంకెలతో, ఆర్థిక సర్వేలు, బడ్జెట్లు నిర్వహిస్తూనే ఉన్నారు. ఆహార పంపిణీ వ్యవస్థను, ఉపాధి హామీ చట్టాలను నీరుగార్చే కేటాయింపులు, విశ్లేషణలు, మాటల గారడీ ప్రావీణ్యతను సూచిస్తూనే ఉన్నాయి. గద్దెనెక్కే ముందు చేసిన వాగ్దానాలకు, రైతు ఉద్యమాలకు భయపడి వ్యక్తపరిచిన క్షమాపణ లకు విలువ లేకుండా చేసిన 'దేశభక్తులు' ఈ పాలకులు. వీరికి "ఆహార ఉత్పత్తిదారుల" సంక్షోభం, సామాన్య ప్రజల బతుకు పోరాటం అర్థమవుతుందని వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తారని ఆశించడం అవివేకం.

అవగాహనా వైరుధ్యం

1950-60 వరకూ 70శాతం గ్రామీణులను ఇముడ్చుకున్న వ్యవసాయ వృత్తి రూపాంతరం చెందిందని చెప్పుకోవచ్చు. ముఖ్యమైన అంశం ఈ వృత్తిని వదిలేసిన గ్రామీణులు అధికమవుతూ రావడం. ఫలితంగా 2000 సంవత్సరం నాటికి 55-60శాతం మంది 2020 నాటికి 45-50శాతం మాత్రమే వ్యవసాయాన్ని తమ మూల వృత్తిగా భావించే స్థితి నెలకొన్నది. దానికి ముఖ్య కారణం మిగిలిన గ్రామీణ వృత్తుల్లానే వ్యవసాయం వ్యాపారానికి తగినట్లుగా పరిణితి చెందకపోవడం. అంటే ఉత్పత్తికీ వినియోగానికి మధ్య రూపొందిన మార్కెట్ వ్యవస్థ పాత్ర పెరుగుతూ రావడం. దానికితోడు వృత్తి పరంగా సుస్థిరత, భద్రత లోపించడం. అంతేగాక శారీరక శ్రమ నుండి దూరంగా జరిగే తాత్త్వికతతో రూపొందించిన "విద్యా రంగ" విస్తరణ. ఫలితంగా వ్యవసాయ వృత్తి పూర్తిగా వ్యాపార స్వరూపాన్ని సంతరించుకొన్నది. దానికి ప్రత్యక్ష నిదర్శనమే కేవలం శ్రమ జీవితానికే నెట్టబడ్డ గ్రామీణ కుటుంబాలు కౌలు రైతులుగా మారడం. భూ సొంతదారులకు, శ్రమతోనే బతుకుతున్న గ్రామీణులకు మధ్య రూపొందిన ఘర్షణ పూరిత జీవన సరళి. ఈ



ఒరవడికి పరోక్షంగా పరిశోధనా రంగ నిపుణులు, విస్తరణ రంగ అధికారులు తోడ్పడ్డారు. కూలీలు (శ్రమజీవులు) అవసరంలేని సాంకేతికాలను రూపొందించడం, విస్తరించడం ముఖ్య కర్తవ్యంగా భావించారు. పంటల సాగుతో అనుబంధంగా నడిచే పశువుల, పక్షుల, ఇతర జీవుల పెంపకాన్ని విడివిడిగా నడిపే సాంకేతికాలను ప్రవేశపెట్టగలిగారు. ఈ స్థితి ప్రత్యక్షంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో కనపడుతున్నది. డెయిరీలు, పౌల్ట్రీలు, చేపల చెరువులు పంట సాగుదార్లకు నష్టకరంగా మారాయి. ఈ దశలోనే "వ్యవసాయ వ్యాపకం" అనేది రూపొందింది. దాన్ని ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం, మిద్దె పంటల సాగు, (ఆటవిక) వ్యవసాయ సాగుగా చెప్తున్నారు. ఇతర వృత్తుల ద్వారా భద్రతగల జీవితాలను నడపగలుగుతున్న మధ్య తరగతి పౌరులు, నగరాల్లో సొంత గృహ వసతి, మైదానాల వనరులుగల గృహిణులు ఈ భద్రతగల వ్యాపకంలోకి ప్రవేశించడాన్ని చూస్తున్నాం. అలాగే పెద్ద ఉద్యోగులుగా ముఖ్యంగా ఐ.టి. రంగంలో ఇతర దేశాల్లో పనిచేసిన ప్రముఖులు కూడా ఈ వ్యాపంకంలో ప్రవేశించి ఈ వ్యాపకాన్ని విస్తరించడాన్ని చూస్తున్నాం. ఈ తరహా వ్యవసాయ వ్యాపకానికి ప్రేరణ అనేకమంది పర్యావరణ పరిరక్షణ ఉద్యమకారులు. ప్రఖ్యాత విశ్లేషకులు, ప్రపంచ స్థాయి ప్రకృతి వనరుల అధ్యయన సంస్థలు. సమాంతరంగా వివిధ నేపథ్యాల్లో రూపొందిన రసాయనేతర ఉపకరణాల పాత్రను పెంచగల నిపుణుల తోడ్పాటు ఈ వ్యాపకాన్ని విస్తరింపచేస్తున్నది. రానురానూ ఇది వ్యాపార రూపాన్ని సంతరించుకోవడాన్ని చూస్తున్నాం. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థ రూపొందింది. ఫలితంగా ఈ వ్యాపకాన్ని లాభకర వృత్తిగా మార్చుకున్న "రైతులు కాని రైతులు"ను చూస్తున్నాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా దీన్నొక ఉద్యమంగా ప్రస్తుత సంక్షోభ పరిష్కార మార్గంగా రైతుల ముందుకు దీన్ని (ప్రకృతి పంట సేద్యం) తెస్తున్నారు. ఈ సంవత్సర కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు కూడా దీన్నే సూచిస్తున్నాయి. అంటే ఈ "వ్యాపక వ్యవసాయాన్ని" సన్న, చిన్నకారు రైతు, కూలీలకు 'వృత్తి' కల్పించిన కౌలు వ్యవసాయంలోకి ప్రవేశపెట్టే ప్రయత్నంలో ఉన్నారు. పెట్టుబడి, పంట భద్రత, ప్రత్యామ్నాయ వనరులు, మార్కెట్ సౌకర్యాలకు దూరంగా నెట్టివేయబడిన ఈ రైతులు... ఈ వ్యాపకం లాంటి వ్యాపారంలో నిలబడగలరా? వినియోగదారుణ్ణి రక్షించడానికి భూమి వంటి వనరులను పొదుపు చేయడానికి, ఈ రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని నడపగలరా? నమ్ముకోగలరా?

గతంలో ఒక గ్రోత్ ఇంజిన్ల కలల వ్యాపారి బియ్యాన్ని, చేపలను, రొయ్యలను ఎగుమతి చేసి రాష్ట్రాన్ని ప్రగతి పథకంలో పెట్టబోయాడు. ఇప్పుడు వీళ్ల విష అవశేషాల్లేని ఆహారాన్ని ఎగుమతి చేసి దేశాన్ని ఉద్ధరించబోతున్నారు. వీళ్లే సమాంతరంగా జన్యు మార్పు సాంకేతికాల ద్వారా రూపొందించిన ఆవాలకు, డ్రోన్ సాంకేతికాల ద్వారా నడిచే ఘాటు రసాయన మందులకు అనుమతులు ఇస్తూనే ఉన్నారు.

అందుకే వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించడం ఈ పాలకుల వల్ల కాదు. వీరి బడ్జెట్లు, ప్రణాళికలు ఆహార ఉత్పత్తిదారున్ని భక్షించడానికే. ఉపాధి హామీ, ఆహార భద్రతా హక్కు చట్టాలను అటకెక్కించడమే వీరి లక్ష్యం. ఇలాంటి పాలకులను మార్చడమే ప్రజల తక్షణ కర్తవ్యం.

- ప్రొ॥ ఎన్. వేణుగోపాలరావు
సెల్ : 9490098905



ప్రకృతి ప్రకోపమా... మానవ తప్పిదమా..?


ఎన్. అజయ్‌కుమార్

అక్కడ పేకమేడల్లా కూలిన భవనాలు... శిథిలాల కిందనే మృతదేహాలు... కొనసాగుతున్న సహాయక చర్యలు... భీతిల్లిన ప్రజలు... ఓవైపు హాహాకారాలు... మరోవైపు ఆర్తనాదాలు.... ఇది టర్కీ (తుర్కియే), సిరియాలో మూడు రోజుల కిందట భూ ప్రళయం సృష్టించిన మరణమృదంగం. ఏమిటీ ఘోరం, ఎందుకీ వైపరీత్యం! కారణమేదైనా కావచ్చు. ప్రకృతీ ప్రకోపానికి బలైపోయింది శరణార్థులు, పౌరులు. అక్కడి హృదయవిదారక దృశ్యాలు ప్రపంచాన్ని కంటతడి పెట్టించాయి. కూతుర్ని కోల్పోయి శోకిస్తున్న తండ్రి, బిడ్డకు జన్మనిచ్చి కన్నుమూసిన తల్లి, తమ్ముడిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్న అక్క చూపరుల గుండెల్ని పిండేస్తున్నాయి. ఇంకా కాళ్లు చేతులు కోల్పోయిన వారు, వెన్నుపూస విరిగి లేవలేని స్థితిలో ఉన్నవారు ఎంతో మంది క్షతగాత్రులు తాము బతికే ఉన్నామని, కాపాడాలంటూ ఆర్తనాదాలు చేయడం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. 4700 భవనాలు కూలిపోయాయి. వాటి కింద చిక్కుకున్న మృతదేహాల లెక్క తేలాల్సి ఉంది. మొదట 2,600 చనిపోయి నట్టు వార్తలు వచ్చినప్పటికీ రోజురోజుకూ శవాల గుట్టలు పేరుకుపోతున్నాయి. ఇప్పటివరకు టర్కీలో 7,108మంది చనిపోగా, సిరియాలో సుమారు 2,530మంది మరణించినట్లు అధికారిక సమాచారం. కానీ దాదాపు 20వేల వరకు మర ణాలు ఉండవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) అంచనా. తీవ్రమైన మంచు కారణంగా సహాయక చర్యలకు కొంత ఆటంకం కలుగుతోందని నేషనల్ డిజాస్టర్, ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ అథారిటీ పేర్కొంది. భూ కంపధాటికి పది ప్రావిన్స్‌ల పరిధిలో మూడు నెలల పాటు అత్యవసర పరిస్థితిని విధిస్తున్నట్టు తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ ప్రకటించాడు. మే 14 అధ్యక్ష ఎన్నికలు జరిగే ముందు వరకు ఇది అమల్లో ఉండనుంది.

సిరియాకు అందని ఐరాస సాయం

టర్కీలో అనేక రాష్ట్రాలు, ఓడరేవులు ధ్వంసమయ్యాయి. టర్కీకి సాయపడేందుకు భారత్ ముందుకొచ్చినా సిరియాకు అందాల్సిన ఐక్యరాజ్యసమితి సాయం నిలిచిపోయింది. దశాబ్ద కాలంగా అంతరంగిక యుద్ధంతో అతలాకుతలమైన ప్రాంతంలోనే తాజాగా భూ కంపం కూడా సంభవించడంతో అక్కడి పరిస్థితి చాలా దారు ణంగా ఉంది. ఇప్పటికే మానవతా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సిరియన్లు ఈ భూ ప్రకంపనలతో చాలానే నష్టపోయారు. చరిత్రను చూసినట్టయితే ఐదు భూకంపాలు మానవాళికి పీడకలలుగా మిగిలాయి. ఇప్పటికి కూడా వాటిని తలుచుకుంటే భయంతో వణికి పోయేవారెందరో! రికార్డుల్లో నమోదైన అతిపెద్ద భూకంపం 1960 మే 22న చిలీలోని బయో-బయో ప్రాంతంలో 9.5తీవ్రతతో భూమి దాదాపు కంపించింది. మానవ చరిత్రలో చవిచూసిన అతిపెద్ద ఉపద్రవాల్లో ఇది కూడా ఒకటి. భూకంపం వచ్చిన రెండు గంటలకు రాకాసి అల ఒకటి భారత్‌లో అండమాన్-నికోబార్ దీవులు, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తీరాలను తాకాయి. జపాన్ చరిత్రలో అతిపెద్ద భూకంపం 2011లో నమోదైంది. భారత దేశంలో చూస్తే భూ కంపం తీవ్రత ఆధారంగా నాలుగు భూకంప జోన్లుగా విభజించారు. ఇందులో ఈశాన్య భారతదేశం, ఉత్తర బీహార్, పశ్చిమ, మధ్య హిమాలయ ప్రాంతం, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ (కాంగ్రా), గుజరాత్, అండమాన్ నికోబార్ దీవులు, జమ్మూ కశ్మీర్ ప్రాంతాలున్నాయి. ఈ జోన్ అత్యంత తీవ్ర భూకంపాలు సంభవించే ప్రాంతాలుగా గుర్తించారు. తెలుగు రాష్ట్రాల్లో చూస్తే విశాఖపట్నం, హైదరాబాద్ సేఫ్ జోన్‌లో ఉన్నట్టు నిపుణులు ప్రకటించారు.

మానవ తప్పిదాలు... భూకంపాలు..?


భూభౌతిక పరిణామ ప్రభావాల వలన భూమి అంతర్గత పొరల్లో ఏర్పడే కదలికలు, అగ్నిపర్వతాలలో తలెత్తే మార్పుల ప్రభావం వల్లనే భూకంపాలు సంభవిస్తూ ఉంటాయి. ఇవి ప్రకృతిపరమైనవే అనడంలో ఎటువంటి సందేహమూ లేదు. కాబట్టే వీటిని ఏ విధంగానూ నియంత్రించలేకపోతున్నాం. అయితే పైన పేర్కొన్నట్టు భూభౌతిక పరిణామ ప్రభావాలకు తోడుగా మనుషులు చేసే పనుల వల్ల కూడా కొన్ని సార్లు భూకంపాలు సంభవిస్తూ ఉన్నాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. వాటిలో ప్రధానమైనది ప్రకృతి సమతుల్యతను దెబ్బ తీసే అడవులు నరికివేయడం, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం, భారీ జల విద్యుత్ ప్రాజెక్టులు వంటి మానవ చర్యలు భూమ్యావరణ స్థితికి భంగం కలిగి భూకంపాల రాకకు కారణమవుతున్నాయని నిర్ధారించారు. దీంతో పాటు పర్యావరణ కాలుష్యం కూడా పరోక్షంగా భూకంపాలకు కారణం కావచ్చు అని కూడా కొంతమంది అభిప్రాయాలు వెల్లడిస్తున్నారు. వాతావరణ కాలుష్యంతో పెరుగుతున్న భూతాపం వల్ల భూమి లోలోపలి పొరలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. అడవుల ధ్వంసం, వాహన కాలుష్యం, పారిశ్రామిక వ్యర్థాలు పర్యావరణంపై ప్రతికూల ప్రభావానికి కారణమవుతున్నాయి. దీంతో వాతావరణంలో ఆకస్మికంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇవన్నీ వరదలకు, సముద్ర మట్టాలు పెరగడానికి దారితీసి భూలోపలి పొరల్లో సాగే అలజడి మరింత వేగవంతం చేయడం ద్వారానే భూకంపాలు వస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ విపత్తును తుపాన్ల వలె ముందుగా గుర్తించ గలిగితే ప్రాణ నష్టం జరగకుండా బయట పడవచ్చు. అయితే అటు వంటి అత్యాధునిక వ్యవస్థ ఇంత వరకూ లేదు. అయితే ఆధునిక పరిశోధనలు ఫలితంగా కొన్ని దేశాల్లో 30 సెకన్ల ముందే భూ కంపాల రాకను గుర్తించే వ్యవస్థ ఉంది. భారత్‌లో మాత్రం చాలా కాలం వరకూ దీని రాకను తెలుసుకోవడానికి ఉపయో గించే పరిజ్ఞానం కేవలం ప్రాథమిక ప్రకంపనలు గుర్తించేదిగా మాత్రమే అందుబాటులో ఉంది. భూ కంపాలను పసిగట్టే సాంకేతికతను తయారు చేసుకోగలగాలి. అప్పుడే ప్రపంచంలో పరిణతి చెందిన దేశంగా చెప్పుకోవడంతోపాటు అది ప్రజా జీవన విధానానికి భరోసా కలిగించేందుకు దోహదపడుతుంది.

మొక్కజొన్న వంటలు అదుర్స్



మొక్కజొన్నల్లో మన శరీరానికి ఉపయోగపడే ఎన్నో రకాల ఆరోగ్యకర ప్రయోజనాలు దాగి ఉంటాయని అందరికీ తెలిసిందే. అందుకే చాలా మంది మొక్కజొన్నలను రకరకాలుగా తింటుంటారు. కొందరు గారెలు ఇష్టపడితే, కొందరు ఉడకబెట్టుకుని తింటారు. ఇంకొందరు మొక్కజొన్న పిండి చేసుకుని రొట్టెల రూపంలో కూడా తింటారు. అయితే మొక్కజొన్నల్లో మనకు అందుబాటులో ఉండే స్వీట్ కార్న్ వెరైటీతో కార్న్ సమోసాలు, సూప్, రైస్, పాయసం వంటివి కూడా చేసుకోవచ్చు. ఇవి మనకు రుచికి రుచిని, పోషకాలకు పోషకాలను అందిస్తాయి. పిల్లలు కూడా ఎంతో ఇష్టంగా తింటారు. మరింకెందుకాలస్యం.. వాటిని ఎలా తయారు చేయాలో, అందుకు కావల్సిన పదార్థాలు ఏమిటో తెలుసుకుందాం... మనమూ ఓ సారి ప్రయత్నిద్దాం...


రైస్



కావల్సిన పదార్థాలు: బాస్మతి రైస్ - పావుకేజీ (అరగంట నీటిలో నానబెట్టుకోవాలి), కార్న్ - రెండు కప్పులు, ఉల్లిగడ్డ ముక్కలకు - ఒకప్పు, క్యాప్సికమ్ - కప్పు, అల్లం : పావు టీస్పూను, వెల్లుల్లిపేస్ట్ - పావు టీస్పూను, ఆలూ ముక్కలు - కప్పు, పచ్చిమిర్చి - నాలుగైదు, గరం మసాలా - టీస్పూను, పసుపు - పావు టీస్పూను, జీలకర్ర - పావు టీస్పూను, నూనె - సరిపడా.

తయారు చేసే విధానం: ఉల్లిగడ్డను సన్నగా తరిగి ఫ్రై చేసుకొని పక్కన పెట్టుకోవాలి. తర్వాత కుక్కర్ తీసుకొని అందులో శుభ్రంగా కడిగిన బియ్యం, ఆలూ, స్వీట్ కార్న్ వేయాలి. అందులోనే కొద్దిగా నూనె, సరిపడా నీళ్ళు పోసి మిక్స్ చేసి మూత పెట్టి మూడు విజిల్స్ వచ్చే వరకూ ఉడికించుకోవాలి. మరో పాన్ తీసుకొని అందులో కొద్దిగా నూనె పోసి వేడి అయ్యాక అందులో జీలకర్ర, ఉల్లిగడ్డ, అల్లం, వెల్లుల్లి పేస్ట్, పసుపు, గరం మసాలా, పచ్చిమిర్చి వేసి వేగించాలి. అంతలోపు కుక్కర్‌లో స్వీట్ కార్న్ రైస్ రెడీ అవుతుంది. స్టౌ ఆఫ్ చేసి కుక్కర్‌లోని ఆవిరి మొత్తం తగ్గనివ్వాలి. కుక్కర్లో ఆవిరి మొత్తం తగ్గిన తర్వాత స్వీట్ కార్న్ రైస్‌ను బయటకు తీసి పాన్‌లో వేగుతున్న మిశ్రమంలో వేసి మొత్తం మిశ్రమాన్ని కలగలుపుకోవాలి. అంతే స్పెషల్ స్వీట్ కార్న్ రైస్ రిసిపి రెడీ.

సూప్



కావల్సిన పదార్థాలు: మొక్కజొన్న - అర కప్పు, తురిమిన వెల్లుల్లి - టీస్పూను, తురిమిన క్యారెట్ - పావు కప్పు, వెనిగర్ - టీస్పూను, వెన్న - రెండు టీస్పూన్లు, తురిమిన అల్లం - టీస్పూను, తరిగిన ఉల్లిగడ్డ - ఐదు టీస్పూన్లు, మొక్కజొన్న పిండి - టీస్పూను, నల్ల మిరియాలు - పావు టీస్పూను, ఉప్పు - తగినంత.

తయారు చేసే విధానం: బాణలిలో వెన్న వేసి తరిగిన అల్లం, వెల్లుల్లి వేసి ఒక నిమిషం పాటు వేయించాలి. ఇప్పుడు మూడు టేబుల్ స్పూన్ల సన్నగా తరిగిన పచ్చి ఉల్లిగడ్డ వేసి రెండు నిమిషాలు వేయించాలి. చివరగా మొక్కజొన్న, క్యారెట్ కలపాలి. కొద్దిగా ఉప్పు వేసి కూరగాయలను మూడునాలుగు నిమిషాలు వేయించాలి. పావు కప్పు మొక్కజొన్నలో రెండు టేబుల్ స్పూన్ల నీటిని పోసి గ్రైండర్లో పేస్ట్‌గా చేయాలి. ఈ పేస్ట్‌ను పాన్‌లో వేసి మూడు నాలుగు నిమిషాలు వేయించాలి. ఇప్పుడు మూడు కప్పుల నీళ్ల పోసి మూత పెట్టాలి. 10-12 నిమిషాలు అంటే అందులోని నీరు ఒక కప్పుకు తగ్గే వరకు మరిగించాలి. ఇప్పుడు టేబుల్‌స్పూన్ కార్న్‌ఫ్లోర్‌ను రెండు టేబుల్‌స్పూన్ల నీటితో కలిపి మిశ్రమం తయారుచేయాలి. ఈ ద్రావణాన్ని సూప్‌లో వేసి బాగా కలపాలి. సూప్ చిక్కబడే వరకు ఉడికించాలి. చివరగా వెనిగర్, ఎండుమిర్చి పొడి, మిగిలిన పచ్చిమిర్చి వేసి రుచికి తగినట్టుగా ఉప్పు వేయాలి. అంతే సూప్ రెడీ.


సమోసా



కావల్సిన పదార్థాలు: స్వీట్ కార్న్ - కప్పు, ఉల్లిగడ్డ ముక్కలు - 1/4 కప్పు, ఉడికించి మెత్తగా చేసిన ఆలుగడ్డలు - 1/4 కప్పు, పచ్చిమిర్చి (తరిగినవి) - టీస్పూను, ఉప్పు - 1/4 టీస్పూను, కారం - 1/4 టీస్పూను, కరివేపాకు, కొత్తిమీర - తగినంత, ఆమ్‌చూర్ పౌడర్ -1/4 టీస్పూను, సమోసా స్ట్రిప్స్ - తగినన్ని.

తయారు చేసే విధానం: పాన్ తీసుకుని అందులో నూనె వేసి.. ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి కట్ చేసిన ముక్కలు వేసి తర్వాత ఉడికించిన ఆలుగడ్డల మిశ్రమం, స్వీట్ కార్న్ కూడా వేయాలి. ఆ తర్వాత ఉప్పు, పసుపు, కారం, ఆమ్‌చూర్ పౌడర్, కొత్తిమీర వేసి ఐదు నిమిషాల పాటు వేయించాలి. సమోసా స్ట్రిప్ తీసుకుని అందులో ముందుగా సిద్ధం చేసుకున్న మిశ్రమాన్ని నింపి జాగ్రత్తగా సీల్ చేయాలి. తర్వాత ఆ సమోసాలను నూనెలో వేసి వేయించాలి. అంతే.. వేడి వేడిగా ఉండే కార్న్ సమోసా రెడీ అయిపోతుంది.

పాయసం



కావల్సిన పదార్థాలు: మరీ లేతగా అలాగని ముదురుగా లేని మొక్కజొన్న గింజలు - కప్పు, బియ్యప్పిండి - టేబుల్ స్పూను, కాచి చల్లార్చిన పాలు - కప్పు, నీళ్ల - అర కప్పు, బెల్లం తురుము - కప్పు, నెయ్యి - రెండు చెంచాలు, యాలకుల పొడి - చెంచా, అరటిపండు - ఒకటి పెద్దది.

తయారు చేసే విధానం: ఓ గిన్నెలో మొక్కజొన్న గింజలు, నీళ్ల తీసుకుని పొయ్యిమీద పెట్టాలి. అవి ఉడికేలోగా పాలల్లో బియ్యప్పిండి కలిపి పెట్టుకోవాలి. మొక్కజొన్న గింజలు ఉడికిన తర్వాత అందులో బియ్యప్పిండి మిశ్రమాన్ని వేయాలి. మూడు నాలుగు నిమిషాలకు బియ్యప్పిండి ఉడికి, పాయసం చిక్కగా అవుతుంది. అప్పుడు బెల్లం తురుము వేయాలి. బెల్లం కరిగి, చిక్కగా అవుతున్నప్పుడు యాలకులపొడి వేయాలి. ఇది పాయసంలా తయారయ్యాక చక్రాల్లా తరిగిన అరటిపండు ముక్కలు వేసి రెండు నిమిషాలయ్యాక పొయ్యి కట్టేయాలి. చివరకు నెయ్యి వేసే చాలు.

ఆర్థిక పొరపాట్లతో...



అనవసర ఖర్చులను తగ్గించుకోలేకపోతే నెలాఖరుకి మన చేతిలో పైసా ఉండదు. ఆదాయం సరిపోయేలా జాగ్రత్తపడటంకన్నా, ఆర్థికపరమైన ఖర్చుల్లో చేసే పొరపాట్లే అప్పులబారిన పడేలా చేస్తాయంటున్నారు నిపుణులు. ఇలాకాకుండా ఉండాలంటే పాటించాల్సిన కొన్ని సూచనలు, సలహాలను చెప్తున్నారు. అవేంటో చూద్దాం...

- ఆదాయాన్ని అవసరాలకు తగ్గట్టు వినియోగించడంలో సరైన ఆర్థిక ప్రణాళికను పాటించాలి. జీతంకన్నా ఎక్కువ ఉండే వ్యయాన్ని నియంత్రించుకోగలగాలి. ఏయే చోట్ల ఎక్కువ ఖర్చు అవుతుందో గుర్తించి, వాటి అవసరమెంతుందో ఆలోచించి ఆచితూచి అడుగులేయాలి. ముందుగానే కుటుంబం, పిల్లల ఖర్చులు, వ్యక్తిగతం అంటూ ఒక బడ్జెట్ వేసుకోవాలి. వీటితోపాటు పండుగలు, ప్రత్యేకదినాలు, అనారోగ్యాలు సహా అత్యవసర ఖర్చులు, భవిష్యత్తు అవసరాలనూ దృష్టిలో ఉంచుకోవాలి. రిటైర్‌మెంట్ తర్వాత కావాల్సిన ఫండ్‌నూ ఇప్పటి నుంచే పొదుపు చేయాలి. వీటన్నింటినీ సమన్వయం చేయడానికి ప్రస్తుతం చాలారకాల ఆన్‌లైన్ ఫోరమ్స్ చేయూతగా నిలుస్తున్నాయి.
- రెండుమూడు నెలలు ఖర్చుపెట్టే ప్రతిపైసాను ఒక పుస్తకంలో రాయాలి. అలాగే ఫోన్ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా కూడా ఈ వివరాలను పొందుపరిస్తే, నెలంతా దేనికి ఎంత ఖర్చుపెట్టామో తెలుస్తుంది. రెండు నెలల తర్వాత అవసరం, అనవసరం అని రెండుగా వీటిని విడదీస్తే, ఎక్కడ నగదు వృథా అవుతోందో గుర్తించొచ్చు. రవాణా, బయటి ఆహారం, ఎంటర్‌టైన్‌మెంట్, మితిమీరిన షాపింగ్ వంటి ఖర్చులు తెలుస్తాయి. అవసరం కాని వాటిని నియంత్రించి, మరో ముఖ్యమైన పొదుపు కోసం కేటాయిస్తే మంచిది.
- క్రెడిట్ కార్డుపై అందించే రుణాలకు వీలైనంత దూరంగా ఉండాలి. ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలులో తప్పనిసరై క్రెడిట్‌కార్డ్‌ను వినియోగించినా, వీలైనంత తక్కువకాలంలో చెల్లించాలనే లక్ష్యం పెట్టుకొని ప్రయత్నించాలి. అలాగే ఒకేసారి రెండు మూడు రుణాలు తీసుకోవద్దు. అప్పుడు భారమనిపించదు. తిరిగి కట్టడం తేలిక అవుతుంది. తక్కువ సమయంలోనూ చెల్లించేయొచ్చు. వడ్డీ, చెల్లించే కాలం వంటివాటిలో ఏది అనువైనదో సలహా లేదా ప్రణాళిక అవసరమైనప్పుడు ఫైనాన్షియల్ ప్లానర్ లేదా క్రెడిట్ కౌన్సెలర్‌ను అడిగి తెలుసుకొంటే మంచిది.

సహజమైన నిగారింపుకై...



చలిగాలి ప్రభావంతో చర్మం పొడారి, మృదుత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. సహజసిద్ధమైన మాయిశ్చరైజర్లతో చర్మసౌందర్యాన్ని పరిరక్షించుకోవచ్చు.

- ఒక కప్పులో చాక్లెట్ బార్ నుంచి తీసిన నాలుగు ముక్కలను కరిగించి, చెంచా తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు రాసి పావుగంట ఆరనివ్వాలి. చివరగా తడిపిన చేతులతో ముఖంపై మృదువుగా ఐదునిమిషాలు మర్దనా చేసి కడగాలి. చాక్లెట్‌లోని కెఫీన్ చర్మకాంతిని రెట్టింపు చేస్తే, దీన్లోని కొవ్వులు సహజ మాయిశ్చరైజర్‌గా పనిచేసి మృదుత్వాన్ని అందిస్తాయి. తేనె చర్మాన్ని తేమగా ఉంచి, పొడారకుండా సంరక్షిస్తుంది.
- రెండు చెంచాల మయనీజ్‌కు చెంచా బేబీ ఆయిల్‌ను కలిపి ముఖం, మెడ, చేతులకు రాయాలి. ఇరవై నిమిషాల తర్వాత కడిగితే చర్మం మెరుపులీనుతుంది.
- రెండేసి చెంచాల చొప్పున కలబంద గుజ్జు, బాదంనూనె, తేనె తీసుకొని మిశ్రమంగా చేసి ముఖానికి రాసి అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి. దీంతో చర్మం మృదువవుతుంది.
- కప్పు బొప్పాయి ముక్కలకు అరకప్పు నీటిని కలిపి మిక్సీలో వేయాలి. ఈ మిశ్రమంలో ముంచిన దూది ఉండతో ముఖమంతా అద్ది, పావుగంట తర్వాత కడగాలి. పోషకాలు మెండుగా ఉండే బొప్పాయి చర్మానికి తేమను అందించి మెరుపులీనేలా మారుస్తుంది.
- ఒక అరటిపండును గుజ్జులా చేసి, దీనికి మూడు చెంచాల తాజా మీగడను కలిపి ముఖానికి రాయాలి. 20 నిమిషాల తర్వాత మృదువైన వస్త్రంతో తుడవాలి. ఆ తర్వాత నీటితో కడిగితే చర్మం మాయిశ్చరైజ్ అవుతుంది. పోషకాలు అంది ముఖచర్మం మృదువుగా మారుతుంది.
- సమపాళ్లలో కొబ్బరినూనె, తేనె కలిపిన మిశ్రమాన్ని ముఖం, మెడ, చేతులకు రాసి అరగంట తర్వాత కడిగితే సరి. యాంటీమైక్రోబియల్ గుణాలుండే కొబ్బరినూనె చర్మరంధ్రాల్లోని సూక్ష్మజీవులను దూరంచేసి, పొడారకుండా చేస్తుంది.

అదుపులోనే ద్రవ్యోల్బణం

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. గతంలో తమ సమస్యల పరిష్కారం కోసం భారత్ ఇతరులపైన ఆధారపడేదనీ, నేడు భారతే ఇతర సమస్యలను పరిష్కరిస్తోందని పేర్కొన్నారు. నేడు భారత్ జీ20 దేశాలకు నాయకత్వం వహిస్తోందని అన్నారు. ఇది కొంతమందికి కంటగింపుగా ఉండొచ్చునీ, తనకైతే గర్వంగా ఉన్నదని చెప్పారు. నిరాశలో ఉన్న కొందరు దేశ ప్రగతిని అంగీకరించలేకపోతున్నారని విమర్శించారు. నేడు అనేక దేశాలను నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వేధిస్తున్నాయనీ, భారత్ మాత్రం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని అన్నారు. భారత్‌లో ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం చూసి కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు.

ఈడీ దెబ్బకు ఏకమైన ప్రతిపక్షాలు

దర్యాప్తు సంస్థలపై ప్రతిపక్షాలన్నీ కలిసి విమర్శలు చేస్తున్నాయని మోడీ అన్నారు. ఈడీ దెబ్బకు ప్రతిపక్ష నాయకులంతా ఏకతాటిపైకి వచ్చారన్నారు. ఈడీకి వారు ధన్యవాదాలు చెప్పాల్సిందేనన్నారు. తన జీవితాన్ని దేశం కోసం అంకితం చేశాననీ, ప్రజలకు తనపై విశ్వాసం ఉన్నదనీ, అది ప్రతిపక్షాలకు అందదని ప్రధాని చెప్పారు. తాను 125 కోట్ల మంది కుటుంబాల సభ్యుడినని అన్నారు. కొందరు ఒకే కుటుంబానికి సేవ చేశారనీ, తాను 125 కోట్ల మంది కుటుంబాలకు సేవ చేస్తున్నానని పేర్కొన్నారు.

ఒకప్పుడు రైల్వే అంటే యాక్సిడెంట్లు గుర్తుకొచ్చేవనీ, నేడు వందే భారత్ రైళు చూసి ప్రజలు గర్వపడుతున్నారని అన్నారు. 2004 నుంచి 2014 వరకూ దేశంలో అవినీతి రాజ్యమేలిందని ప్రధాని ఆరోపించారు. దేశంలో ఆ పదేండ్ల రక్తపుటేర్లు పారాయన్నారు. భారత్ తీవ్రంగా నష్టపోయిందన్నారు.

తొమ్మిదేండ్లలో 70 ఎయిర్‌పోర్టులు

దేశంలో 70 సంవత్సరాలలో 70 ఎయిర్‌పోర్ట్‌లు నిర్మిస్తే, తమ ప్రభుత్వం తొమ్మిదేండ్లలోని 70 ఎయిర్‌పోర్ట్‌లు నిర్మించిందని మోడీ పేర్కొన్నారు. జల మార్గాలను కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మరోవైపు మోడీ ప్రసంగాన్ని ప్రతిపక్ష సభ్యులు అడ్డుకున్నారు. అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాలన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు..

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

(మొదటిపేజీ తరువాయి)

జూలకంటి మాట్లాడుతూ.. అనేక రాష్ట్ర పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు తీసుకెళ్తున్నది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులేనన్నారు. కానీ వారి జీతభత్యాలు అంతంత మాత్రమే ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉద్యోగుల కోసం విడుదల చేస్తున్న జీవోలు సైతం కిందిస్థాయిలో అనేక డిపార్ట్‌మెంట్లలో అమలు కావడం లేదని తెలిపారు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు 15 నుంచి 20 సంవత్సరాలుగా పర్మినెంట్ కాకుండా, ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారని.. రెగ్యులరైజేషన్ కావాలని అడగడంలో తప్పులేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని దేశంలోని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. ఈ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేష్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లామని చెప్పారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనైనా ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరూ ఆందోళనలోకి దిగుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు సైదులు, నగర అధ్యక్షులు కుమారస్వామి, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీల యూనియన్ నాయకులు దేవా, పాలిటెక్నిక్ కాలేజీల యూనియన్ నాయకులు సుధాకర్, రంగారెడ్డి జిల్లా నాయకులు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో ఉన్న ఆ బంధంతోనే అదానీ ఎదుగుదల

న్యూఢిల్లీ : బీజేపీతో ఉన్న పవిత్ర బంధంతోనే అదానీ ఎదిగారని సీపీఐ(ఎం) ఎంపీ ఆరీఫ్ పేర్కొన్నారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో సీపీఐ(ఎం) తరపున ఆరీఫ్ మాట్లాడారు. "రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని నేను పూర్తిగా తిరస్కరిస్తున్నాను. దేశంలోని సామాన్య ప్రజల మనోభావాలను పూర్తిగా విస్మరిస్తూ లోక్‌సభ, ఇతర రాష్ట్రాల అసెంబ్లీలకు జరగనున్న ఎన్నికల కోసం తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడానికి ఒక అవకాశంగా రాష్ట్రపతి ప్రసంగం చేశారు. రాజ్యాంగం ప్రకారం అనుమతి లేని కారణంగా రాష్ట్రపతి తన ఎన్నికల ప్రచారాన్ని పార్లమెంటు సెంట్రల్ హాల్ నుంచి ప్రారంభించారు. రొటేషన్ ప్రాతిపదికన భారతదేశానికి అప్పగించబడిన జీ20 నాయకత్వ పాత్రను బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయం ఎలా అవుతుంది?. నిజమే, బీజేపీ తప్ప మరే ఇతర పార్టీ కూడా దీన్ని తన రాజకీయ లబ్ధికి ఉపయోగించుకునేందుకు ప్రయత్నించ లేదు. జీ20 లోగోలో బీజేపీ జెండా రంగులు, ఆ పార్టీ గుర్తు కమలం పేర్కొనడంతో ప్రపంచం ముందు భారతదేశాన్ని అపహాస్యం చేసింది" అని విమర్శించారు.

"ఈ ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టిన బీజేపీ ఎంపీ చంద్రప్రకాష్ జోషి 2022లో 121 దేశాల్లో పేదరిక సూచీలో భారతదేశం 107వ స్థానంలో ఉన్నదని రాష్ట్రపతికి తెలియజేయాలని కోరుకుంటున్నాను. ప్రభుత్వ స్వంత ఆర్థిక సర్వే, రిజర్వ్ బ్యాంక్, ఆక్స్‌ఫామ్ వంటి ఏజెన్సీల నివేదికల ప్రకారం, భారతదేశంలో దాదాపు 26 కోట్ల మంది పేదలు నివసిస్తున్నారు. ఈ ప్రభుత్వం 2047 సుదీర్ఘ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. 26 కోట్ల పేదల ప్రజల ఆశలకు ద్రోహం చేసింది. స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకోవడానికి వీక్షించడానికి 2047 వరకు వారిలో ఎంత మంది జీవించి ఉంటారో అని వారు ఆశ్చర్యపోతారు.

కోవిడ్-19 వ్యాక్సిన్ ను ఉచితంగా 45 ఏండ్లు పైబడిన వారికి మాత్రమే పరిమితం చేసింది. సుప్రీం కోర్టు జోక్యం కారణంగా, ఇది 18 ఏండ్లు పైబడిన పౌరులందరికీ ఉచితంగా అందించబడింది. అప్పుడు కూడా సుప్రీంకోర్టు చిత్రపటానికి బదులు, వ్యాక్సిన్ సర్టిఫికెట్లన్నింటికీ ప్రధాని నవ్వే ముఖం ఉంది. ప్రపంచంలో మరే ఇతర నాయకుడు ఇంత చీప్ పబ్లిసిటీ చర్యలకు దిగారా? అని నేను ఆశ్చర్యపోతున్నాను. ఖాదీ బోర్డ్ క్యాలెండర్ నుండి మహాత్మా గాంధీ ఫోటోను తీసివేసి, ప్రధాని చిత్రాన్ని చేర్చారు.

చీప్ పబ్లిసిటీ కోసం, పొలిటికల్ మైలేజీ పొందడం కోసం మన ప్రధానికి ఏ మాత్రం సిగ్గు లేదనేది ఇదంతా స్పష్టం చేస్తుంది" అని ఎద్దేవా చేశారు.

"ఈ ప్రభుత్వం కేవలం ఇద్దరు వ్యక్తులు, వారి కుటుంబాల పట్ల మానవతా బాధ్యతను చూపుతోంది. అది అదానీ, అంబానీ కుటుంబాల పట్ల అని అందరికీ తెలుసు. అదానీ గ్రూప్ కి, బీజేపీ ప్రభుత్వం మధ్య రోజురోజుకు అపవిత్ర బంధం బహిర్గతమవుతోంది. ఈ దేశంలోని సామాన్య ప్రజలు తమ పెట్టుబడులు భద్రంగా ఉంటాయని ఆశించి ఎస్‌బీఐ, ఎల్ఐసీ వంటి సంస్థలలో కోట్లు పెట్టుబడి పెట్టారు. ఈ ప్రభుత్వం, ఈ అపవిత్ర బంధంలో భాగంగా అదానీ గ్రూపుల షేర్లలో తమ వద్ద ఉన్న ప్రజా సొమ్ముతో జూదం ఆడేందుకు ఎస్‌బీఐ, ఎల్ఐసీలను అనుమతించడం ప్రజల ఆశలను వమ్ము చేసింది. అయితే అదానీ గ్రూప్ షేర్లలో 30,000 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టేందుకు ఎల్ఐసీకి ఎవరు అధికారం ఇచ్చారు? ఎస్‌బీఐ రూ.27 వేల కోట్ల రుణాలు ఇచ్చినట్టు బయటపడింది. మోడీ అధికారంలోకి రాకముందు అదానీ ఎవరికీ తెలియదు. పవిత్ర బంధంతో ఆయన అందరికీ తెలిసిపోయారు" అని విమర్శించారు.

ఆన్‌లైన్ మూల్యాంకనంతో విప్లవాత్మక మార్పు

- టీజీవో ఇంటర్ విద్యాఫోరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనమనేది ఒక విప్లవాత్మక మార్పు అని టీజీవో ఇంటర్ విద్యాఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ వెంకటేశ్వర్లు, ఎండీ ఇస్మాయిల్, అసోసియేట్ ప్రెసిడెంట్ వి ప్రవీణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సస్పెండైన మధుసూదన్‌రెడ్డి ఇంటర్ విద్యా కమిషనర్‌పై కక్షపూరిత ధోరణితో నిరాధార ఆరోపణలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆన్‌లైన్ మూల్యాంకనంపై భయాందోళనలు సృష్టించడం సరైంది కాదని పేర్కొన్నారు. సాంకేతిక విద్యాశాఖలో మూడేండ్ల నుంచి ఆన్‌లైన్ మూల్యాంకనం కొనసాగుతున్నదని వివరించారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న మధుసూదన్‌రెడ్డిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆగని అదానీ ప్రకంపనలు

(మొదటిపేజీ తరువాయి)

సొమ్ముకు సంబంధించిన విషయమని పేర్కొన్నాయి. అదానీ గ్రూప్‌పై తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. బుధవారం రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ, శివసేన ఠాకరే వర్గం, బీఆర్ఎస్ వాయిదా తీర్మానాలను ఇచ్చాయి. రూల్ 267 ప్రకారం కె. కేశవరావు (బీఆర్ఎస్), సంజయ్ సింగ్ (ఆప్), శివసేన (ఠాక్రే) ఎంపీలు సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది ఇచ్చిన నోటీసులను చైర్మన్ జగదీప్ ధంఖర్ అనుమతించలేదు. దీంతో ఆయా పార్టీల సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

రాజ్యసభలో..

రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ..ప్రధాని మోడీ సభలో ఎక్కువ సమయం గడపాలని హితవు పలికారు. ఆయన మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించవలసిన మంత్రులు, ఎంపీలు హిందూ-ముస్లిం అంటూ మాట్లాడుతున్నారన్నారు. మాట్లాడటానికి ఇతర అంశాలేవీ వారికి దొరకలేదా? అని నిలదీశారు. దేవాలయాల్లోకి ప్రవేశించే ఎస్సీలను కొడుతున్నారన్నారు. వారిని హిందువులుగా పరిగణిస్తే, దేవాలయాల్లోకి వారిని ఎందుకు ప్రవేశించనివ్వడం లేదని ప్రశ్నించారు. వారు చదువుకోవడానికి అవకాశం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఎస్సీల ఇండ్లల్లో భోజనం చేస్తున్నట్టు కనిపించే ఫొటోలను చాలా మంది మంత్రులు చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినదానినే రాష్ట్రపతి, గవర్నర్లు పునరుద్ఘాటించడం తరచూ జరుగుతోందన్నారు. అయితే ఈసారి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మైనారిటీల గురించి మాట్లాడతారని తాను ఆశించాననీ, కానీ తనకు నిరాశే మిగిలిందని అన్నారు. నిజం మాట్లాడితే తాను జాతి వ్యతిరేకిని అవుతానా? అని నిలదీశారు. "నేను దేశ వ్యతిరేకిని కాను. ఇక్కడ ఉన్నవారిలో ఎవరితో పోల్చుకున్నా నేను గొప్ప దేశభక్తుడిని. నేను భూమి పుత్రుడిని. మీరు దేశాన్ని దోచుకుంటున్నారు. నన్ను దేశ వ్యతిరేకి అంటున్నారు" అని మండిపడ్డారు.

ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ మాట్లాడుతూ ప్రధాని మోడీపై పదే పదే వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారని అన్నారు. జగ్‌దీప్ ధంఖర్ మాట్లాడుతూ దేశానికి మనం చెడు సందేశాన్ని పంపిస్తున్నామన్నారు. వ్యూహాత్మకంగానే ఈ విధంగా చేస్తున్నారన్నారు. రాజ్యసభ ప్రారంభం కాగానే అదానీ గ్రూప్ అంశాన్ని ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తడంతో గందరగోళం ఏర్పడింది.

రాహుల్ గాంధీపై ప్రివిలేజ్ నోటీస్

లోక్‌సభలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి రాహుల్ గాంధీపై ప్రివిలేజ్ మోషన్‌ను ప్రతిపాదించారు. పార్లమెంటు నిబంధనల ప్రకారం ఓ ఎంపీ ముందుగా నోటీసు ఇవ్వకుండా ఎటువంటి ఆరోపణలు చేయరాదన్నారు. ఓ కాంగ్రెస్ నేత (రాహుల్ గాంధీ) మంగళవారం నిరాధారమైన ఆరోపణలు చేశారన్నారు. ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డుల నుంచి తొలగించాలన్నారు. బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే కూడా రాహుల్ గాంధీపై ప్రివిలేజ్ మోషన్‌ను ప్రతిపాదించారు. సభలో లేని వ్యక్తిపై ఆరోపణలు చేయరాదన్నారు. సభలో లేని వ్యక్తి తనను తాను సమర్థించుకోవడం సాధ్యం కాదు కాబట్టి ఆ వ్యక్తిపై ఆరోపణలు చేయరాదన్నారు. ముందుగా నోటీసు ఇచ్చి, స్పీకర్ అనుమతి పొందాలన్నారు.

జాతీయ జెండాలో ఆకుపచ్చ రంగు తొలగిస్తుందా?

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసి మాట్లాడుతూ త్రివర్ణ పతాకం నుంచి ఆకుపచ్చ రంగును మోడీ ప్రభుత్వం తొలగిస్తుందా? అని ప్రశ్నించారు. ఆకుపచ్చ రంగుతో మోడీ ప్రభుత్వానికి అన్ని సమస్యలు ఎందుకని ప్రశ్నించారు.

మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

నాశనం చేస్తున్నారని ఆమె దుయ్యబట్టారు. జమ్మూ కాశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా చేపడుతున్న కూల్చివేతలను నిరసిస్తూ ఢిల్లీ విజయ్‌చౌక్‌లో ఆందోళనకు దిగారు. 20 జిల్లాల్లో స్థలాలు ఆక్రమించారంటూ అక్కడి అధికారులు కూల్చివేతలకు దిగడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు ఇప్పటివరకు అనేక భవనాలను కూల్చివేయడంతో అమాయక ముస్లిం పేదలు రోడ్డున పడ్డారని ఆమె విచారం వ్యక్తం చేశారు.

కూల్చివేతలు జరుపుతుండగా స్థానికులు రెవెన్యూ అధికారులపై రాళ్లతో దాడి చేశారు. పలు ప్రాంతాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిగాయి. ఆక్రమణల పేరుతో ముస్లింలను వేధించడం ఆపాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం ఓ షోరూంను కూల్చివేస్తుండగా రాళ్లతో దాడిచేయగా.. షోరూం యజమానితో పాటు ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాళ్ల దాడిలో ఇప్పటివరకు ఐదుగురు పోలీసులు గాయపడ్డారు. పరిస్థితి విషమించడంతో జమ్మూ పోలీసులు ప్రజలను అదుపు చేసేందుకు టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొన్నది.

అదానీ ఆస్తుల్ని జాతీయం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. అమెరికా పరిశోధన సంస్థ హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికతో అదానీ గ్రూప్ షేర్లు తీవ్ర ఒడిదుడుకులకు గురయ్యాయి. ఈ కుంభకోణంపై దర్యాప్తు చేయాలని పార్లమెంట్‌లో విపక్ష పార్టీలు ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయి. ఈ క్రమంలో అదానీ వ్యవహారంపై సుబ్రహ్మణ్య స్వామి కీలక వ్యాఖ్యలు చేశారు. "అదానీ గ్రూపు ఆస్తులన్నీ జాతీయం చేసి వాటిని వేలం వేయాలి. వచ్చిన నగదును ఇందులో నష్టపోయిన వారికి సహాయంగా అందజేయాలి. అదానీతో ఒప్పందాలు లేవని కాంగ్రెస్ చెబుతోంది. కానీ, అందులో అదానీతో ఒప్పందాలు ఉన్న వ్యక్తుల గురించి నాకు తెలుసు. అయినా కాంగ్రెస్‌ను పట్టించుకోను. బీజేపీ తన పవిత్రతను నిరూపించుకోవాలని కోరుకుంటున్నా. ప్రధాని మోడీ ఏదో దాచి పెడుతున్నారని ప్రజల్లో ఒక భావన ఉంది. దీనిపై స్పష్టతనిచ్చే బాధ్యత ప్రభుత్వానిదే" అని సుబ్రహ్మణ్యస్వామి పేర్కొన్నారు.

ఇదొక బోగస్ బడ్జెట్..

సుబ్రహ్మణ్యస్వామి పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడు ముషారఫ్ మరణంపై సానుభూతి వ్యక్తం చేయటం విమర్శలకు దారితీసింది. "కార్గిల్ యుద్ధానికి ముఖ్య కారకుడు నవాజ్ షరీఫ్. ఆయన ఇంటికి ప్రధాని మోడీ ఎందుకు వెళ్లారనే ప్రశ్నకు నెటిజన్లు సమాధానమివ్వలేరు" అంటూ విమర్శకులకు సమాధానమిచ్చారు. అంతేగాక కేంద్ర బడ్జెట్‌పై సంచలన కామెంట్స్ చేశారు. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ ఓ బోగస్ అని మండిపడ్డారు. కొన్నేండ్లుగా దేశ వృద్ధి రేటు 3 నుంచి 4 శాతం మాత్రమే ఉంటోంది. కానీ వచ్చే ఏడాదికి 6.5శాతం వృద్ధి రేటు ఉంటుందని కేంద్రం అంటోందని చెప్పారు. వ్యవసాయం, పరిశ్రమలకు బడ్జెట్‌లో ప్రాధాన్యతే లేదు. ప్రభుత్వానికి ఎటువంటి వ్యూహం లేదన్న సంగతి బడ్జెట్‌లో కనపడుతోంది" అంటూ చురకలు అంటించారు.

ఇంటర్ విద్యార్థులకు నేటినుంచి టీశాట్ ద్వారా పరీక్ష చిట్కాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని జూనియర్ కాలేజీల్లో చదువుతున్న ఇంటర్మీడియెట్ విద్యార్థులకు టీశాట్, ఇంటర్ బోర్డు సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వం మానసిక నిపుణులతో గురువారం నుంచి పరీక్ష చిట్కాలను ప్రసారం చేయనుంది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వార్షిక పరీక్షలకు ముందు విద్యార్థులందరి ప్రయోజనం కోసం ప్రేరణ తరగతుల ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గురువారం నుంచి ప్రత్యక్ష ప్రసారాలు టీశాట్ నిపుణలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయని వివరించారు. ఇవి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయనీ, పరీక్షలను సులభంగా ఎదుర్కొనేలా ప్రేరేపిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులందరూ దీన్ని వినియోగించుకోవాలని సూచించారు.

భూకంపాల్ని ఆపక పోయినా... నష్టాన్ని తగ్గించలేమా?

ప్రకృతి విపత్తులకు పేద, ధనిక వివక్ష లేదు. జీవుల ప్రాణులపై పక్షపాతం లేదు. గృహాలపై స్వార్థం లేదు. భూకంపాలు, వరదలు, సునామీల ప్రకోపానికి మనుషులు, జంతువులు, హరిత సంప దలు, ఆస్తుల విధ్వంసం సమానంగా ఉండవల సిందే. జాగ్రత్త పడడానికి సమయం ఇవ్వదు. భవనాలు ఊగి పోవడం, కాంక్రీట్ కుప్పల్లో ఆర్త నాదాలు, రోడ్లపై శీతల వాతా వరణంలో జనం బిక్కుబిక్కున చేరడం, ఆకాశహర్మ్యాలు నేలమట్టం కావడం, గడియారపు స్తంభాలు నేల కూలడం లాంటి బీభత్సాలు క్షణాల్లో జరిగి పోతాయి. డిజిటల్ యుగపు మనిషి దిక్కుతోచని దుస్థితిలో హాహాకారాలు చేయడం తప్ప చేయాల్సింది ఏమీ ఉండడం లేదు.



డా॥ బి మధుసూదన్‌రెడ్డి
9949700037

క్షణాల్లో నగరాలు నేలమట్టం

ఫిబ్రవరి 6న తెల్లవారుజామున జరిగిన భూకంప మృత్యుకేళితో టర్కీ, సిరియా నగరాలు విలవిల్లాడడం, పేకమేడల్లా బహుళ అంతస్తుల భవ నాలు నేలమట్టం కావడం, వేల కొద్ది జనులు శిథిలాల



కింద పడి తుదిశ్వాస విడవడం చూస్తుండగానే జరిగి పోయింది. ప్రసార మాధ్యమాల్లో వీడియోలు చూసిన ప్రపంచ ప్రజానీకం ఆందోళన చెందింది. కొద్ది గంటల్లోనే రిక్టర్ స్కేల్‌పై 7.8, 7.6, 6.0 పరిమాణంతో మూడు సార్లు భూమి కంపించడంతో దక్షణ-కేంద్ర టర్కీ ప్రాంతంలో గాజియన్టెక్ నగరంతో పాటు మరో 10నగరాల్లో భవనాలు (రోడ్లు, నివాస భవనాలు, కార్లు, వాహనాలు, షాపింగ్ మాల్స్, విమానాశ్రయాలు) పూర్తిగా నేల మట్టం కావడం లేదా పాక్షికంగా ధ్వంసం కావడంతో 2 మిలియన్ల ప్రజలు నిరాశ్రయులయ్యారు. తొలిభూకంప విపత్తు తరువాత కనీసం 40సార్లు భూమి కంపించడంతో టర్కీ, సిరియాలు గజగజ వణికి పోతూ, ప్రజలు హాహాకారాలు చేస్తూ రోడ్ల వెంట ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని నిస్సహాయంగా పరుగులు తీశారు. గత వందేండ్లలో ఇంతటి భూకంపం రాలేదని, కనీసం 8వేల మంది చనిపోయి ఉంటారని వార్తలు వెలువడ్డాయి. కాని మరణాలు, క్షతగాత్రుల సంఖ్య అనేక రెట్లు ఎక్కువగా ఉండవచ్చని హృదయ విదారక దృశ్యాలు ధృవీకరిస్తున్నాయి. గాజియాన్టెక్ నగరానికి 33కి.మీ దూరంలో 18కి.మీ లోతులో భూకంప ప్రభావ కేంద్రం కనిపించడంతో గజియాన్టెక్ నగరంలోని 2,200 ఏండ్ల క్రితం నాటి రోమన్ కాలపు చారిత్రక కట్టడం కూడా పూర్తిగా ధ్వంసమైంది.

భూగర్భ ఫలకల కదలికతోనే పెనువిపత్తులు

భూకంపాలకు నెలవుగా మారిన టర్కీ ఒక్క 2000 సంవత్సరంలోనే 33,000 భూకంపాలు రికార్డు అయ్యాయని, ఇందులో రిక్టర్ స్కేల్‌పై 4.0 పరిమాణంతో 332సార్లు కంపించిందని వివరాలు తెలుపుతున్నాయి. టర్కీ దేశం భూకంపాల ముప్పు ఉన్న టెక్టోనిక్ ప్రదేశంగా గతంలోనే గుర్తించారు. భూమి అంతర్భాగంలో ఉన్న 15 ముఖ్య ఫలక పొరలను టెక్టోనిక్ ఫలకాలు(ప్లేట్స్)గా పిలుస్తారు. ఈ కదిలే స్వభావం కలిగిన ఫలక పొరల మధ్య రాపిడితో పగుళ్ళు, ఆకస్మిక కదలికలతో అపార శక్తి వెలువడడం వల్ల భూకంపాలు వస్తున్నట్లు ఆర్కియాలజికల్ సర్వేలు వివరిస్తున్నది. యురాసియన్, ఆఫ్రికన్ ప్లేట్స్ మధ్య చీలిక ఏర్పడిన అనటోలియన్ టెక్టోనిక్ ఫలకాల్న(ప్లేట్స్) ఉన్న ప్రాంతంలో టర్కీ ఉన్నది. యురాసియన్, అనటోలియన్ టెక్టోనిక్ ఫలకాలు కలిసే ప్రదేశమైన 'నార్థ్ అనటోలియన్ ఫాల్ట్ లైన్' వద్ద భూకంప విధ్వంసం అధికంగా కనిపిస్తున్నది. ఇస్తాంబుల్ నుంచి టర్కీ వరకు గతంలో కూడా భయానక భూకంపాలు రికార్డయ్యాయి. పేదరికం రాజ్యమేలుతున్న టర్కీ, సిరియాల్లో అంతర్గత అశాంతి మంటలతో ప్రజలు అభద్రతల నడుమ బిక్కు బిక్కున బతుకులీడుస్తున్నారు. సిరియాలో అంతర్గత యుద్ధం, టర్కీలో 30లక్షలకు పైగా సిరియన్ శరణార్థులు చేరడం, భవనాలు బలహీనంగా నిర్మించడం, జనసాంద్రత ఎక్కువగా ఉండడం లాంటి సమస్యలు భూకంప నష్టాలను అనేక రెట్లు పెంచాయని నిపుణులు నిర్ధారిస్తున్నారు.

భూకంపాలు కొత్తేమీ కాదు

టర్కీ దేశంలో దాదాపు 90శాతం అధిక భూకంప సంభావ్యత కలిగిన ప్రదేశంగా (ఇస్తాంబుల్, ఇజ్మీర్, ఈస్ట్ అనటోలియాలతో కలిపి) గుర్తించబడింది. 2013-22 మధ్య ప్రపంచ వ్యాప్తంగా 30,673 సార్లు భూమి కంపించినట్లు రికార్డులు తెలుపుతున్నాయి. 1999లో గోల్‌కుక్, డస్సీ ప్రాంతాల్లో వచ్చిన భూకంపానికి (7.4, 7.0 స్కేల్) 18వేల మంది మరణించడం, 45వేలమంది గాయపడ్డారు. డిసెంబర్ 1939లో ఎర్జిన్కాన్ నగరంలో 8.0 తీవ్రత కలిగిన భూకంపం రావడంతో 20,000 మంది చనిపోవడం, 1,16,720 భవనాలు ధ్వంసం కావడం తరువాత అంతటి తీవ్రత కలిగిన భూకంపంగా నిన్నటి విపత్తు గుర్తించబడింది. ఆగస్టు 1999లో ఇజ్మిత్ ప్రాంతంలో అన్టోలియన్ ఫాల్ట్ వల్ల వచ్చిన భూకంపంలో 17వేల మరణాలతో పాటు 1,20,000 గృహాలు కుప్పకూలడం, 2.50 లక్షల జనులు నిరాశ్రయులు కావడం తెలిసిందే. 1900 సంవత్సరం తరువాత జరిగిన 76 తీవ్ర భూకంపాల్లో దాదాపు 90,000 మంది ప్రాణాలు కోల్పోయినట్టు అంచనా.

శాస్త్రజ్ఞుల హెచ్చరికలు పెడచెవిన పెట్టారా..?

ఫిబ్రవరి 3 శుక్రవారం రోజున 'ఫ్రాంక్ హూగర్‌బీట్స్' అనబడే డచ్ పరిశోధకుడు టర్కీ, జోర్డన్, లెబనాన్, సిరియా ప్రాంతాల్లో 7.5 రిక్టర్ స్కేల్ కలిగిన తీవ్ర భూకంపం సమీప భవిష్యత్తులో రావచ్చని ట్వీట్ రూపంలో హెచ్చరించడం నేడు చర్చనీయాంశంగా మారింది. ఈ భూ ప్రళయం తరువాత కూడా వెంటనే తిరిగి భూకంపాలు రావచ్చని, ప్రజలు ముందు జాగ్రత్తగా ఉండాలని కూడా ఆయన సలహాలు ఇవ్వడాన్ని పెడచెవిన పెట్టరాదు. ఈ భయానక, విధ్వంసకర భూ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారితో పాటు ఆవాసాలు కోల్పోవడం విచారకరమని ఫ్రాంక్ తెలియజేశారు. గోరుచుట్టుపై రోకలి పోటులా ఏండ్ల తరబడి అంతర్యుద్ధంతో తిరుగుబాటు దారుల అధీనంలో అతలాకుతలం అవుతున్న సిరియాకు తాజా భూ కంపం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. భూకంపాల ముప్పు ఉన్న ప్రదేశాలుగా గుర్తించి హెచ్చరికలు చేస్తున్నప్పటికీ తుర్కియే, సిరియాల పాలకులు కనీస ముందు జాగ్రత్తలు, నిర్మాణ సమయాల్లో ప్రకంపనలు తట్టుకునేలా చర్యలు తీసుకోక పోవ డంతో నష్టం అపారంగా కనిపిస్తున్నది. శాస్త్రజ్ఞుల హెచ్చరికలు భూకంపాలను నిరోధించనప్పటికీ ఆయా దేశాల ప్రభుత్వాలు, పౌర సమాజం గమనించి ఆ నష్టాల నుంచి బయటపడేలా సాంకేతికత తీసుకురావాలని విశ్వ మానవాళి విన్నవిస్తున్నది. ■

మనిషి జీవనం... స్మార్ట్‌ఫోన్ ప్రభావం..!



ఇటీవలి కాలంలో ప్రపంచంలో మొబైల్ ఫోన్లు బాగా వృద్ధి చెందాయి. ప్రజలంతా మొబైల్ ద్వారా సంప్రదింపులు చేస్తున్నారు. వేరు వేరు చోట్ల నివాసం ఉండే ప్రజలు, కేవలం మొబైల్ ఫోన్ ద్వారా సంభాషించుకోవడానికి బాగా అలవాటు పడ్డారు. మొబైల్ ఫోన్లు వ్యక్తుల జీవితాలపై ఎక్కువ ప్రభావం చూపుతాయి. అయితే మొబైల్ వలన ప్రజలకు లాభాలు ఉన్నట్టే, నష్టాలు కూడా ఉంటాయి. సుదూర ప్రాంతాలలో నివసించే స్నేహితులతో, బంధువులతో వెనువెంటనే సంభాషణలు చేయవచ్చును. వీడియో కాలింగ్ ద్వారా కూడా ఒకరినొకరు చూసుకుంటూ సంభాషించు కోవచ్చును. ఈవిధంగా స్మార్ట్ ఫోన్ ప్రజల మధ్య కమ్యూనికేషన్‌కు బాగా ఉపయోగపడుతుంది. వ్యాపారస్తులకు కూడా స్మార్ట్‌ఫోన్ చాలా ఉపయోగం. ఇంటర్నెట్ ద్వారా అనేక విషయాలను స్మార్ట్‌ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చును. పాటలు వినవచ్చును. వీడియోలు చూడవచ్చును. వివిధ అప్లికేషన్స్ ద్వారా కొన్ని కంప్యూటర్‌లో చేయగలిగే పనులు కూడా స్మార్ట్ ఫోన్ ద్వారా చేసుకోవచ్చును. మొబైల్స్ మన జీవితంలో భాగమైపోతున్నాయి. స్మార్ట్‌ఫోన్ ప్రయోజనకారిగా ఉంటూ, మనకు నష్టం కూడా చేస్తున్నదని భావించాలి. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ నుండి వచ్చే రేడియేషన్ వ్యక్తి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. ఇంకా పిల్లలకు స్మార్ట్ ఫోన్ అలవాటుగా మారుతూ, వారిని భౌతిక ఆటలకు దూరం చేయడంలో స్మార్ట్ ఫోన్ ప్రభావం చూపుతుంది. అంతే కాదు కొందరికి స్మార్ట్‌ఫోన్ వ్యసనంగా మారుతోంది. కొందరు ఆటలు ఆడుతూ స్మార్ట్ ఫోనుతోనే ఎక్కువగా కాలం గడిపేస్తూ ఉంటారు. కొందరు వీడియోలు చూస్తూ స్మార్ట్ ఫోనుతోనే మమే కమవుతారు. ఏదో ఒక అంశం స్మార్ట్ ఫోను వ్యక్తిని ఆకర్షిస్తూ, అతన్ని భౌతిక సమాజం నుండి దూరం చేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది. స్మార్ట్ ఫోన్ వాడకం పెరిగాక కుటుంబ జీవనంలో కూడా వ్యత్యాసాలు వస్తున్నాయనేది నిజం. ఉపయోగించుకుంటే స్మార్ట్‌ఫోన్ ద్వారా అనేక విద్యా విషయాలను తెలుసుకోవచ్చును. అలాగే అనవసర విషయాల వైపు కూడా ఆకర్షితులయ్యే అవకాశం స్మార్ట్‌ఫోన్ వలన అధికంగా ఉంటుంది. ఇంకా స్మార్ట్ మోసాలు కూడా పెరుగుతూ, డబ్బులు పోగొట్టుకునేవారు కూడా మనకు వార్తాసమాచారంలో కనబడుతూ ఉంటారు. ఏదైనా ఒక వస్తువుని ఎంతవరకు అవసరమో అంతవరకు మాత్రమే ఉపయోగిస్తే, ఆ వస్తువు అతనికి ఉపకారిగా మారుతుంది. అదే వస్తువుతో ఎక్కువసేపు గడిపితే ఆ వస్తువు అతనికి లాభం కన్నా నష్టం ఎక్కువ చేస్తుంది. ఈ విధంగా ఆలోచన చేసినప్పుడు స్మార్ట్ ఫోన్ ముందుగా నష్టపరిచేది, వ్యక్తిని ఒంటరిని చేయడమే. పిల్లలు అన్నం తినడానికి, పేచి పెడుతుంటే చందమామను చూపిస్తూ, వారికి కథలు చెబుతూ అన్నం తినిపించేవారు. కానీ ఈ స్మార్ట్ కాలంలో ఉన్న తల్లులు స్మార్ట్‌ఫోనులో పిల్లల వీడియోలు పెడుతూ అన్నం తినిపించడం చూస్తున్నాం. దీని వలన రేడియేషన్ కలిగిన ఫోన్ చిన్ననాటి నుండే పిల్లలతో మమేకం అవుతుంది. రేడియేషన్ ఎంత హానికరమో వైద్యులు చెబుతూనే ఉన్నారు. కానీ కొందరు చేసే ఈ పనుల వలన పిల్లలకు చిన్ననాటి నుండే స్మార్ట్‌ఫోనే అంటే ఆసక్తి పెరుగుతోంది. చదువుకునే వయస్సులో టీచర్ ద్వారా చెప్పబడే పాఠాలు వినడం వలన విద్యార్థికి ఊహాశక్తి పెరుగుతుంది. కానీ స్మార్ట్‌ఫోన్ ద్వారా తెలుసుకోవడం వలన ప్రయోజనం కన్నా స్మార్ట్‌ఫోన్‌పై ఆధారడడానికి అలవాటు పడే అవకాశం ఎక్కువ అంటారు. మొబైల్ ఫోన్‌లు రేడియో ఫ్రీక్వెన్సీ రేడియేషన్‌ను విడుదల చేస్తాయి, ఇది వాటిని కవరేజీని అందించే సెల్ టవర్‌లకు కలుపుతుంది. స్మార్ట్‌ఫోన్‌లు విడుదల చేసే సిగ్నల్‌ను ఎలక్ట్రోమాగ్నెటిక్ రేడియేషన్ లేదా ఈఎంఎఫ్ అంటారు. ఈ విద్యుదయస్కాంత వికిరణం ఇతర రకాల రేడియేషన్‌లను కవర్ చేస్తుంది, అవి మొబైల్ ఫోన్‌లను ఉపయోగించినప్పుడు ఉత్పత్తులుగా విడుదలయ్యే వేడి, మైక్రోవేవ్‌లు వంటివి.



మోటే చిరంజీవి
9949194327

మన మొబైల్ ఫోన్‌లను మన చెవులకు దగ్గరగా ఉంచినప్పుడు, రేడియో తరంగాలు నేరుగా మన మెదడులోకి ప్రవేశిస్తాయి. ఇది మన మొత్తం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. డబ్ల్యూహెచ్ఓ ప్రకారం మొబైల్ ఫోన్ వినియోగం ద్వారా అనారోగ్యం భారిన ప్రభావం ఉండే అవకాశం ఉంది.

పిల్లలు వారి శరీరాలు ఇంకా అభివృద్ధి చెందుతున్నందున మొబైల్ ఫోన్‌ల చెడు ప్రభావాలతో చాలా హాని కలుగుతుంది. అంతేకాకుండా, ఫోన్‌లను తమ చేతుల్లో, జేబుల్లో లేదా బ్యాగ్‌లలో తీసుకెళ్లడం వల్ల ఈఎంఎఫ్‌కు ఎక్కువ బహిర్గతం అవుతుంది. పిల్లలు నిద్రపోతున్నప్పుడు ఫోన్‌లను వారి తలలకు దగ్గరగా ఉంచడం వలన ఈ బహిర్గతం కొనసాగుతుంది. మొబైల్ ఫోన్‌ను ఉపయోగించడం వల్ల కలిగే ప్రధాన ప్రయోజనం ఏమిటంటే అవి కమ్యూనికేషన్ మోడ్‌ను సులభతరం చేయడం, చౌకగా చేయడం. దాదాపు 95శాతం మంది ప్రజలు కమ్యూనికేషన్ కోసం మొబైల్ ఫోన్‌లను ఉపయోగించే టెలికాం పరిశ్రమలో ఒక విప్లవం. మొబైల్ కమ్యూనికేషన్‌ను సులభతరం చేసింది కేవలం మొబైల్‌లో కొన్ని కీలను నొక్కడం ద్వారా, తోటి స్నేహితులు, కుటుంబ సభ్యులు లేదా సహోద్యోగులను, ఇతరులను ఎప్పుడైనా సంప్రదించవచ్చు. వాయిస్ కాల్‌లు, వీడియో కాల్‌లు, టెక్స్ మెసేజ్‌లు, రికార్డ్ చేసిన కాల్‌లు మరెన్నో వాటితో మన తోటి వ్యక్తిని సంప్రదిం చడానికి మొబైల్ సదుపాయాన్ని కూడా అందిస్తుంది.

వర్చువల్ పరివర్తన కుటుంబంలోని ప్రతి సభ్యుడిని ఏకాంతంగా ఉంచింది. యువ కాశ్మీరీలు ఇంటర్నెట్‌ను అధికంగా ఉపయోగించడంతో నిమగ్నమైనట్టు సర్వేల ద్వారా అందిన సమాచారం. అందుకే అవసరానికి మించి మొబైల్‌ను వాడకూడదు. అది అనారోగ్యమే కాదు దుష్ఫలితాలను ఇస్తుంది. మంచి కోసం మాత్రమే మొబైల్‌ను వాడాలి తప్ప చెడును ప్రోత్సహించే విధంగా వాడకం ఉండకూడదు. ఆ దిశగా తల్లిదండ్రులు కానీ, ఉపాధ్యాయులు కానీ ప్రయత్నం చేయాలి. ■

ఢిల్లీలో మళ్లీ విద్వేష ప్రసంగాలు

న్యూఢిల్లీ : విద్వేష ప్రసంగాల్ని మొగ్గ దశలోనే అడ్డుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలున్నా..మోడీ సర్కార్ ఆ ఆదేశాల్ని పెడచెవిన పెడుతోంది. దాంతో హిందూత్వ శక్తులు చెలరేగిపోతున్నాయి. ఢిల్లీ వేదికగా విద్వేష ప్రసంగాలకు అడ్డుఅదుపు లేకుండా పోతోంది. కొద్ది రోజుల క్రితం ఢిల్లీలో 'సనాతన్ ధర్మ సన్సద్' పేరుతో ఒక కార్యక్రమం నిర్వహించగా, అందులో పాల్గొన్న హిందూత్వ సంస్థల నాయకులు మైనార్టీలపై విద్వేషాన్ని వెళ్లగక్కారు. ఈ ప్రసంగాలపై పోలీసులకు ఫిర్యాదులు వెల్లువెత్తగా, కేవలం ట్విట్టర్ ఖాతాలను నిలుపుదల చేస్తూ చర్యలు తీసుకున్నారు. విద్వేష ప్రసంగాలు చేసిన నాయకులపై ఢిల్లీ పోలీసులు కేసులు నమోదు చేయక పోవటం విమర్శలకు దారితీసింది. ధీరేంద్ర శాస్త్రి, ఆయన మద్దతుదారుల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న ఢిల్లీలో 'సనాతన్ ధర్మ సన్సద్' ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించిన భక్త హరి మహరాజ్, మరికొంత మంది మైనార్టీలపై విద్వేషాన్ని వెళ్లగక్కుతూ ప్రసంగించారు. ఈ ప్రసంగాల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయినా ఢిల్లీ పోలీసులు చర్యలు చేపట్టడం లేదు.

వీడియోలు ప్రసారం కాకుండా ట్విట్టర్‌కు నోటీసులు జారీచేసి పోలీసులు చేతులు దులుపుకున్నారు. అంతకు మించి నిందితులపై ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. ఒక వర్గం వారిని లక్ష్యంగా చేసుకొని విద్వేష ప్రసంగాలు చేశారని వీడియో దృశ్యాలతో స్పష్టమైన ఆధారాలున్నా పోలీసులు కేసులు నమోదుచేయక పోవటంపై విమర్శలు వస్తున్నాయి. "పోలీసుల నుంచి నోటీసు మాకెందుకు వచ్చిందో తెలియటం లేదు. ఇది మమ్మల్ని ఆశ్చర్యపర్చింది. విద్వేష ప్రసంగాలు చేసినవారికే నోటీసులు పంపాల్సింది" అంటూ ట్విట్టర్ స్పందించింది.

రామచరిత మానస్‌ను జాతీయ పుస్తకంగా, గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని, ధీరేంద్ర శాస్త్రికి 'జెడ్ ప్లస్' కేటగిరి భద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని 'ధర్మ సన్సద్' డిమాండ్ చేసింది. మైనార్టీలపై హింసకు దిగాలని మెజార్టీ హిందువుల్ని రెచ్చగొడుతూ సభ ప్రారంభమైన కొద్ది సేపటికి ప్రసంగాలు మొదలయ్యాయి. ఇండియాను హిందూ రాష్ట్రంగా మార్చాలని మద్దతుదారులకు ధీరేంద్ర శాస్త్రి, మిగతా నాయకులు పిలుపునిచ్చారు. రామ్‌చరిత్ మానస్‌ను వ్యతిరేకిస్తున్న రాజకీయ నాయకుల్ని ముఖ్య అతిథి భక్త హరి తీవ్రంగా దూషించాడు. ఒక వర్గం వాళ్లని ప్రత్యేకంగా పేర్కొంటూ, "వాళ్లని ఎప్పుడు చంపుతావు? నీ దగ్గర ఆయుధాల్లేవా? కూరగాయలు కోసే కత్తి వుందికదా? కత్తులు, తుపాకులు తెచ్చుకో. చూడండి...మన దేవుళ్లందరి దగ్గరా ఏదో ఒక ఆయుధం ఉంటుంది. అలాగే నీ దగ్గర కూడా ఒక ఆయుధం ఉండాలి. మత పుస్తకాలు, ఆయుధాలు సమన్వయం చేసుకుంటూ ముందుకువెళ్లు" అంటూ భక్త హరి తీవ్ర వ్యాఖ్యలు చేశాడు.

బదిలీలు, పదోన్నతుల తర్వాత ఉపాధ్యాయ నియామకాలు

- మంత్రి సబిత వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల తర్వాత నియామకాల ప్రక్రియ చేపడతామని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. శాసనమండలి ఆవరణలో బుధవారం తనను కలిసిన విలేకర్లతో ఆమె మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతుల తర్వాత ఉపాధ్యాయ ఖాళీలను సేకరిస్తామని అన్నారు. వాటిని క్రోడీకరించి ప్రభుత్వానికి పంపిస్తా మన్నారు. అనంతరం ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని వివరించారు. మరోవైపు రాష్ట్రంలో పాఠశాల విద్యాశాఖలో బోధన, బోధనేతర పోస్టులు కలిపి 13,086 ఖాళీలను భర్తీ చేస్తామంటూ ప్రభుత్వం గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. 12 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసే అవకాశమున్నట్టు తెలుస్తున్నది. ఉపాధ్యాయ నియామకాల కోసం లక్షలాది మంది అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే టెట్ నిర్వహించారు. అందులో అర్హత పొందిన వారు కోచింగ్ తీసుకుంటున్నారు.

ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టలే

ఇంటర్ బోర్డు కార్యదర్శిగా ప్రస్తుతానికి నవీన్ మిట్టలే కొనసాగుతున్నారని మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. కొత్త వారిని నియమించే దాకా ఆయన ఆ పదవిలో కొనసాగుతారని చెప్పారు.

ఆర్‌బీఐ 'ఆరోసారీ'...

(మొదటిపేజీ తరువాయి)

6.50 శాతానికి చేర్చింది. తాజాగా ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన మూడు రోజుల పాటు సాగిన ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) విధాన సమీక్ష బుధవారం ముగిసింది. తాజా పెంపునతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు మరింత ప్రియం కానున్నాయి.గతేడాది మే నుంచి రెపోరేటును 250 బేసిస్ పాయింట్లు పెంచింది. చమురు ధరలు, భౌగోళిక రాజకీయ పరిణామాల కారణంగా భారత భవిష్యత్ అంచనాలు అస్పష్టం గానే ఉన్నాయని శక్తికాంత దాస్ అన్నారు. ప్రజలు ఇకపై నాణేలు సులభంగా పొందేందుకు వీలుగా ప్రయోగాత్మక ప్రాజెక్టు కింద 12 నగరాల్లో కాయిన్ వెండింగ్ మిషన్లను ఏర్పాటు చేయనున్నామన్నారు.

ఆర్‌బీఐ ఎంపీసీలో నిర్ణయాలు...

గతేడాది మే నుంచి ఇప్పటి వరకు 250 బేసిస్ పాయింట్లు లేదా 2.50 శాతం పెంచినట్లయ్యింది. భేటీ వివరాలను శక్తికాంత దాస్ మీడియాకు వెల్ల డించారు.. ఆ అంశాలు. సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ అయినా రిటైల్ ఈ-రూపీ ప్రయో గాలను మరిన్ని నగరాలకు విస్తరించనున్నారు. ఈ ప్రక్రియ లో మరిన్ని బ్యాంకులకు భాగస్వామ్యం కల్పించ నున్నామని శక్తికాంత దాస్ తెలిపారు. ఈ-రూపీ సేవలను మరో 5 బ్యాంకులు, 9 నగరాలకు విస్తరించనున్నట్లు పేర్కొన్నారు.

టోకు అవసరాలకు సంబంధించిన ఈ-రూపీ ప్రయోగాలను గతేడాది నవంబర్ 1న, రిటైల్ అవసరాలకు సంబంధించిన ఈ-రూపీని డిసెంబర్ 1న ఆర్‌బీఐ ప్రారంభిం చింది. ప్రస్తుతం రిటైల్ ఈ-రూపీని ప్రయోగాత్మ కంగా 50 వేలమంది వినియోగదారులు, 5 వేల మంది వ్యాపారులు వినియోగిస్తున్నారని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ టి రవి శంకర్ తెలిపారు. ఈ- రూపీ కరెన్సీ వినియోగంలో ఎలాంటి అవరోధాలూ తలెత్తకూడదన్న ఉద్దేశంతో నెమ్మదిగా ఈ విధానాన్ని అందిపుచ్చుకోవాలని నిర్ణయించామన్నా రు. గౌతం అదానీపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్ట్‌పై శక్తికాంత దాస్ స్పందించారు. వ్యక్తిగత సంఘటన లేదా ఓ కేసు ద్వారా బ్యాంకులు ప్రభావితం అయ్యే అవకాశం లేదన్నారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థ బలంగా ఉన్న దని, మరింత బలోపేతం చేసుకునేం దుకే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ప్రత్యేకమైన పరిస్థితులు ద్రవ్యపరపతి విధానాన్ని సవాలుగా మార్చేశాయని శక్తికాంత దాస్ అన్నారు. ద్రవ్యోల్బణం విషయంలో ద్రవ్య పరపతి విధాన కమిటీ అప్రమత్తంగానే ఉందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2023-24లో ద్రవ్యోల్బణం 4 శాతం లక్ష్యం కంటే ఎక్కువగానే ఉండొచ్చన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ పెరుగుదల 6.5 శాతా నికి మందగించవచ్చన్నారు. వచ్చే 2023-24లో ఇది 6.4 శాతానికి తగ్గొచ్చన్నారు. 2021-22లో 8.7 శాతం వృద్ధి నమోదయిన విషయం తెలిసిందే.

కేంద్రం ఆర్థిక అడ్డంకులు

(మొదటిపేజీ తరువాయి)

అక్బరుద్దీన్ ఓవైసీ విమర్శించారు. తెలంగాణ ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధించకపోవడానికి కారణం ఇదేనని చెప్పారు. బుధవారం శాసనసభలో బడ్జెట్ పద్దులపై ఆయన చర్చను ప్రారంభిస్తూ...కేంద్రం తెలంగాణకు రావాల్సిన నిధుల్లో వాటాను తగ్గించిందని విమర్శించారు. తద్వారా రాష్ట్రాల పట్ల నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. గత ఎనిమిదేండ్లలో తెలంగాణ అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందిందన్నారు. అయితే వివిధ ప్రాజెక్టులకు ఆర్థిక సాయం విషయంలో కేంద్రం ఉదారంగా సాయం చేసి ఉంటే, మరిన్ని విజయాలు సాధించి ఉండేదన్నారు.

అయినా తెలంగాణ రాష్ట్రం స్వయం కృషితో గణనీయమైన అభివృద్ధి సాధిస్తున్నదని పేర్కొన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు రూ. 7,496 కోట్లు, ఏపీకి రూ. 33,376 కోట్లు, 2022-23లో తెలంగాణకు రూ.19,668 కోట్లు, ఏపీకి రూ.38,177 కోట్లు అందాయనీ, 2023-24లో తెలంగాణకు రూ.21,471 కోట్లు, ఏపీకి రూ.41,338 కోట్లు వస్తాయని అంచనా వేసినట్టు తెలిపారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఏపీ-తెలంగాణ వాటాల నిష్పత్తి 58:42గా ఉండాలనీ, ఈ విషయంలో కేంద్రం తెలంగాణ పట్ల పక్షపాత దోరణితో వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఈయేడాది రుణ పరిమితిని కేంద్రం రూ.19,000 కోట్లు తగ్గించిందన్నారు. 2022-23లో రూ. 53,970 కోట్లను ప్రతిపాదించగా రూ.34,970 కోట్లు మాత్రమే రుణం తీసుకోవాలని రాష్ట్రంపై ఒత్తిడి పెంచిందన్నారు. వివిధ ఆర్థిక సంస్థల నుంచి రూ. 100 లక్షల కోట్లకు పైగా రుణం తీసుకున్న కేంద్రం...తెలంగాణ తీసుకుంటే తప్పుపడుతున్నదన్నారు. వివిధ అభివృద్ధి పనుల కోసం కేంద్రం తీసుకుంటున్న అప్పులకు ప్రతిరోజుకు రూ.2958.82 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్పు చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. త్వరలో ఏర్పాటు చేయనున్న 16వ ఆర్థిక సంఘానికి వాస్తవ అంచనాలను పంపాలంటూ కోరారు. ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన మొత్తాన్ని విడుదల చేయాలని కోరారు. ఆ పథకానికి సంబంధించి దాదాపు 35,494 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనీ, ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేస్తే క్లియర్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. మైనార్టీ విద్యార్థులకు అందించే ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను కేంద్రం రద్దు చేసిన నేపథ్యంలో విద్యార్థులు ప్రయోజనం పొందేలా రాష్ట్రం కూడా ఇదే పథకాన్ని ప్రవేశపెట్టాలని ఆయన అన్నారు.

రేవంత్ అసాంఘిక శక్తి

- ప్రగతిభవన్‌పై తప్పుడు కూతలు
- పాదయాత్రపై మంత్రులు, ఎమ్మెల్యేలు ధ్వజం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఓ అసాంఘిక శక్తిగా మారారని పలు వురు మంత్రులు, టీఆర్ఎస్ ఎమ్మెల్యే లు విమర్శించారు. మీడియా దృష్టిని ఆకర్షించేందుకు ప్రగతిభవన్‌పై తప్పు డు కూతలు కూస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. బుధవారం టీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో జరి గిన విలేకరుల సమావేశంలో మంత్రు లు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు గండ్ర వెంకట రమణారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపనేని నరేందర్, ఆరూరి రమేష్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి పాదయాత్ర కు ప్రజల మద్దతు కరువైందనీ, మీడియా దష్టిని ఆకర్షించేందుకు తప్పుడు కూతలు కూస్తున్నారని అన్నారు. ప్రగతి భవన్‌ను గ్రెనేడ్లతో పేల్చేయాలని రేవంత్‌రెడ్డి అనడాన్ని తప్పుపట్టారు. ప్రగతి భవన్ ఎన్నో ఆలోచనలు, పథకాల అమలుకు వేదిక అనీ, ఈ స్థాయిలో గతంలో ఏ నాయకుడూ మాట్లాడలేదని అన్నారు. కాంగ్రెస్ సీనియర్లు రేవంత్ వ్యాఖ్యలను సమర్థిస్తున్నారా అని ప్రశ్నించారు. రేవంత్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి, పీడీ యాక్ట్ పెట్టాలని డిమాండ్ చేశారు. రేవంత్ ఓ బ్లాక్ మెయిలర్ అనీ, ప్రజలు ఆయన్ని వదిలిపెట్టరని చెప్పారు. స్థాయి లేని వాడికి పీసీసీ అధ్యక్ష పదవి ఇచ్చారనీ, నక్సలైట్ల భుజం మీద తుపాకీ పెట్టి కాలుస్తున్నారని విమర్శించారు.

ప్రధానోపాధ్యాయుల ఖాళీలు పూర్తిగా నింపాలి : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ పదోన్నతుల్లో ప్రధానోపాధ్యాయుల ఖాళీలను పూర్తిగా నింపాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణను బుధ వారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ కలిసి వినతిపత్రం సమర్పించారు.

ప్రస్తుత ఉపాధ్యా యుల పదోన్నతుల కోసం 1:2 పద్ధతిలో వారి సర్వీస్‌ను పరిశీలించి వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా ఆప్షన్లు స్వీక రించి నిర్వహించబోతున్నారని వివరిం చారు. తద్వారా అనేక ప్రధానోపాధ్యా యుల పోస్టులు ఖాళీగా మిగిలిపోయే పరిస్థితులున్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది చివరి నాటికి అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులు నింప డానికి సరిపడా 1:3 నిష్పత్తిలో స్కూల్ అసిస్టెంట్ల సర్వీసులు పరిశీలించి ఎక్కువ మంది వెబ్‌కౌన్సెలింగ్‌లో పాల్గొనేలా అవకాశమివ్వాలని సూచిం చారు. లేకుంటే ప్రత్యక్ష పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించి ఎక్కువ మంది స్కూల్ అసిస్టెంట్లు హాజరయ్యే అవ కాశమివ్వాలని కోరారు. విద్యా సంవత్సరం ముగిసే నాటికి ఉన్నత పాఠశాలలన్నీ ప్రధానోపాధ్యాయుల పోస్టులతో నింపాలనీ, ఖాళీల్లేకుండా నివారించాలని సూచించారు.

అబద్ధాల ప్రధాని :ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హిడెన్ బర్గ్ నివేదిక విడుదలైన 10 రోజుల్లోనే అదానీ ప్రపంచంలోని ధనవంతుల జాబితాలో 2వ స్థానం నుండి 22 వ స్థానానికి పడిపోయారని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. అదానీ సంస్థ అనేక ప్రభుత్వరంగ సంస్థల నుంచి అప్పులు తీసుకున్నదనీ, దానిలో భాగంగా ఎల్ఐసీ అదానీ గ్రూప్‌లో రూ.80 వేల కోట్లు పెట్టుబడి పెట్టిందన్నారు. ఎస్‌బీఐ నుంచి రూ. 27 వేల కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి రూ. 5,380 కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి రూ.7 వేల కోట్లు... ఇలా ఏడు జాతీయ బ్యాంకులు అదానీ సంస్థల్లో పెట్టుబడులు పెట్టాయన్నారు. హిడెన్ బర్గ్ నివేదిక తర్వాత అదానీ సంస్థల షేర్లు 51శాతం పడిపోగా, ఎల్ఐసీ రూ.18 వేల కోట్లు నష్టపోయిందని వివరించారు. ఇంత జరుగుతున్నా ప్రధాని నరేంద్రమోడీ మౌనంగా ఉంటున్నారనీ, అలాంటి ప్రధాని దేశానికి అవసరమా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన రైతు బంధు పథకాన్ని కాపీకొట్టి కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకాన్ని ప్రారంభించిందనీ ఏటా లబ్దిదారుల సంఖ్యను తగ్గించుకుంటూ పోతున్నారని చెప్పారు. దీనిపై కూడా ప్రధాని నరేంద్రమోడీ పార్లమెంటు సాక్షిగా అబద్ధాలే చెప్పారని విమర్శించారు.

ఇంటర్ విద్యార్థులకు నేటినుంచి టీశాట్ ద్వారా పరీక్ష చిట్కాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని జూనియర్ కాలేజీల్లో చదువుతున్న ఇంటర్మీడియెట్ విద్యార్థు లకు టీశాట్, ఇంటర్ బోర్డు సమన్వ యంతో రాష్ట్ర ప్రభుత్వం మానసిక నిపుణులతో గురువారం నుంచి పరీక్ష చిట్కాలను ప్రసారం చేయనుంది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వార్షిక పరీక్షలకు ముందు విద్యార్థులందరి ప్రయోజనం కోసం ప్రేరణ తరగతుల ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేస్తున్నా మని తెలిపారు. గురువారం నుంచి ప్రత్యక్ష ప్రసారాలు టీశాట్ నిపుణలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయని వివరిం చారు. ఇవి విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసా న్ని నింపుతాయనీ, పరీక్షలను సుల భంగా ఎదుర్కొనేలా ప్రేరేపిస్తా యని పేర్కొన్నారు. విద్యార్థులందరూ దీన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కొత్త బ్రాడ్ గేజ్ లైన్ ప్రారంభం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మహబూబ్‌నగర్ - మునీరాబాద్ నూతన రైల్వే లైన్ ప్రాజెక్టులో భాగంగా కష్టా-మాగనూర్ స్టేషన్ల మధ్య 12.7 కిలోమీటర్ల దూరంతో కొత్త బ్రాడ్ గేజ్ విద్యుత్ రహిత ప్రధాన లైన్ పనులు పూర్తి అయ్యి ప్రారంభించి నట్టు దక్షిణ మధ్య రైల్వే బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపింది. ఇది తెలంగాణ- కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు పరిధిలో ముఖ్యమైన ప్రాజెక్ట్ అనీ, మహబూబ్‌నగర్ - దేవరకద్ర విభాగం ఇప్పటికే సికింద్రా బాద్-కర్నూల్ మధ్య సెక్షన్‌లో ఉన్నదని వివరించారు. ఇప్పుడు ఈ కొత్త లైన్ దేవరకద్ర నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌లో దేవ రకద్ర - కష్టా మధ్య 66 కి.మీ.మేర మొత్తం పనులు పూర్తయ్యాయన్నారు. మహబూబ్ నగర్ - మునీరాబాద్ నూతన లైన్ ప్రాజెక్ట్ చేపట్టేందుకు రూ. 3543 కోట్ల తాజా అంచనా వ్యయంతో మంజూరు చేయబడిందని వివరించారు.

వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులనూ రెగ్యులరైజ్ చేయాలి

- తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్ల జేఏసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్ల జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ జేఏసీ చైర్మెన్ ఎం రామేశ్వర్‌రావు, కన్వీనర్ శ్రీధర్ కుమార్‌లోధ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 11 వర్సిటీల్లో 1,335 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుంచి జేఎల్, డీఎల్, పాలిటెక్నిక్ కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేస్తున్నట్టు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులూ 25 ఏండ్ల నుంచి బోధిస్తున్నారని పేర్కొన్నారు. వర్సిటీల అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారని వివరించారు. వారికి న్యాయం చేయాలని కోరారు.

తొలి ఆతిథ్యం.. సరికొత్త అనుభూతి

ఫార్ములా-ఈ ప్రపంచ చాంపియన్‌షిప్ ఎన్నో ప్రత్యేకతలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ తీరాన ఈ నెల 11, 12 తేదీల్లో జరగనున్న 'హైదరాబాద్ ఫార్ములా ఈ-రేస్' నగరవాసులకు సరికొత్త అనుభూతిని అందించనుంది. ఫార్ములా-ఈ ప్రపంచ చాంపియన్‌షిప్ ప్రత్యేకతలు సంతరించుకుంది. ఫార్ములా-1కు పూర్తి భిన్నంగా.. ఫార్ములా-ఈ రేసింగ్‌కు పర్యావరణ అనుకూల ఎలక్ట్రిక్ వాహనాలతో రూపకల్పన జరిగింది. భారత్‌లో హైదరాబాద్ ఆతిథ్యమిస్తోంది. దాంతో తొలి అంతర్జాతీయ ఈ-రేస్ నగరాన్ని ఊపేస్తుంది.

ఈ-రేస్ కార్లు గంటకు గరిష్టంగా 174 కిలోమీటర్ల వేగం

మోటార్ రేస్‌తో పోల్చితే ఈ(ఎలక్ట్రానిక్ కార్ల)-రేస్ కొంత ఉత్సాహానిస్తోంది. 2014 నుంచి జరుగుతున్న ఈ తరహా రేసుల్లో ఉపయోగిస్తున్న ఆధునిక టెక్నాలజీ కారణంగా కొత్తపుంతలు తొక్కుతోంది. పలు కంపెనీలు తమ ఉత్పత్తులను, సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటడానికి అద్భుత వేదికగా భాగ్యనగరం మారింది. ప్రముఖ మోటార్ కంపెనీలు బీఎండబ్ల్యూ, జాగ్వార్, పోర్షేలు కూడా ఎలక్ట్రికల్ ఫార్ములా రేస్ కార్ల తయారీకి ఉపక్రమించాయంటే ఇక్కడ నెలకొన్న డిమాండ్ ఏంటో ఇట్టే అర్థమవుతోంది. బ్యాటరీతో నడిచే ఈ-రేస్ కార్లు గంటకు గరిష్ఠంగా 174 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తాయి. కేవలం 3 సెకన్లలోనే 0 నుంచి 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలవు. ఆధునిక బ్యాటరీ టెక్నాలజీ కారణంగా సింగిల్ చార్జింగ్‌తో రేస్‌ను పూర్తి చేయగల సామర్థ్యం వీటి సొంతం. అన్ని జట్లకూ అవకాశాలు ఉండాలనే ఉద్దేశంతో జట్టు నాలుగు కార్లను మాత్రమే ఉపయోగించేలా నిబంధనలు రూపొందించారు.

20వేలకుపైగా హాజరు

నెల రోజుల ముందు నుంచే ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. బ్రహెయిన్‌లో జరిగిన దానికంటే హైదరాబాద్‌లో ఈ రేస్ సూపర్‌హిట్ అవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. 'బుక్ మై షో' ద్వారా ఆన్‌లైన్‌లో టిక్కెట్ల విక్రయాలు జరిపారు. గ్రాండ్‌స్టాండ్ టిక్కెట్ ధరను రూ.1000, చార్జ్‌డ్ గ్రాండ్‌స్టాండ్ ధరను రూ.4000, ప్రీమియమ్ గ్రాండ్‌స్టాండ్ ధరను రూ.7000, ఏస్ గ్రాండ్‌స్టాండ్ ధరను రూ.10,500గా నిర్ణయించారు. ఈ రేసును చూసేందుకు సుమారు 20 వేల మంది హాజరయ్యే అవకాశం ఉండటంతో పోలీసులతోపాటు, ప్రభుత్వ శాఖలు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశాయి.

భద్రత కట్టుదిట్టం

హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ (ట్యాంక్‌బండ్)- ఎన్టీఆర్ మార్గంలో ఈనెల 11, 12న అంతర్జాతీయ స్థాయిలో ఈ రేసింగ్ నిర్వహిస్తుండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా 575 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వారు ప్రత్యక్షంగా ట్రాక్‌ను పరిశీలించిన విషయం తెలిసిందే. ప్రేక్షకుల ప్రవేశ మార్గాలను, పార్కింగ్ ఏరియాలను సీపీ పరిశీలించారు. శనివారం మెయిన్ రేసింగ్ కావడంతో 20వేల మందికిపైగా ప్రేక్షకులు వచ్చే అవకాశముండటంతో అందుకు తగినట్టుగా ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఇదిలావుండగా నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ మార్గ్‌తోపాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్టు అదనపు సీపీ, ట్రాఫిక్ బాస్ సుధీర్‌బాబు తెలిపారు.

ఈ-రేసు స్టీరింగ్ హీరోలు

ఎఫ్-1 డ్రైవర్లు లూయిస్ హామిల్టన్, మార్క్ వెర్‌స్టాపెన్ తరహాలో ఈ-రేసు డ్రైవర్లు జీన్-ఎరిక్ వెర్నియా, నికో ప్రోస్ట్, స్కాట్ డిక్సన్ పాపులారిటీ సంపాదించారు. ఎఫ్-1 రేసుల్లో పాల్గొన్న ఎంతో మంది ఈ ఎలక్ట్రిక్ కార్ల రేసుల వైపు కూడా ఆసక్తి చూపుతున్నారు.

విద్యుత్ కోతలపై రైతులు రాస్తారోకో

నవతెలంగాణ-ముదిగొండ

విద్యుత్ కోతలను నిరసిస్తూ ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురం, ముదిగొండ విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట పల్లభి- ముదిగొండ, కోదాడ- ఖమ్మం ప్రధాన రహదారిపై బుధవారం రాస్తారోకో నిర్వహించారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నామని రైతులు వాపోయారు. ప్రభుత్వం 24 గంటలు ఉచిత విద్యుత్ పేరుకు మాత్రమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగు చేసిన మొక్కజొన్న పంటలు మోటార్లు నడవక నీరు లేక ఎండిపోతున్నాయని రైతులు తెలిపారు. సమయపాలన లేకుండా విద్యుత్ పోవటంతో పలు ఇబ్బందులకు గురవుతున్నామని చెప్పారు.

కంటివెలుగు దేశంలోనే గొప్ప పథకం

- శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కంటివెలుగు దేశంలోనే గొప్ప పథకమని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం శాసనసభ లాంజీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు ప్రత్యేక శిబిరాన్ని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ... రాష్ట్రంలో కంటివెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నదని చెప్పారు. ఈ పథకం పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నదనీ, అది ఒక వరం లాంటిదని అన్నారు. ఇతర రాష్ట్రాల సీఎంలు కూడా మన కంటి వెలుగు పథకాన్ని ఆయా రాష్ట్రాలలో అమలు చేయాలని ఆలోచిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లందరూ ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకుని పరీక్షలు చేయించు కోవాలని సూచిం చారు. కార్యక్రమంలో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు, లెజిస్లేటివ్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు, అధికారులు, అసెంబ్లీ సిబ్బంది పాల్గొన్నారు.

అక్బరుద్దీన్, పాషాఖాద్రీ, ముంతాజ్‌ఖాన్‌లకు దగ్గరుండి పరీక్షలు చేయించిన మంత్రి హరీశ్‌రావు

ఎంఐఎం సభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ, పాషాఖాద్రీ, ముంతాజ్‌ఖాన్‌ను కంటివెలుగు శిబిరం వద్దకు ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు తీసుకొచ్చి మరీ కంటి పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా కంటివెలుగు ప్రాముఖ్యతను మంత్రి వివరించారు. కంటి వెలుగు కార్యక్రమం అద్భుతంగా ఉందని ఎంఐఎం సభ్యులు కొనియాడారు. ఈ పథకం ద్వారా పేద ప్రజలకు ఎంతో లబ్ది కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శాసనసభ ఆవరణలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావుకు అభినందనలు తెలిపారు.

అసెంబ్లీలో ఆర్టీసీపై చర్చించండి

- ప్రతిపక్షనేతలకు టీఎస్‌ఆర్టీసీ జేఏసీ నేతల వినతిపత్రాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆర్టీసీపై చర్చించి, పెండింగ్ సమస్యలు పరిష్కరించేలా నిర్ణయాలు తీసుకోవాలని టీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు. బడ్జెట్‌లో సంస్థకు 2 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బుధవారం ప్రతిపక్షపార్టీల నేతలకు వినతిపత్రాలతో పాటు, ప్రస్తుతం ఆర్టీసీ స్థితిగతులపై సవివర నివేదికలను కూడా అందచేశారు. జేఏసీ చైర్మెన్ కే రాజిరెడ్డి, కన్వీనర్ వీఎస్ రావు శాసన మండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. జేఏసీ కో కన్వీనర్ కే యాదయ్య, కొవ్వూరి యాదయ్య, పత్తిరి కృష్ణ బీజేపీ ఎమ్మెల్యే కే రఘునందనరావుకు వినతిపత్రం ఇచ్చారు. కాంగ్రెస్ శాసనస భాపక్షనేత మల్లు భట్టి విక్రమార్కకు సామా ఓజిక మాధ్యమం ద్వారా వినతిపత్రం పంపారు. దారుస్సలాంలో ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీకి జేఏసీ ఎమ్‌ఏ మజీద్ వినతి పత్రం ఇచ్చారు. 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి తగినన్ని నిధులు కేటాయించలేదనీ, రెండు శాతం నిధులు కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ప్రతిపక్ష నేతలను కోరారు. సంస్థలో యూనియన్లపై ఆంక్షలు ఎత్తేసి, ప్రజాస్వామ్య వాతావరణం కల్పించాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలనీ, రెండు వేతన సవరణలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీసీఎస్, పీఎఫ్ ట్రస్ట్‌లకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలనీ, బస్సుల సంఖ్య పెంచాలని కోరుతూ వినతిపత్రాల్లో పేర్కొన్నారు.

ఎమ్మెల్యేల ఎరకేసు....

రాష్ట్ర ప్రభుత్వ అప్పీల్ తోసిపుచ్చిన హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎమ్మెల్యేల ఎరకు సంబంధించిన కొనుగోలు వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిన తీర్పును యథాతథంగా ఉంచాలన్న ప్రభుత్వ ప్రయత్నాలు హైకోర్టులో బెడిసికొట్టాయి. సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేసే వరకు హైకోర్టు తీర్పు అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలన్న అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. సింగిల్ జడ్జి వద్ద దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను విచారణకు అనుమతించేలా ఉత్తర్వులు ఇవ్వాలని డివిజన్ బెంచ్‌ను కోరితే అందుకు నిరాకరిస్తూ చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. తమ తీర్పుపై అప్పీల్ సుప్రీంకోర్టులోనే చేసుకోవాలని, హైకోర్టులో కాదని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వుల నేపథ్యంలో సింగిల్ జడ్జి వద్ద ఉన్న పిటిషన్‌ను రాష్ట్ర సర్కార్ వాపస్ తీసుకుంది. తొలుత ఏజీ బీఎస్ ప్రసాద్ వాదిస్తూ, ఇప్పటికే సుప్రీంకోర్టులో ప్రస్తావించామనీ, ఆ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసే వరకు సింగిల్ జడ్జి యథాతథస్థితిగా మధ్యంతర ఉత్తర్వులు జారీ అంశంపై విచారించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

దీనిపై ధర్మాసనం, ఒకసారి సింగిల్ జడ్జి తీర్పు చెప్పిన తర్వాత దానిపై అప్పీల్ కూడా దాఖలైనప్పుడు మళ్లీ ఆ అంశాన్ని సింగిల్ జడ్జి విచారించే ఆస్కారమే లేదని చెప్పింది.

కల్తీ విత్తనాల బెడద లేదు

- త్వరలో వ్యవసాయ వర్సిటీ వీసీ నియామకం
- మండలిలో మంత్రి నిరంజన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కల్తీ విత్తనాల బెడద లేదని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్‌ఎస్ సభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి ఈ అంశాన్ని లేవనెత్తారు. అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ పోస్టు ఖాళీగా ఉందనీ, వెంటనే నియమించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సమాధానమిస్తూ కల్తీ విత్తనాలు తయారు చేసే 21 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. ఇటీవలే వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ పోస్టు ఖాళీ అయ్యిందన్నారు. ఆ శాఖ కార్యదర్శి ఇన్‌ఛార్జీగా వ్యవహరిస్తున్నారని వివరించారు. యూజీసీ చట్టం, వ్యవసాయ విశ్వవిద్యాలయ చట్టం మధ్య కొంత ఇబ్బంది ఉందన్నారు. దానిపై స్పష్టత వచ్చాక త్వరలోనే నియమిస్తామని చెప్పారు.

కేంద్రం ఇచ్చేది రూ.200 పింఛన్ మాత్రమే : ఎర్రబెల్లి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్రంలోని 6.6 లక్షల మందికి రూ.200 చొప్పున పింఛన్ ఇస్తూ గొప్పలు చెప్తున్నదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు. 2014లో 29,21,828 మందికి పింఛన్లు ఇచ్చామని అన్నారు. అప్పుడు ఏడాదికి రూ.861 కోట్లు ఖర్చు చేశామన్నారు. ప్రస్తుతం 44,12,882 మందికి నెలకు వృద్ధులు, వితంతువులకు రూ.2,016, వికలాంగులకు రూ.3,016 ఇస్తున్నామని వివరించారు. ఇప్పుడు ఏడాదికి రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని అన్నారు. పింఛన్ పొందే అర్హతను 65 నుంచి 57 ఏండ్లకు తగ్గించిన తర్వాత 8,11,817 మంది దరఖాస్తు చేసుకుంటే 6,05,018 మందికి పింఛన్ ఇస్తున్నామని చెప్పారు.

గిరిజన వర్సిటీని పక్కన పెట్టిన కేంద్రం : సత్యవతి రాథోడ్

కేంద్ర ప్రభుత్వం గిరిజన విశ్వవిద్యాలయాన్ని పక్కన పెట్టిందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ములుగు జిల్లాలో 335.4 ఎకరాల స్థలాన్ని కేటాయించామని వివరించారు. తరగతులు తాత్కాలికంగా నిర్వహించేందుకు జాకారంలో భవనాన్ని కేటాయించామన్నారు. అయినా కేంద్రం చిన్నచూపు చూస్తున్నదని విమర్శించారు. గత బడ్జెట్‌లో ఏపీ, తెలంగాణ గిరిజన వర్సిటీలకు కలిపి రూ.40 కోట్లు, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.35 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. కానీ ఇటీవల పార్లమెంటులో గిరిజన వర్సిటీపై కేంద్రం తప్పుడు సమాచారం ఇవ్వడం సరైంది కాదన్నారు. మహబూబాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు.

ఆత్మ రక్షణకు కరాటే ఎంతో అవసరం

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

సమాజంలో ప్రతీ ఒక్కరికి ఆత్మ రక్షణకు కరాటే ఎంతో అవసరమని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి అన్నారు. బుధవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్‌లోని మల్లాపూర్‌లో ఆకాంక్ష పాఠశాల నుంచి విశాఖపట్నంలో జరిగే కరాటే పోటీలల్లో పాల్గొన విద్యార్థులను బుధవారం మేయర్ అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి వారి జీవితాల్లో కరాటే ఎంతో అవసర మన్నారు. విద్యార్థులు కరాటేలో ప్రతిభ కనబర్చి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకావాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి భువనేశ్వరి డెవలపర్స్ గ్రూప్ ఆర్థిక సాయం



నవతెలంగాణ-హయత్‌నగర్

కరీంనగర్‌కు చెందిన నిరుపేద పూజారి కుటుంబానికి మన్సురాబాద్‌లోని భువనేశ్వరి డెవలపర్స్ గ్రూప్ అండగా నిలిచింది. సంస్థ చైర్మెన్, సీఈవో ఆనంద స్వామిలు రూ. 52,110 నగదు సహాయాన్ని బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎంతో మంది పేద కుటుంబాలు దాతల సహాయం కోసం ఎదురు చూస్తుంటాయని, వాటిలో కొంతమందినైనా ఆదుకోవాలని ఉద్దేశంతో ఉన్నామన్నారు. ఇప్పటికే కొంతమందికి తమ సంస్థ ద్వారా చేయూతనిచ్చామని తెలిపారు.

బిల్లులివ్వరూ.. ఇండ్లు పూర్తి కావు

- డబుల్ ఇండ్ల కోసం లబ్దిదారుల ఎదురుచూపులు
- ఎంపిక పేరుతో కాలయాపన
- ఈ ఎన్నికల ముందైనా ఇచ్చేనా..?

నవతెలంగాణ-సిటీబ్యూరో

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం పేదలు ఎనిమిదేండ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. కాని ప్రభుత్వం ఇండ్లు పూర్తికాలేదని, లబ్దిదారులు ఎంపిక చేస్తున్నామని, అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నామని, లాటరీ విధానంలో అందజేస్తామని చెబుతూ కాలయాపన చేస్తోందని పలువురు ప్రజా సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇది ఉండగా మరోవైపు అసంపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తిచేయకుండా కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. అందుకు బిల్లులు చెల్లించకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నారు. ఇట్లు బిల్లులు ఇవ్వరు.. ఇండ్లను పూర్తిచేయరు.. లబ్దిదారులకు అందజేయరు అంటూ లబ్దిదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

లబ్దిదారుల ఎంపిక, ఇండ్ల కేటాయింపు గురించి గృహ నిర్మాణ శాఖ వేర్వేరుగా జారీ చేసిన మూడు జీఓలు కీలకమని జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. వాటి ప్రకారమే పనిచేయనున్నట్టు తెలిపారు. 15 అక్టోబర్ 2015లో జీవో నెం. 10, అదే ఏడాది నవంబర్ 26న జీవో 12, 6 నవంబర్ 2020లో జారీ చేసిన జీఓ 3లోని అంశాలే కీలకంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే తుది ఉత్తర్వులు జారీచేసి రెండేండ్లు గడిచినా ఫలితంలేకుండాపోయింది. ఈ మూడు ఉత్తర్వుల ఆధారంగా రూపొందించిన మార్గదర్శకాలను సైతం అధికారులు పక్కనపెట్టారనే విమర్శలూ లేకపోలేదు. మరో పక్క మార్గదర్శకాల ఆధారంగా అర్హుల జాబితా సిద్ధం చేస్తామని, లాటరీ ద్వారా లబ్దిదారుల ఎంపిక జరుగుతుందని అధికారులు చెబుతున్నారు

లక్ష ఇండ్ల నేపథ్యం..

గ్రేటర్ హైదరాబాద్‌లో రూ.9,714.59కోట్లతో లక్ష ఇండ్లు నిర్మించాలని సర్కార్ నిర్ణయించింది. 40ప్రాంతాల్లో ఇన్‌సిటూ (పాత ఇండ్లను కూల్చేసి కొత్త నిర్మించడం)లో భాగంగా 8,898 ఇండ్లను 71ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో 91,102 ఇండ్లను నిర్మించాలని నిర్ణయించారు. వీటిలో హైదరాబాద్ జిల్లాలో 9,453, రంగారెడ్డి జిల్లాలో 23,908, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 38,419, సంగారెడ్డి జిల్లాలో 28,220 ఇండ్లు ఉన్నాయి.



ఇన్‌సిటూకే పరిమితం

లక్ష ఇండ్లల్లో 40ప్రాంతాల్లో ఇన్‌సిటూ(పాత ఇండ్లను కూల్చేసి కొత్త నిర్మించడం)లో భాగంగా 8,898 ఇండ్లను నిర్మిస్తున్నారు. వీటిలో ఇప్పటి వరకు 5266 ఇండ్లను పూర్తిచేశారు. 3322 ఇండ్లను లబ్దిదారులకు అందజేశారు. మిగిలిన ఇండ్లు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటితోపాటు ఖాళీ ప్రదేశాల్లో నిర్మించిన 91,102 ఇండ్ల కోసం లబ్దిదారులను గుర్తించాల్సి ఉంది. అయితే 91,102 ఇండ్ల కోసం 10లక్షల దరఖాస్తులు వచ్చిన విషయం తెలిసిందే. దరఖాస్తుల పరిశీలన, లబ్దిదారుల ఎంపిక విషయంలో సర్కార్ నిర్లక్ష్యం వ్యవహరిస్తోందని పేదలు మండిపడుతున్నారు.

67,782 ఇండ్లు రెడీ

ఇన్‌సిటూ ఇండ్లతోపాటు ఖాళీ స్థలాల్లో నిర్మించిన మొత్తం 67,782 ఇండ్లు పూర్తయి పంచడానికి రెడీగా ఉన్నాయి. మరో 32,218 ఇండ్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది మార్చి చివరినాటికి అన్ని ఇండ్లను పూర్తిచేస్తామని ప్రభుత్వం చెబుతోంది. పూర్తిచేసి పేదలకు పంచుతారా? ఎన్నికల తర్వాత అందజేస్తారా? చూడాల్సిందే.

రూ. 1000 కోట్ల బిల్లులు పెండింగ్

లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం రూ.9,714.59కోట్లు ఖర్చుచేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు రూ.6,406.71 కోట్లు ఖర్చుచేశారు. లక్ష ఇండ్లు పూర్తికావాలంటే మరో రూ.3,307.88కోట్లు అవసరం. పేమెంట్ కోసం రూ.400 కోట్ల బిల్లులు సిద్ధంగా ఉన్నాయి. మరో రూ.600కోట్లకు సంబంధించిన పనులకు బిల్లులు తయారుచేయాల్సి ఉంది. పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు బంద్ చేశారు. దీంతోపాటు తాగునీటి సరఫరా, విద్యుత్ సర ఫరా, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీల ఏర్పాటుకు మరో రూ.400కోట్లు అవసరమని అధికారులు గుర్తించారు. ఇదిలా ఉండగా లబ్దిదారుల ఎంపిక జరగ్గకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన రూ.750కోట్లు పెండింగ్‌లో పెట్టారు.

అటకెక్కిన లబ్ధిదారులు ఎంపిక

గ్రేటర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం లబ్దిదారుల ఎంపిక అటకెక్కింది. నిబంధనల పేరుతో కాలయాపన చేస్తున్నారనే విమర్శలూ లేకపోలేదు. దరఖాస్తుదారుని చిరునామా (అడ్రస్ ప్రూఫ్) జీహెచ్ఎంసీ పరిధిలో ఉండాలి. రూరల్ హౌసింగ్, అర్బన్ హౌసింగ్, ఇందిరమ్మ, జేఎన్ఎన్‌యూఆర్ఎం, ఐహెచ్ఎస్‌డీపీ, వాంబే, రాజీవ్ గృహకల్ప, గతంలో ప్రభుత్వం అమలు చేసిన పక్కా ఇండ్ల పథకాల్లో లబ్దిదారులుగా ఉండకూడదు. జీవో 58, 59 లబ్దిదారులు సైతం అనర్హులు. ఈ వివరాలను తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్(టీఎస్‌టీఎస్) నుంచి తీసుకుని పరిశీలించి దరఖాస్తుదారుల్లో పైన పేర్కొన్నవారుంటే తిరస్కరించనున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)- హౌసింగ్ ఫర్ ఆల్ పథకం విధివిధానాలనూ లబ్దిదారుల ఎంపిక చేయడానికి పరిశీలించనున్నారు. పీఎంఏవై కింద గృహ రుణాల్లో సబ్సిడీ పొందిన వారు సైతం డబుల్ ఇండ్లకు అనర్హులు. గ్రేటర్ బయటి ప్రాంతాల్లో నిర్మించిన ఇండ్లలో 10 శాతం/1000 రెండింటిలో ఏది తక్కువగా ఉంటే అన్ని ఇండ్లను ఆ నియోజకవర్గంలోని స్థానికుల్లోని అర్హులకు కేటాయించనున్నారు. ఇల్లు లేని, గుడిసెలు, కచ్చా ఇండ్లు, అద్దె ఇండ్లల్లో నివసించే వారు డబుల్ ఇండ్లకు అర్హులు. గ్రేటర్‌లో మాత్రం జీహెచ్ఎంసీ యూనిట్‌గా ఆయా కేటగిరీలకు ఇండ్లు కేటాయించనున్నారు.

నేడు కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా

అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో గురువారం(నేడు) హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నాను నిర్వహించనున్నారు. ఈ మహాధర్నాను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

మహిళా భవన్ ఏర్పాటుకు కృషి

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-సరూర్‌నగర్

సరూర్ నగర్ డివిజన్‌లో తప్పకుండా మహిళా భవన్‌ను ఏర్పాటు చేసుకుందాం అని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. డాక్టర్స్ కాలనీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్స్ కాలనీ మహిళ మండలి సభ్యులు మంత్రిని కలసి కాలనీలో ఒక మహిళా భవన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్థలమున్న చోట తప్పకుండా మహిళా భవన్ ను ఏర్పాటు చేద్దామని, ఒక లెటర్ ఇవ్వండి అని చెప్పారు. పార్టీలకతీతంగా నియోజకవర్గాన్ని అభివద్ధి చేస్తున్నామన్నారు. సమస్య ఏదైనా తమ దష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రామ మూర్తి, ఉపాధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, మహిళ మండలి సభ్యులు మమత, సరిత, నిత్య, రమా రజని, సంధ్యా, వాణి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి

- ఎస్ఎఫ్ఐ ఉప్పల్ జోన్ కార్యదర్శి మణికంఠ
- ఉప్పల్ ఉన్నత పాఠశాలలో నిరసన



నవతెలంగాణ-ఉప్పల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి చూపించిందని ఎస్ఎఫ్ఐ ఉప్పల్ జోన్ కార్యదర్శి మణికంఠ అన్నారు. విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ ఉప్పల్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 45,03,097 లక్ష కోట్ల బడ్జెట్‌లో రూ. 1.12 లక్షల కోట్లు మాత్రమే విద్యారంగానికి కేటాయించారని.. గత సంవత్సర బడ్జెట్ కంటే ఈ సంవత్సరం 7.5 శాతాన్ని పెంచినప్పటికీ విద్యారంగానికి కనీసం ఒక శాతం కూడా మొత్తం బడ్జెట్ నుంచి కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం ప్రవేశపెట్టిన మొత్తం 2.90 లక్షల కోట్ల బడ్జెట్లో విద్యారంగానికి 19,000 కోట్లను మాత్రమే కేటాయించారన్నారు. గత సంవత్సరం కేటాయించిన మొత్తం బడ్జెట్ కంటే ఈ సంవత్సరం కేటాయించిన మొత్తం బడ్జెట్ 1.3 శాతం పెరిగినప్పటికీ విద్యారంగానికి మాత్రం పెరిగినటువంటి బడ్జెట్‌కు అనుగుణంగా నిధులను కేటాయించడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని హామీ చేశారు కానీ ఆ పథకాన్ని నెరవేర్చకుండా అడిగినప్పుడల్లా సాకులు చెప్తున్నారని అన్నారు. ఆరు నెలల కిందట మన ఊరు మనబడి, మనబస్తీ మనబడి కింద ప్రతీ మండలంలో శిధిలావస్థలో ఉన్నటువంటి పాఠశాలలను ఎంపిక చేసుకొని వాటిని మరమ్మత్తు కోసం నిధులను కేటాయించారన్నారు. కానీ ఆయ పాఠశాలలను మరమ్మతు చేస్తామని వాటిని ధ్వంసం చేశారని తెలిపారు. అనంతరం నిధులు విడుదల చేయక వాటిని అదే వ్యవస్థలో వదిలేశారని చెప్పారు. ఇప్పటివరకు నిధులను కేటాయించకుండా అలానే వదిలేశారని. అదేవిధంగా ఈ విద్య సంవత్సరంలో విద్యార్థులకు సక్రమంగా యూనిఫార్మ్ అందజేయలేదని, పాఠ్యపుస్తకాలను కూడా అందజేయలేదని తెలిపారు. మధ్యాహ్న భోజన వర్కర్లకు బిల్లులను ఇప్పటివరకు ప్రవేశపెట్టలేదని, దాదాపు 3 వేల కోట్ల కంటే పైన ఉన్నటువంటి పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ లను విడుదల చేయకుండా కేవలం 19000 కోట్ల నిధులను విద్యారంగానికి కేటాయించడం సరియైనటువంటి ఆలోచన కాదన్నారు. శివ, మహేష్, గణేష్, సాయి పాల్గొన్నారు

ఇండ్ల స్థలాల సాధన కోసం
మహాధర్నాను జయప్రదం చేయండి

- సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డీ కిషన్



నవతెలంగాణ-తుర్కయాంజల్

అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, మహిళా సంఘం, కేవీపీఎస్. ఇతర ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, ప్రజా సంఘాల పోరాట వేదిక తుర్కయంజాల్ మున్సిపల్ నాయకులు డి కిషన్ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం రాగన్నగూడలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రజాసంఘాల పోరాట వేదిక ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ తుర్కయంజాల్ మున్సిపల్ ప్రాంతంలో అనేకమంది పేదలు, కార్మికులు సొంత గృహాలు లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెం టనే అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, స్థానికంగా నిర్మించే రెండు పడకల గదులలో స్థానికులకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎమ్మార్వో ఆర్డీవో కార్యాలయాల్లో దరఖాస్తు పెట్టుకున్న అర్హులైన నిరుపేదలందరూ ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నాలో పాల్గొని సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తులసీగారి నరసింహ, మహిళా సంఘం నాయకులు కే శారద, కేవీపీఎస్ నాయకులు ఐ భాస్కర్, కె కుమార్, డీవైఎఫ్ఐ నాయకులు డి శ్రీధర్, కార్మిక సంఘం నాయకులు బి మాల్యాద్రి, మేతరి నవీన్ కుమార్, ఎన్.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగు..

నవతెలంగాణ-సంతోష్‌నగర్

యకుత్ నియోజకవర్గం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని హైదరాబాద్ సైనిక్ స్కూల్ ఎదురుగా రోడ్డుపై మురుగు పొంగిపొర్లతోంది. సుమారు 10 రోజులకుపైగా డ్రయినేజీ రోడ్డుపైనే మురుగు ప్రవహిస్తుండడంతో ఆ ప్రాంత మంతా దుర్గంధం వెదజల్లుతోంది. దాంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. డ్రయినేజీ సమస్యపై అధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వాహనాలకు నిబంధనల మేరకు నెంబర్ ప్లేట్‌లు వేయాలి

- డీసీపీ శ్రీనివాస్ గుప్తా



నవతెలంగాణ-హయత్‌నగర్

మోటారు వెహికిల్ నిబంధనల ప్రకారం వాహనదారులు వారి వాహనాల నెంబర్ ప్లేట్‌లను వేసుకోవాలని, స్టైలిష్‌గా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ ట్రాఫిక్ 2 డీసీపీ శ్రీనివాస్ గుప్తా అన్నారు. బుధవారం ఎల్బీ నగర్‌లోని ఆయన కార్యాలయంలో నెంబర్ ప్లేట్‌లు తయారు చేసే వారితో సమావేశం ఏర్పాటు చేశారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ తప్పని సరిగా వాహనదారుల ఆర్ సీ చూసి ప్రాపర్ గా మాత్రమే నెంబరింగ్ వేయాలన్నారు. స్టైలిష్‌గా పేర్లతో, వివిధ రకాల ఆకారాలతో నెంబర్‌లు వేస్తే సీజ్ చేస్తామన్నారు. ఆయన వెంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లు వెంకటేశ్వర్లు, మహేష్ గౌడ్ లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయండి

- రంగారెడ్డి డీసీసీ అధ్యక్షులు నర్సింహారెడ్డి



నవతెలంగాణ-మీర్ పేట్

ప్రజలు చాలా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆ సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు చల్లా కవిత బాల్ రెడ్డి, సిద్దాల మౌనిక శ్రీశైలం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్పోరేషన్‌లో ప్రజలు మంచినీరు, డ్రయినేజీ, వీధి దీపాలు, స్తంభాలు, రోడ్లు తదితరులు సమస్యలతో సతమతమవుతున్నరని తెలిపారు. రాష్ట్రంలో, మున్సిపల్‌లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, మంత్రి సబిత ఇంద్రారెడ్డి ప్రజా సమస్యలు పట్టించుకోకుండా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. కేవలం అభివృద్ధి పేరుతో చెరువుల చుట్టూ తిరుగుతూ ఆర్భాటాలు చేస్తున్నారు తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. నిబంధన ప్రకారం మూడు నెలల లోపు ఒక్కసారైనా పాలకవర్గ సమావేశం నిర్వహించాలి కానీ ఐదు నెలలు గడుస్తున్నా నిర్వహించకపోవడం దీనికి ప్రత్యేక నిదర్శనమని పేర్కొన్నారు. వెంటనే పాలకవర్గ సమావేశం నిర్వహించి ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మీర్ పేట్ అధ్యక్షుడు సామిడి గోపాల్ రెడ్డి, మాజీ వార్డు కీసర గోవర్ధన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఆలా శ్రీనివాస్ రెడ్డి, ఐతే భాస్కర్, శేఖర్‌రెడ్డి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



'పార్క్ స్థలాలను పరిరక్షించాలి'

నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో పార్కుల కబ్జాపై చర్యలు తీసుకోవాలని బుధవారం వాసుమాన్ యువసేన ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో పార్కులు కబ్జాలు జరుగుతున్నాయని పలు మార్లు మున్సిపల్ కమిషనర్‌కు పిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. ఇట్టి కబ్జాలను ప్రోత్సహిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకుని పార్కులను పరిరక్షించాలని కోరారు. కార్పొరేషన్ పరిధిలోని సాయి ఐశ్వర్య కాలనీ, సాయిప్రియా కాలనీ, విహారిక కాలనీ, కమలనగర్ కాలనీ, అయేధ్య నగర్ కాలనీ, సాయినగర్ కాలనీలలో నకిలీ దస్తావేజులు సృష్టించి కబ్జాలకు పాల్ప డ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కోట్లాది రూపాయల విలువగల పార్కులను కబ్జా చేసి దండుకుంటున్న కబ్జాకోరులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ యువసేన అధ్యక్షుడు పవన్ రెడ్డి, నాయకులు దయాకర్ రెడ్డి, కొగురి బాల్ రెడ్డి, అకుల కమలాకర్,రాజేందర్ రెడ్డి, మల్లారెడ్డి, రాధాకష్ణ, కిరణ్ కుమార్, బాస్కర్ నాయక్, సురేందర్ యాదవ్, బొట్టు పవన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్ పార్టీ నాయకుల రాజీనామా



నవతెలంగాణ-హయత్ నగర్

సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్, మంచిర్యాల, పెద్దపెల్లి జిల్లాల కార్యదర్శులు ఆర్ సంతోష్, జాడి దేవరాజ్ జీ, వైకుంఠం,రాష్ట్ర కమిటీ సభ్యురాలు టీ రమాదేవి, జిల్లా కమిటీ సభ్యులందరూ రెడ్ స్టార్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే తాము సీపీఐ (ఎంఎల్) రివల్యూషనరీ ఇనిషియేటివ్ చేరుతున్నట్టు తెలిపారు. బుధవారం ఎల్బీనగర్‌లోని మన్సూరాబాద్ లోని మారుతి రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ పార్టీ రాష్ట్ర కమిటీలో జరుగుతున్న పరిణామాలను కేంద్ర కమిటీ సక్రమంగా పట్టించుకోకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. 2022 ఆగస్టులో మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన రాష్ట్ర కమిటీ కార్యదర్శి సైదయ్యపై చర్యలు తీసుకోకుండా కేంద్ర కమిటీ తాత్సార వైఖరి అవలంభిస్తోందన్నారు. గతంలో కూడా అతను మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారంటూ అతనిపై పలు ఆరోపణలు వచ్చాయని అన్నారు. నైతికంగా దివాళా తీసిన నాయకత్వంలో పనిచేయడం తమకు అవమానం అన్నారు. అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం జరిగిన సమావేశంలో సభ్యులందరూ సీపీఐ (ఎంఎల్) రివల్యూషనరీ ఇనిషియేటివ్ పార్టీలో చేరాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ సమావేశంలో కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కమిటీ సభ్యులు అన్వర్ బింగి సుధాకర్ నవీన్ శ్రీనివాస్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారమే ప్రధాన లక్ష్యం : కార్పొరేటర్



నవతెలంగాణ-సంతోష్ నగర్

సైదాబాద్ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్య పరిష్కారమే ప్రధానమని కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని బస్తీలలో వారు పర్యటించారు. ఎస్బీహెచ్ జీఏ 1 కాలనీ వద్ద నూతనంగా వేసిన సీసీ రోడ్లను రాజ్ కుమార్, రామరాజు, నీరాజా, నవాజ్ స్థానిక నాయకులు, అధికారులు సిబ్బంది కార్యకర్తలు నాయకులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజల సమస్య తెలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేన్నారు. డివిజన్ ఆవరణలో జనాభా పెరుగుదల అనుసారంగా డ్రయినేజీ, మంచినీరు మురుగు, చెత్త చెదారం లాంటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కార్పొరేటర్ కోరారు ఈ కార్యక్రమంలో స్థానికులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తె, మెట్టెలు విరాళం

నవతెలంగాణ-నాగోల్

నవవధువులకు బుధవారం ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తె, మెట్టెలు విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉంటున్న సుప్రియ, తట్టి అన్నారం నివాసి వేదశ్రీ వివాహాల కోసం వారి తల్లిదండ్రులు సహాయ సహకారాలు అందించాలని ఉప్పల శ్రీనివాస్ గుప్తను ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. దాంతో ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐవీఎఫ్ తెలంగాణ అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్, ఉప్పల ఫౌండేషన్ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త మంగళ సూత్రం, మెట్టెలు, చీర, గాజులను వారికి విరాళంగా అందజేసి ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇద్దరు పెళ్లికూతుర్లు, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, నాగరాజు, సందీప్, సూర్య, తదితరులు ఉన్నారు.

టీఎన్జీవోస్ జిల్లా కార్యవర్గం అత్యవసర భేటీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు సేవారత్న డాక్టర్ సయ్యద్ మాజిదుల్ల (ముజీబ్) ఆధ్వర్యంలో బుధవారం నాంపల్లి గృహకల్పలో జిల్లా కార్యవర్గం, పలు యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పలు యూనిట్‌లోని సమస్యలతో పాటు కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఉద్యోగుల సమస్యలను తెలుసుకున్నారు. సంవత్స ర చందా ఇవ్వని యూనిట్లపై రివ్యూ చేశారు. అనంతరం 16న జరిగే రక్తదా న శిబిరం సంబంధించి సభ్యులకు ఆయ న క్లుప్తంగా వివరించారు. సీఎం కేసీఆర్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా హైదరాబాద్ జిల్లాలో తలపెట్టిన మెగా రక్తదాన శిబిరానికి ఉద్యోగులు, వారి బంధుమిత్రులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని డాక్టర్ ముజీబ్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.విక్రమ్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు కుద్రాడి శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం గోడపత్రిక ఆవిష్కరణ



నవతెలంగాణ-హయత్‌నగర్

తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మ గౌరవ సదస్సు వాల్ పోస్టర్‌ను బుధవారం ఎల్బీనగర్‌లో శ్రీకాంత్ చారి విగ్రహం వద్ద విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పట్టుల సురేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జెనిగె విష్ణువర్ధన్, తెలంగాణ ఉద్యమ కారుడు నేరుదం భాస్కర్ గౌడ్, పల్లె నరసింహ,సతీష్ యాదవ్, శ్యాంసుందర్ గౌడ్, ఈదుల పరశురాం, రెడ్డి మాల కష్ణ, సల్వా చారి, రామ్ లక్ష్మణ్, విజయలక్ష్మి, అబ్దుల్లాపూర్‌మెట్ మండల్ అధ్యక్షులు కూతాని సుధాకర్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి నామాలబాలకష్ణ, అనిల్, ఇతర ఉద్యమకారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో భారీగా ట్రాఫిక్ జామ్



హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్యాంక్‌బండ్‌పై ఈ నెల 11, 12 తేదీలలో జరగనున్న ఫార్ములా ఈ-రేస్ నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో ట్రాఫిక్ జామైనట్టు తెలుస్తోంది.

మంచినీటి పైప్ లైన్ ఏర్పాటు పనుల పరిశీలన



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్ పరిధిలోని కృష్ణానగర్ కాలనీలో రోడ్డు వేసే క్రమంలో ముందస్తు చర్యగా నూతన మంచినీటి పైప్ లైన్ ఏర్పాటు పనులను స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఏఈ వేణుగోపాల్, వర్క్ ఇన్స్‌పెక్టర్ చారి, కృష్ణానగర్ కాలనీ సంక్షేమ సంఘ నాయకులు మల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉల్లేం బాలరాజు, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ అధ్యక్షురాలు

నవతెలంగాణ-మల్కాజిగిరి

శక్తి మహిళా మండలి అధ్యక్షురాలు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తెలంగాణ స్టేట్ అధ్యక్షురాలు కె.అనురాధ రెడ్డి బుధవారం మల్కాజిగిరి ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ ప్రసాద్‌తో మాట్లాడారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యం గురించి, మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న ఆహార పదార్థాల విషయమై ఆరా తీశారు. ఈమె వెంట జ్యోతి బాయి తదితరులు ఉన్నారు.



మౌలాలిలో రాచకొండ సీపీ పర్యటన

నవతెలంగాణ-మల్కాజిగిరి

నేడు, రేపు మౌలాలిలో హజరత్ అలీ జన్మదినం పురస్కరించుకుని ఉర్సు ఉత్సవాలు మరియు ఇతర మతపరమైన కార్యక్రమాలు జరుగనున్న నేపథ్యంలో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ మౌలాలిలో పర్యటించి, పోలీసు అధికారులకు బందోబస్తుపై సూచనలు సలహాలు ఇచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, కుషాయిగూడ పోలీస్టేషన్ పరిధిలోని రాధికా చౌరస్తా, కుషాయిగూడ ఏరియాల్లో ట్రాఫిక్ జంక్షన్‌ను, ట్రాఫిక్ జామ్‌కి కారణమవుతున్న ఫుట్‌పాత్ ఆక్రమణలను దగ్గరుండి పరిశీలించారు. సిగ్నల్స్ వద్ద ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల పాదచారులు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గమనించారు. ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ అధికారుల కో-ఆర్డినేషన్‌తో రాధిక, ఈసీఐఎల్ జంక్షన్‌లను త్వరలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ అభిషేక్ మహంతి, డీసీపీ మల్కాజిగిరి జానకి ధరావత్, కుషాయిగూడ ఏసీపీ, ట్రాఫిక్ ఏసీపీ, కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్, కుషాయిగూడ ఇన్స్‌పెక్టర్ తదితరులు సీపీ వెంట ఉన్నారు.



మల్కాజిగిరి పోలీసు స్టేషన్ సందర్శించిన సీపీ

మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌ను రాచకొండ పోలీస్ కమిషనర్ డి.ఎస్.చౌహాన్ సందర్శించారు. అనంతరం స్టేషన్ సిబ్బంది పనితీరు పరిశీలించారు. సీపీ వెంట మల్కాజిగిరి డీసీపీ జానకి ధరావత్, మల్కాజిగిరి ఏసీపీ నరేష్ రెడ్డి, మల్కాజిగిరి ఇన్స్‌పెక్టర్ జగదీష్, సీపీ వెంట ట్రాఫిక్ డీసీపీ అభిషేక్ మహంతి, మల్కాజిగిరి డీసీపీ జానకి, ఏసీపీ మల్కాజిగిరి నరేష్ రెడ్డి, మల్కాజ్ గిరి ఇన్స్‌పెక్టర్ జగదీష్ ఉన్నారు.

జనావాసాల మధ్య ఉన్న గోదాములను తరలిస్తాం

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

జనావాసాల మధ్య ఉన్న గోదాములను తరలించడం ద్వారా భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోనున్నట్లు రాష్ట్ర పశుసంవర్థక, మత్స్య, పాడిపరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మినిస్టర్ రోడ్‌లో అగ్నిప్రమాదం జరిగిన డెక్కన్ మాల్ భవనంను కూల్చివేయగా, మంత్రి వివిధ శాఖల అధికారులతో సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీలో పర్యటించి ఈ ప్రమాదంతో జరిగిన నష్టం గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అగ్నిప్రమాదం వలన తమ ఇండ్లపై ఉన్న సింటెక్స్ ట్యాంక్‌లు కాలిపోయాయని, గోడలు నెర్రెలు వచ్చాయని, తదితర విషయాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మంత్రి ఇచ్చిన హామీ మేరకు మరమ్మతులు ప్రభుత్వపరంగా చేపడతామని, ట్యాంక్‌లను కూడా కొత్తవి కొనుగోలు చేసి ఇస్తామని కాలనీవాసులకు చెప్పారు. కాలనీలో పడిపోయిన భవన వ్యర్థాలను పూర్తి స్థాయిలో తొలగించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీవరేజ్ లైన్ దెబ్బతిన్నదని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకు రాగా, పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలనీలో నూతన రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. భవనం పూర్తి స్థాయిలో కూల్చివేత పనులు మరో రెండు రోజుల్లో పూర్తవుతాయని చెప్పారు. ప్రమాదం జరిగిన నాటి నుండి తమకు ఏ ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్న మంత్రికి కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిసర ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా నూతన పరిజ్ఞానంతో భవనం కూల్చివేత చేపట్టినట్లు వివరించారు.



భవనం కూల్చివేత కోసం 41లక్షల రూపాయలను ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు సకాలంలో స్పందించి స్థానిక ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించి వసతి కల్పించి నాటి నుండి నేటి వరకు భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాలనీలో హెల్త్ క్యాంప్‌ను కూడా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమా దాలు తిరిగి జరగకుండా తీసుకో వాల్సిన చర్యలపై ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జనావాసాల మధ్య ఉన్న గోదాములను ఇతర ప్రాంతాలకు తరలిస్తామని స్పష్టం చేశారు. గోదాముల నిర్వహకులు సరైన జాగ్రత్తలు పాటించని కారణంగానే ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయని అన్నారు. మంత్రి వెంట మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణగౌడ్, ఆర్‌డీఓ వసంత, డీసీ ముకుందరెడ్డి, తహసీల్దార్ శైలజ, ఈఈ సుదర్శన్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ క్రిస్టోఫర్, శానిటేషన్ డీఈ శ్రీనివాస్ ఉన్నారు.

మానవత్వం చాటుకున్న కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ ఇందిరా గృహకల్ప కాలనీకి చెందిన ప్రకాశ్ (48) మంగళవారం బీఎన్ రెడ్డి నగర్ దగ్గర ప్రమాదవశాత్తు ఆటోలోని నైట్రోజన్ గ్యాస్ సిలిండర్ పేలి మరణించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కు లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సంఘటనా స్థలానికి వెళ్లి అనంతరం గ్యాస్ ఏజెన్సీ శైలజ, డిస్ట్రిబ్యూటర్ రవి కుమార్‌తో మాట్లాడి ఆ కుటుంబానికి 8 లక్షల ఆర్థిక సహాయం అందజేసేలా కృషి చేశారు. అదేవిధంగా ప్రకాష్ పనిచేసే కంపెనీ యజమాని రవి నుంచి మృతుని భార్యకు ఉద్యోగం, ఇద్దరు పిల్లల చదువుకు అయ్యే ఖర్చును భరించాలని తెలియజేసి, దానికి తగ్గట్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్‌ఏ చైర్మెన్ రోషిరెడ్డి, ప్రెసిడెంట్ వెంకట్‌రెడ్డి, కుషాయిగూడ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై సాయి కుమార్, మృతుని కుటుంబ సభ్యులు నత్త సుధాకర్, నత్త రవి నత్త మురళి, మొటూరి ప్రకాష్, భార్య అరుణ జ్యోతి, కొడుకులు కార్తీక్, కీర్తన్, ఇందిరా గృహకల్ప కాలనీవాసులు, చర్లపల్లి డివిజన్ నాయకులు ధనుంజయ్ గౌడ్, వెంకట్ రెడ్డి, నజీర్, రెహ్మాన్, సుభాష్, సుబ్బయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

ఐలా చైర్మెన్ రోషిరెడ్డి

నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న కంటి వెలుగు పథకాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని చర్లపల్లి ఐలా చైర్మెన్ జెక్క రోషిరెడ్డి కోరారు. శుక్రవారం 10వ తేది నుంచి చర్లపల్లి పారిశ్రామికవాడలోని సీఐఏ ఆడిటోరియంలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. చర్లపల్లి ఐలా, టీఐఏసీ సీఐఏ, సీఐటియు కార్మిక సంఘం సంయుక్తంగా నిర్వహించే కంటివెలుగు కేంద్రం ఈనెల 10వ తేది నుంచి 14వ తేది వరకు ఉంటుందని కార్మికులు పరిశ్రమల యాజమానులు సద్వినియోగం చేసుకోవాలని సుచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు కంటి సమస్యతో బాధపడకుండ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేకంగా కంటి వెలుగు పథకాన్ని ప్రారంభించారని అన్నారు. కంటికి సంభదించిన అన్ని పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు పంపిణి చేస్తారని తెలిపారు. కంటి పరీక్ష కోసం వచ్చే వారు తప్పనిసరిగా వారితో పాటు ఆదార్ కార్డు తీసుకుని రావాలని సూచించారు.



జై జవాన్ కాలనీ రీడింగ్ రూమ్ నందు కంటి వెలుగు ప్రోగ్రాం కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు , కాలనీ అసోసియేషన్ లీడర్లు పాల్గొన్నారు. -నవతెలంగాణ, కాప్రా

పాఠశాలల యాజమాన్యాల సంఘం డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం మేడ్చల్ జిల్లా నూతన డైరీని జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ఆవిష్కరించారు. బుధవారం షామీర్‌పేట్‌లోని సమీకృత కలెక్టరేట్లోని డీఈవో కార్యాలయంలో డైరీని విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈఓ విజయకుమారి మాట్లాడుతూ నూతన సంవత్సర డైరీలో విద్యార్థులకు మంచి జరిగే విధంగా ఉండాలని ఆకాంక్షించారు. ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సలహాదారులు సత్యారెడ్డి, కృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, హనుమంత రెడ్డి, సహాయం కార్యదర్శి గడ్డమీద బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భాస్కర్ రాజు, బాకర్, శ్రీనాథ్‌రావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



బెలూన్ పేలి నలుగురికి గాయాలు



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన హీలియం బెలూన్ గత నెల రోజుల క్రితం ఏర్పాటు చేయగా, క్రమంగా బెలూన్ వాతావరణం కారణంగా కిందికి రావటంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది , ఈ క్రమంలో పశువుల కాపరి రాజు ఓ వెంచర్‌లో పని చేసే నిరంజన్, అంజిరెడ్డి, సుధాకర్ గౌడ్‌లు నలుగురి మంటల్లో చిక్కుకున్నారు. ఈ పేలుడుకు నలుగురికి యాభై శాతం శరీరం కాలింది. గుట్టుచప్పుడు కాకుండా సంస్థ నిర్వాహకులు ప్రమాదానికి గురైన నలుగురిని హాస్పిటల్‌లో అడ్మిట్ చేసి చికిత్స అందిస్తున్నారు.

ఎమ్మెల్యే హన్మంతరావు సహకారంతో అభివృద్ధి

కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి సహకారంతో నేరేడ్‌మెట్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆమె డివిజన్ పరిధిలోని భగత్ సింగ్‌నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నీటి సమస్య, డ్రైనేజీ సమస్య, కరెంట్‌పోల్ సమస్యలు పరిష్కారం చేసినందుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి నిరంతరం తాను అన్ని బస్తీలలో, కాలనీలలో పర్యటించి ఎమ్మెల్యే హన్మంతరావు సహకారంతో తగు సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇంకా కాలనీలో మీకు ఏమైనా సమస్యలుంటే చెబితే పరిష్కారం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, నవనీత, రమేష్, కిషోర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర స్వామి ఆలయం హుండీ లెక్కింపు



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి సర్కిల్ ఆనంద్‌బాగ్‌లోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామికి భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను బుధవారం ఎండోమెంట్ పర్యవేక్షణ అధికారి కే.వెంకన్న సమక్షంలో లెక్కించగా 40 రోజులకు గాను 3,97,078 (మూడు లక్షల తొంభై ఏడు వేల డెభై ఎనిమిది రూపాయలు) ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.బి.రవీంద్రరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ముడుంబై వెంకటరమణాచార్యులు, అర్చకులు తులసి వెంకటరమణాచార్యులు, క్లర్క్ సంద్ర సుధాకర్, ఆలయ మాజీ చైర్మెన్‌లు ఉమేష్ సింగ్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, మాజీ ధర్మకర్తలు ఎం.రవీందర్, పి.గణేష్, ఆలాపన, భక్తులు మీనాక్షి, జయశ్రీ, సుధారాణి, రేణుక, గిరీష్, రత్న మాణిక్యం, శివరామకృష్ణ, సుబ్రహ్మణ్యం, రత్నమాల, లలిత, శాంత కుమారి, కెవిఎస్ ప్రసాద్, కే పద్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ మేలు చేస్తుంది

నవతెలంగాణ-ఓయూ



అనారోగ్యం బారిన పడి వైద్యం చేయించుకోలేని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు చేస్తుందని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత అన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు నేనున్నానని భరోసా కల్పిస్తూ వారికి వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేస్తూ వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ కార్యాలయంలో రూ.1,16,000 సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితుడు టిపరమేశ్వర, కృష్ణారెడ్డికి బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డితో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంజి, బాబు పాల్గొన్నారు.

అష్ట దిగ్బంధంలో పరిపాలనా భవన్

నవతెలంగాణ-ఓయూ



ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిపాలనా భవన్ గతంలో ఎన్నడూ లేనంతగా అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. మొదట పరిపాలన భవన్‌లో రెండు గేట్లు, దగ్గరకు జరపటం అక్కడే ఇరువై పులా ఓయూ సెక్యూరిటీ గార్డ్ నిత్యం పహారా ఉంచడంతో పాటు వారం రోజులు ఇక బయట రెండు ప్రధాన ద్వారాలను ఒక గేట్‌ను మూసేని మరో గేట్ ద్వారా ఐడీ కార్డ్స్ ఉన్నవారినే లోపలికి అనుమతిస్తున్నారు. ఇంకొక వైపు బుధవారం ప్రత్యేకంగా ఐరన్ ఫెన్సింగ్‌తో ముళ్ల కంచెలను ఏర్పాటు చేశారు. పరిపాలనా భవన్‌లో అధికారులది ఏ చిన్న సమావేశం ఉన్నా ఓయూ సెక్యూరిటీతో పాటు, పోలీసులు కూడా భారీగా మెహరిస్తున్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం ఓయూకు వచ్చే వారు, ఓయూ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గౌరవ వేతనం మాకొద్దు.. ప్రభుత్వ వేతనం కావాలి

- శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులు
- మధ్యాహ్న భోజన పథకం కార్మికుల డిమాండ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



శ్రమ దోపిడీకి గురై చాలా మంది పిల్లలకు పాఠశాలల్లో భోజనం పెడుతున్నామననీ, మా స్వంత ఇండ్లల్లో ఆహారం అందించలేని దయనీయ స్థితిలో బతుకులు వెళ్లదీస్తున్నామనీ, గౌరవ వేతనాలు మాకొద్దు.. ప్రభుత్వ వేతనాలు కావాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు డిమాండ్ చేశారు. పాఠశాలలలో వంట తయారీ, శుభ్రపరచడానికి రోజుకు సుమారు 8 గంటలు పని చేస్తున్నామనీ, అయినా ప్రభుత్వం తమను కార్మికులుగా గుర్తించడం లేదనీ, కనీస వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం, సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) వందలాది మంది కార్మికులతో భారీ ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్, అధ్యక్షులు మహమ్మద్ యూసఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డి.కమలారెడ్డి, అధ్యక్షురాలు పి.ప్రేంపావని, ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేష్ పాల్గొని మాట్లాడారు. పోలీసులు కనీసం ధర్నా చౌక్‌లో ధర్నా చేయడానికి అవకాశం ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి నిరంకుశ వైఖరి అవలంభిస్తే భవిష్యత్తులో కార్మికుల శక్తి చూపించాల్సి వస్తుందని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలలలో వంట కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. గౌరవ వేతనం నెలకు రూ.వెయ్యి నుంచి రూ.2వేలు పెంచారనీ, ఆ తర్వాత రూ.3వేలు పెంచినట్టు తెలిపారు. ఇది ఏమైనా వేతనమేనా అని ప్రశ్నించారు. కనీసం రోజుకు రూ.300 అయినా చెల్లించాలనీ, మొత్తం 12 నెలలకు అందించాలని కోరారు. ప్రస్తుతం విద్యార్థులకు అందిస్తున్న మెస్ ఛార్జీలు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థికి రూ.5.45, అప్పర్ ప్రైమరీ విద్యార్థులకు రూ.8.17, 9-10వ తరగతి విద్యార్థులకు రూ.10,67 గుడ్డుతో కలిపి అందిస్తున్నారనీ, అవి మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలకు ఏమాత్రం సరిపోవడం లేనందున మెస్ ఛార్జీలు తరగతితో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికీ రూ.25 అందించాలని డిమాండ్ చేశారు. గ్యాస్ సిలిండర్లు, కోడిగుడ్ల ధరలు విపరీతంగా పెరిగినందున వాటిని ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, యూనిఫామ్ సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు రాష్ట్రంలో దశల వారీగా ఉద్యమాలు నిర్వహిస్తామనీ, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం మధ్యాహ్న భోజన పథకం కార్మికులు హిమాయత్ నగర్ నుంచి అసెంబ్లీ వైపు దూసుకువెళ్లడానికి ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకోవడంతో వారికీ పోలీసులకు మధ్య కొంత సేపు తోపులాట జరిగింది. ఈ ధర్నాలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వలి ఉల్లాహ్ ఖాద్రి, శ్రామిక మహిళా ఫోరమ్ నాయకురాలు సీహెచ్.సీతామహాలక్ష్మి, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, కోశాధికారి ఆది రంగారెడ్డి, ఉపాధ్యక్షులు కొరిమి సుగుణ, కుంటాల రాములు, చెన్నవేన ధశరథం, దండు లక్ష్మణ్, కార్యదర్శులు భంటు రాజేశ్వరి, భోయిని ప్రసాద్, ధర్మల రామ్మూర్తి, బొజ్జ సాయిలు పాల్గొన్నారు.

సిటీ కాలేజీకి నిధులు కేటాయించడం పట్ల హర్షం



నవతెలంగాణ-ధూల్‌పేట్

సిటీ కళాశాల విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిన సీఎం కేసీఆర్ కేసీఆర్ కృషి పట్ల కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. శతాబ్ది వేడుకలు జరుపుకుంటున్న సిటీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రస్తుత భవనానికి మరమ్మత్తులకు రాష్ట్ర ప్రభుత్వం మొన్న అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో సిటీ కళాశాలకు రూ.10 కోట్లు కేటాయించినందుకుగాను సీఎంకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్, బృందం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఏడాది కాలంగా కళాశాలలో శతాబ్ది వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు విద్యాసంస్థ పునరుద్ధరణకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందనీ, అందుకోసం అవసరమైన ప్రణాళికను ప్రిన్సిపాల్, అధ్యాపకవర్గం తయారుచేయాలని సూచించినట్టు తెలిపారు. వెంటనే కళాశాల ప్రిన్సిపాల్ సంబంధిత శాఖల సహకారంతో అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయించామని గుర్తు చేశారు. అదే క్రమంలో కళాశాలకు బడ్జెట్ కేటాయించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మకమైన సిటీ కళాశాల తొలి, మలి దశల తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువుగా ఉందన్నారు. ఈ స్ఫూర్తి పట్ల గౌరవంతో తొలిసారిగా ఒక కాలేజీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు ప్రత్యేకంగా మంజూరు చేయటం సంతోషదాయకమన్నారు.

బాణసంచా పేల్చి విద్యార్థుల సంబురాలు..

ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చి తమ సంతోషాన్ని తెలియజేశారు. ప్రభుత్వం అందించిన ఈ ప్రోత్సాహంతో, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సహకారంతో కళాశాలను మరింత అభివృద్ధి చేస్తామనీ, మరో వందేండ్లు వేలాదిమంది విద్యార్థులకు విద్యనందించటానికి అనుగుణంగా కళాశాలను తీర్చిదిద్దుతామని ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యార్థులకు మెట్రో రైల్ పాస్‌లో రాయితీ ఇవ్వాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



హైదరాబాద్‌లోని మెట్రో రైలు ప్రయాణానికి విద్యార్థులకు రాయితీతో కూడిన మెట్రో పాస్‌లను జారీ చేయాలని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీమాన్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) నిజాం కళాశాలలో, మెట్రో స్టేషన్ దగ్గర సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీమాను నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు మెట్రో రైలులో రాయితీ పాస్‌లను జారీ చేయడం వల్ల పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థుల చదువులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సామాజిక బాధ్యతగా విద్యార్థులకు రాయితీ పాస్ ఇవ్వాలని మెట్రో సంస్థను కోరారు. ఆర్టీసీ బస్సు పాస్‌ల కారణంగా పేద విద్యార్థులకు చాలా మేలు జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీమాను నాయక్, ఎస్ఎఫ్ఐ నాయకులు కౌశిక్, వినయ్, కృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డుకు పాలకమండలిని నియమించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు
- లేబర్ కమిషన్ ఆఫీస్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-అడిక్‌మెట్

2020 నుంచి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పాలకమండలిని రాష్ట్ర ప్రభుత్వం నియామకం చేయడం లేదనీ, మూడేండ్లుగా అనేక కేసులు పరిహారం కోసం పెండింగ్‌లో ఉన్నాయనీ, తక్షణమే క్లయిములను పరిష్కరించి నిధులు విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో లేబర్ కమిషన్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించి కమిషనర్‌కు మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ గతేడాది లక్ష మంది భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిల్స్‌ను ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందనీ, ఏడాది అవుతున్నప్పటికీ ఇప్పటి వరకు అమలు చేయడం లేదన్నారు. ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రసూతికి రూ 50 వేలు, వద్ధాప్య పింఛన్ రూ.5 వేలు ఇవ్వాలనీ, పట్టణాల్లో కార్మికుల అడ్డాల వద్ద టాయిలెట్లు, మంచి నీటి వసతి కల్పించాలనీ, ఆరోజు పని దొరకని వారికి రూ.5 ల భోజన వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల అడ్డాల వద్ద, బస్తీల్లో ఈ శ్రమ కార్డులను నమోదు చేయాలని తదితర డిమాండ్లతో జాయింట్ లేబర్ కమిషనర్ చంద్రశేఖర్‌కు మెమొరాండం అందజేశారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, రాష్ట్ర సంఘం గౌరవ అధ్యక్షులు ఉజ్జిని రత్నాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రవీణ్‌కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లేష్, రాష్ట్ర కోశాధికారి జి. పరమేశ్వర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.నాగప్ప, వి.హరినాథరావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దాసరి ప్రసాద్,, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



పరిశుభ్రతపై దృష్టి సారించాలి : కార్పొరేటర్

నవతెలంగాణ-అంబర్‌పేట

పరిశుభ్రతపై జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం గోల్నాక డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో కార్పొరేటర్‌పాదయాత్ర నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. డివిజన్‌లోని రోడ్లు పరిశుభ్రంగా ఉండాలన్నారు. బస్తీలు, కాలనీలు క్లీన్‌గా ఉంచాలని జీహెచ్ఎంసీ ఎస్.ఎస్ తిరుపతి, ఎస్.ఎఫ్.ఎ.లకు సూచించారు. పాదయాత్రలో కొన్ని సమస్యలు డ్రయినేజీ, మంచినీరు, క్లీన్ అండ్ గ్రీన్ తదితర సమస్యలు తమ దృష్టికి వచ్చినట్టు తెలిపారు. సమస్యలను పైన అధికారులకు తెలియజేశామనీ, డివిజన్‌లోని ఏమైనా సమస్యలు ఉంటే ప్రతి బస్తీ కాలనీ అధ్యక్షులు, తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

'పది' విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలి

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్
- విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు పంపిణీ



నవతెలంగాణ-అడిక్‌మెట్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివే విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆకాంక్షించారు. బుధవారం అడిక్‌మెట్ డివిజన్‌లోని జమిస్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో నాయకులు జహంగీర్, లింగం యాదవ్ సహకారంతో పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు చదువులతోపాటు ఆటపాటల్లో ముందంజలో ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పిస్తూ విద్యార్థులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జై సింహ, స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సురేందర్, సీతారామాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ రవి యాదవ్, బొట్టు శీను, కిషోర్, ఆకారం శ్రీనివాస్, అబ్బు బాయ్, నాగులు, శంకర్ ముదిరాజ్, హరీష్, స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధికి మరింత కృషి

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ-అడిక్‌మెట్



ముషీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి మరింత కృషి చేస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడ డివిజన్‌లోని భాగ్యలక్ష్మి నగర్‌లో రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ రచన శ్రీతో కలిసి ప్రారంభించారు. అనంతరం అడిక్ మెట్ డివిజన్‌లో రూ.7.50 లక్షలతో చేపట్టిన సివరేజ్ పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జసింహ, కవాడిగూడ డివిజన్ ప్రెసిడెంట్ వల్లాల శ్యామ్ యాదవ్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులు సురేందర్, సాయికృష్ణ, రవి యాదవ్, ఆకారం శ్రీనివాస్, మనోహర్, రాజశేఖర్ గౌడ్, కరిక కిరణ్, శ్రీహరి, ప్రభాకర్, వల్లాల రవి యాదవ్, దుర్గా స్వామి, ప్రవీణ్, విక్కీ, సందీప్ రూప, కార్తీక్, మంజు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ రంగంలో ఉజ్జీవన్ మొబైల్ యాప్

నవతెలంగాణ - హైదరాబాద్

బ్యాంకింగ్ రంగంలో మొదటిసారిగా చదవడం, రాయడంలో తక్కువ కౌశల్యం ఉన్న వారి కోసం అందుబాటులోకి తీసుకు వచ్చిన మొబైల్ బ్యాంకింగ్ యాప్ ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్. భారతదేశంలో మొదటి వాయిస్, విజువల్ వర్నాక్యులర్-3విలను కలిగిన మొబైల్ బ్యాంకింగ్ యాప్‌ను విడుదల చేయగా, చదవడం, రాయడంలో తక్కువ కౌశల్యం ఉన్న వ్యక్తులకు బ్యాంకింగ్ సేవలు తేలికగా పొందేలా దీన్ని రూపొందించారు. ఈ యాప్‌ను డిజిటల్ సవాళ్లను ఎదుర్కొనే మైక్రో బ్యాంకింగ్ మరియు గ్రామీణ వినియోగదారులలో బ్యాంకింగ్ అలవాట్లను తీసుకువచ్చేలా డిజైన్ చేశారు. ఉజ్జీవన్‌ను హిందీ, మరాఠి, బెంగాలి, తమిళం, గుజరాతీ, కన్నడ, ఒరియా మరియు అస్సామీలతో కూడిన ఎనిమిది ప్రాంతీయ భాషలలో ధ్వని ఆధారంగా వినియోగించవచ్చు. వినియోగదారులు బ్యాంకింగ్ లావాదేవీలను నిర్వహించేందుకు వారి సొంత భాషలో మాట్లాడవచ్చు మరియు రుణాలకు సంబంధించి ఈఎంఐల చెల్లింపు, ఎఫ్‌డీ మరియు ఆర్‌డీ ఖాతాలను తెరవడం, నగదు బదిలీ, ఖాతాలో నగదు నిల్వ పరీక్షించుకోవడం మరియు పాస్‌బుక్ అప్‌డేట తదితర పనులు చేసుకోవచ్చు.

మూడు రోజుల జాతీయ సెమినార్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఓయూ



ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ స్వర్ణోత్స వేడుకల్లో భాగంగా మూడు రోజుల జాతీయ సెమినార్ పోస్టర్‌ను ఓయూ వీసీ, రిజిస్ట్రార్ ఆవిష్కరించారు. దేశంలో సాంఘిక శాస్త్ర పరిశోధనలను ప్రోత్సహించేందుకు 1969లో ఐసీఎస్ఎస్ఆర్‌ను నెలకొల్పారు. దీనికి అనుబంధంగా దేశంలో ఆరు ప్రాంతీయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దక్షిణ భారతదేశంలోని కార్యక్రమాల నిర్వహణకు ఉస్మానియా యూనివర్సిటీలో 1973 ఫిబ్రవరి 1న ఎస్ఆర్‌సీ (సదరన్ రీజనల్ సెంటర్)ను నెలకొల్పారు. పూర్వపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉస్మానియా యూనివర్సిటీ సహకారంతో దీన్ని ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలతో పాటు లక్షద్వీప్, పాండిచ్చేరి కేంద్రపాలిత ప్రాంతాలకు దీని అధికార పరిధి విస్తరించింది. స్వర్ణోత్స వేడుకల్లో భాగంగా "పబ్లిక్ పాలసీస్, డెవలప్ మెంట్ అండ్ ఎంపవర్మెంట్ ఆఫ్ సోషల్ గ్రూప్ ఇన్ ఇండియా: లెసన్స్ ఫ్రమ్ తెలంగాణ స్టేట్" అనే అంశంపై మూడు రోజుల జాతీయ సెమినార్‌ను జూన్‌లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ డైరెక్టర్, సదస్సు కన్వీనర్ ప్రొ. బి. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సును జూన్ 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించనున్నట్టు తెలిపారు. సదస్సులో తమ పరిశోధనా పత్రాలను సమర్పించాలనుకునేవారు పరిశోధనా పత్రం, అబ్‌స్ట్రాక్ట్‌ను మార్చి 10వ తేదీలోగా తమకు చేరేలా పంపాలని సూచించారు. పూర్తి పరిశోధనా పత్రాన్ని మే 15వ తేదీలోగా పంపించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9154208655, 7382074090 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ. రవీందర్, రిజిస్టర్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, సదస్సు కో-కన్వీనర్ డాక్టర్ జాకబ్ పాల్గొన్నారు.

పకోడా పార్టీ నిర్వహించిన ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్, పకోడా పార్టీని సలార్‌పురియా సత్వా నాలెడ్జ్ సిటీ వద్ద నిర్వహించింది. ఈ కార్యక్రమం ద్వారా నాలెడ్జ్ సిటీ వద్ద పని చేస్తున్న ఉద్యోగులు, ఫ్రీడమ్ ఆయిల్ స్టాల్‌ను సందర్శించేలా ప్రోత్సహించడంతో పాటు, ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్‌లో వండిన రుచికరమైన స్నాక్స్‌ను ఆస్వాదించేలా చేయడం లక్ష్యంగా చేసుకున్నారు. ఆర్‌జె, ఐటీ ఉద్యోగులతో అనుసంధానం కావడంతో పాటు రైస్ బ్రాన్ ఆయిల్ ఆరోగ్య ప్రయోజనాలు గురించిన సమాచారం వెల్లడించడం, వారిని కొన్ని ప్రశ్నలు అడగడం, ఫ్రీడమ్ గుడీ బ్యాగ్‌తో విజేతలకు బహుమతులను అందించడం చేశారు. రైస్ బ్రాన్ ఆయిల్ ప్రయోజనాల గురించిన సమాచారం వెల్లడించడంతో పాటు ఫ్రీడమ్ పకోడా పార్టీ త్వరలో అంటే ఈ నెల 12వ తేదీన గచ్చిబౌలి స్టేడియం వద్ద నిర్వహించనున్న రన్ ఫర్ ఏ గాళ్ చైల్డ్ పట్ల అవగాహన కూడా కల్పించింది. రన్ ఫర్ ఏ గాళ్ చైల్డ్‌కు తోడ్పాటు అందించడంతోపాటు ఈ రన్‌లో పాల్గొనడం ద్వారా నాణ్యమైన విద్య, చక్కటి ఆరోగ్యం, తగినన్ని నైపుణ్యాలు, అన్నిటికంటే ముఖ్యంగా ఆత్మవిశ్వాసం తోడ్పడుతూ, నిరుపేద వర్గాలకు చెందిన బాలికలకు తగిన సాధికారితను అందించే ప్రయత్నం చేస్తూనే, వారు తమ జీవితాలను పూర్తిగా ఆస్వాదించేలా సహాయపడాల్సింది గా ప్రోత్సహిస్తున్నారు. ఈ సందర్భంగా ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్ సేల్స్ అండ్ మార్కెటింగ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ ఈ పకోడా పార్టీని ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్‌లో వండిన స్నాక్స్ రుచి చూసే అవకాశం కూడా కల్పించాం అన్నారు. ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్ అతి తక్కువ నూనె, జిగురు కలిగి ఉంటుంది. ఫ్రీడమ్ కు మారండి, ఆరోగ్యంగా తినండి, ఆరోగ్యంగా జీవించండి అని వెల్లడిస్తుంది. అంతేకాదు, మేం రన్ ఫర్ ఏ గాళ్ చైల్డ్‌లో పాల్గొనేందుకు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ప్రోత్సహిస్తున్నాం అన్నారు.

భారతదేశంలో పోకో ఎక్స్ ప్రో 5జి విడుదల

నవతెలంగాణ - హైదరాబాద్

భారతదేశంలో అగ్రగామి వినియోగదారుల సాంకేతిక బ్రాండ్లలో ఒకటైన పోకో తన తదుపరి ఎక్స్-సిరీస్ విడుదలను ప్రకటించింది. పోకో ఎక్స్5 ప్రో 5జి పరిశ్రమలో పలు మొట్టమొదటి ప్రత్యేకతలతో సిద్ధమైంది. దీని విడుదల గురించి పోకో ఇండియా కంట్రీ హెడఖ్ హిమాన్షు టాండన్ మాట్లాడుతూ... పోకో ఎక్స్-సిరీస్లోని స్మార్ట్ఫోన్లు మార్కెట్లో ప్రతిసారీ ఉత్తమ సాధనను చూపించాయన్నారు. అత్యంత అస్తవ్యస్తమైన వలయంలో కేంద్ర బిందువుగా మారడంలో విజయవంతమయ్యాయన్నారు. పోకో ఎక్స్-సిరీస్ యథాస్థితికి సవాలు విసిరే, ఒక దశ ఎత్తుకు తోడ్కొనివెళ్లే తమ బ్రాండ్ గుర్తును ప్రతిబింబిస్తుందన్నారు. తాము 2021లో స్నాప్ డ్రాగన్ 860 ప్రాసెసర్తో కూడిన స్మార్ట్ఫోన్ను 20కె కన్నా తక్కువ ధరలో తీసుకు రావడాన్ని సవాలుగా తీసుకున్నామన్నారు. అయితే పోకో తన పోకో ఎక్స్ ప్రో ద్వారా దాన్ని అధిగమించామన్నారు. అనంతరం పోకో ఎక్స్4 ప్రో 5జి అపారమైన అప్గ్రేడ్లను తీసుకు వచ్చిందన్నారు. ఈ పరంపరను ముందుకు తోడ్కొని వెళ్లే దిశలో పోకో ఎక్స్ ప్రో 5 అత్యుత్తమ నాణ్యతతో కూడిన మనోరంజన, పనితీరులో ఉన్నత కొలమానాలను కలిగి ఉండడమే కాకుండా ఫ్లాగ్ షిప్ భావనను కలిగి ఉందన్నారు.

బడ్జెట్‌లో కార్మిక రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్



నవతెలంగాణ-అడిక్‌మెట్

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో కార్మిక వర్గానికి మొండి చేయి చూపిందనీ, కార్మిక వర్గంను మరింత దుర్భరంలోకి నెట్టిందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ అన్నారు. (విద్యానగర్)లో మార్క్స్ భవన్‌లో తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆ సంఘం అధ్యక్షులు నాగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలోజనార్దన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వారి శ్రమకు ఎలాంటి గుర్తింపు లేకుండా నిరాకరిస్తున్నారన్నారు. గతంలో భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్ళు ఇస్తామని చెప్పి నేటి బడ్జెట్‌లో దాని ఊసే లేదన్నారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల ప్రాణాలు కోల్పతున్నా వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోందనీ, వారి కుటుంబాలు రోడ్ల పాలవుతున్నారు ఆవేదన వ్యక్తంచేశారు. కనీస ప్రమాద బీమాను రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు, సాధారణ మరణానికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షలకు, పెండింగ్‌లో వేలాది క్లయింలు ఉన్నాయనీ, వెంటనే వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. 50 ఏండ్లపై పై బడిన కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. సంక్షేమ బోర్డులో సంక్షేమ పథకాలను మెరుగుపరచాలని కోరారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జెళ్ళ మురళి, మోహన్, జబ్బార్, దేసొజు మధు, శ్రీను, టి.లక్ష్మయ్య, నరసింహరావు, ఇంజ శ్రీనివాస్ పాల్గొన్నారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ జాతీయ అధ్యక్షులు కుమార్ చౌదరి యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యాదవ హక్కుల పోరాట సమితి గ్రేటర్ హైదరాబాద్ యువజన అధ్యక్షులు మారమోని శ్రీశైలం యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ, యాదవ సంఘం నాయకులు కలిసి అసెంబ్లీని ముట్టడించారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులకు రెండో విడత గొర్ల పంపిణీకి వెంటనే నగదు బదిలీ పథకం కింద బ్యాంకు అకౌంట్‌లో నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్‌టీ రిజర్వేషన్లను వెంటనే పునరుద్ధరించాలనీ, నామినేటెడ్ పదవులు యాదవులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాశాంతి పార్టీ రాష్ట్ర నాయకురాలు లక్ష్మి యాదవ్, తాంద్ర ఉపేంద్ర యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈడమోని మల్లేష్ యాదవ్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు కుందేళ్ళ శంకర్ యాదవ్, జోగులాంబ గద్వాల జిల్లా జాతీయ కార్యదర్శి అమర్ యాదవ్, జూపల్లి రాములు యాదవ్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఓరోసు నాగేష్ యాదవ్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దుడ్డు శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్ యాదవ్, లింగయ్య యాదవ్ పాల్గొన్నారు.

ఎక్స్ క్యూజ్ మీ సినిమా పోస్టర్ ఆవిష్కరణ


నవతెలంగాణ-ముషీరాబాద్



శ్రీ కనకదుర్గ ఆర్ట్ క్రియేషన్ బ్యానర్ పై నూతన హీరో హీరోయిన్ కిషోర్ దేవి పిఎస్ పరిచయం చేస్తూ పలు చిత్రాలకు నత్య దర్శకుడుగా పనిచేసిన ప్రముఖ నృత్య దర్శకుడు గోల్కొండ శ్రీనివాస్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఎక్స్ క్యూజ్ మీ పోస్టర్ మంగళవారం బాగ్ లింగంపల్లిలో హనుమాన్ వాయంశాల సెక్రెరీ మైథిలి శరన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చిత్రం రొమాంటిక్, ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్‌గా మంచి కథతో చిత్ర యూనిట్ చిత్రాన్ని రూపొందించారని ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు సవ్వడి వేణు గోల్కొండ శ్రీనివాస్, సంగీత దర్శకులు గోల్కొండ శ్రీకాంత్ శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు సత్యనారాయణ మూర్తి, లిరిక్ రైటర్స్ ఎస్.ఎన్ సింహ, శ్రీనివాస్, డీఎల్ గిరి, నటీనటులు శ్రీ మాణిక్, సాంబారి రవీందర్, హరిప్రసాద్, ప్రసాద్, సంబారి సాయికిరణ్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

అందె కిష్టయ్యకు ఓయూ డాక్టరేట్

నవతెలంగాణ-ఓయూ



రాజన్న సిరిసిల్ల జిల్లా వాసి అందె కిష్టయ్య తెలుగు శాఖ ఓయూ ప్రొ.ఎస్.ఆర్. వెంకటేశం పర్యవేక్షణలో " తెలంగాణ ఉద్యమంలో సాహితీ సాంస్కృతిక సంస్థల పాత్ర ఒక పరిశీలన " అనే అంశంపై తన పీహెచ్డీ గ్రంథాన్ని పూర్తి చేసినందుకు గాను డాక్టరేట్ ప్రకటించారు. అందె కృష్ణ మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి క్రియాశీలకంగా విద్యార్థి ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించాడు. తెలంగాణ బహుజన విద్యార్థి వేదిక స్థాపించి ఉద్యమంలో ఎన్నో కార్యక్రమాలు చేసి ప్రత్యేక రాష్ట్ర సాధనలో తన వంతు కృషి చేశారు. ఈ సందర్భంగా కిష్టయ్యను మిత్రులు ప్రొఫెసర్లు, ఉద్యమకారులు అభినందించారు.

నగర మార్కెట్‌లోకి మారుతీ సుజుకీ ఫ్రాంక్స్

ఆవిష్కరించిన జేటీసీ పాండురంగ నాయక్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రముఖ దిగ్గజ కార్ల కంపెనీ మారుతీ సుజుకీ తమ సరికొత్త కారు మారుతీ ఫ్రాంక్స్‌ను హైదరాబాద్ మార్కెట లోకి ప్రవేశపెట్టింది. బుధవారం జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు లోని మారుతీ సుజుకీ షోరూం వద్ద హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) జె.పాండురంగ నాయక్ ఆవిష్కరించారు. తొమ్మిది రంగులలో మారుతీ ఫ్రాంక్స్ అందుబాటులోకి ఉంటుందని, ఈ వాహనంలో 1.2 డ్యుయెల్ పెట్రోల్ ఇంజిన్‌తో పాటు 89 బీహెచ్‌పీ పవర్‌తో లభించనుంది. పలు వెరియంట్లలో లభించే ఈ కారు మోడల్ ధరలు రూ.8-11 లక్షల మధ్య ఉంటుందని అంచనా.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



నవతెలంగాణ - కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2కు చెందిన జి.శ్రీధర్(45) అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. సమాచారం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కుమారుడు దొడ్ల రామకృష్ణగౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, డివిజి ట్రస్ట్ ద్వారా రూపాయలు 5 వేల ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, వెంకటేష్, స్వరాజ్యం తదితరులు ఉన్నారు.

ఐఏఆర్‌ఈ కళాశాలలో ఎంఈటి ఈ 2023 ప్రాజెక్టు ఎక్స్‌పో

నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్‌లోని ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కళాశాలలో టెక్నాలజీ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళ, బుధవారం ఎంఈటీఈ ప్రాజెక్టు ఎక్స్‌పో 2023 నిర్వహించారు. విద్యార్థులు తమ సృజనాత్మకతతో వివిధ టెక్నాలజీలని ఉపయోగించి చేసిన ప్రొడక్ట్స్‌ని ఎక్స్‌పోలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ప్రొఫెసర్ అవినాష్ పాటిల్ రిటైర్డ్ బీహెచ్‌ఈఎల్ ఎంప్లాయ్, ప్రొఫెసర్. వాసుదేవరావు, శివరామ ప్రసాద్ రిటైర్డ్ ఇండస్ట్రీ ప్రొఫెషనల్‌లు విచ్చేసి ఎక్స్‌పోలో 11 బ్రాంచ్‌ల నుండి విద్యార్థులు చేసినటువంటి ఎక్స్‌పో ప్రాజెక్ట్‌ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ ప్రాజెక్టుని కంప్యూటర్ సైన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ డిపార్ట్మెంట్స్, ఎలక్ట్రికల్ మెకానికల్ సివిల్ ఏరోనాటికల్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బ్రాంచెస్‌కి డిపార్ట్‌మెంట్ నిర్వహించడం జరిగింది. ఈ ఎక్స్ పోలో ప్రదర్శించిన డిపార్ట్మెంట్స్ జూరీ టీం ద్వారా ఎవాల్యూయేషన్ చేయడం జరిగింది. ప్రతి డిపార్ట్మెంట్ నుంచి ఉత్తమ ప్రాజెక్టుని ఎంపిక చేసి వారికి నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టుని చేయాలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎల్.వి. నరసింహప్రసాద్ మాట్లాడుతూ ఇటువంటి ఎంఈటి ఈ ఎక్స్పో ప్రోగ్రామ్స్ నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించుకొని కొత్త స్టార్ట్ అప్ పెట్టుకోవడానికి సహాయపడుతుందని, మా కళాశాల కొత్త స్టార్ట్ అప్లకు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో కళాశాల కరస్పాండెంట్ సిహెచ్. సత్తిరెడ్డి, కళాశాల ట్రెజరర్ బి.రాజేశ్వర రావు పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పారితోషికం అందించారు. మెకానికల్ ఇంజనీరింగ్ అధిపతి డా.వి విఎస్‌హెచ్ హరినాథ్ ప్రసాద్, ప్రత్యేక అతిథిగా పాల్గొనగా, కన్వీనర్ గా ఇన్నోవేషన్ డీన్ డా, ఎం పాల ప్రసాద్ రెడ్డి, కో కన్వీనర్ గా మధు సూదన్ రావు, శేషగిరిరావు, కోఆర్డినేటర్‌గా రాఘవేంద్ర, శికా కుమారి పాండే వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.





కంటి వెలుగు పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-దుండిగల్

ప్రభుత్వం ప్రజల ఆరోగ్యరీత్యా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు రెండవ విడత నిర్వహిస్తున్న కంటి వైద్య పరీక్షలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ రాజీవ్ గాంధీనగర్ సాయి బాబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం లో భాగంగా మేయర్ నీలా గోపాల్ రెడ్డి, ఇన్‌చార్జి కమిషనర్ రామకృష్ణ రావు, స్థానిక కార్పొరేటర్ గాజుల సుజాతతో కలిసి బుధవారం కంటి వెలుగు కంటి పరీక్షా శిబిరం కార్యక్రమంలో పాల్గొని కంటి పరీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కంటి పరీక్ష శిబిరంలో ఏమైన సదుపాయాల లోపాలు ఉన్నాయా అని వైద్యులను అడిగి తెలుసుకొని, ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం మరియు అవసరమైన వారికి కళ్ళ అద్దాలను,మందులను అందజేయాలని తెలియజేశారు. అన్ని రకాల సౌకర్యాలను పెంచి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని ఎన్‌ఎంసి వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు వాణి, సీనియర్ నాయకులు బొర్రా చందు ,శ్రీనివాస్ ఎన్‌ఎంసి హెల్త్ ఆఫీసర్ అజీజ్ ఖాసిం, అధికారులు, వైద్య బృందం అధికారులు భవాని ప్రసాద్, వంశీ, వినయ్, రామేశ్వరి, స్థానిక డివిజన్ బీఆర్ఎస్ అనుబంధ కమిటీల సభ్యులు,స్థానిక బస్తీ వాసులు, ఇతర ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు సిబ్బందికి రివార్డులు



నవతెలంగాణ-దుండిగల్

సైబరాబాద్ పోలీసు కమీషనరేట్ పరిధిలోని బాలానగర్ జోన్ లోని బాచుపల్లి పోలీసు స్టేషన్ కు చెందిన పోలీసు సిబ్బందిని ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు గాను బుధవారం సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, అభినందించి రివార్డులు అందజేశారు. సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని బాలానగర్ జోన్ లోని బాచుపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో గత ఆదివారం రాత్రి 7.30 గంటల సమయం గంజాయి విక్రయిస్తున్నా ముఠా ను అరెస్టు చేసి, విక్రయదారుడి నుంచి 41 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకోవడంలో కీలకంగా వ్యవహరించిన బాలానగర్ డీసీపీ డీసీపీ టి. శ్రీనివాస్ రావు, కూకట్పల్లి ఏసీపీ చంద్రశేఖర్, బాచుపల్లి సీఐ నర్సిం హారెడ్డి, ఎస్ఎస్ఐ సాయినాథ్, కానిస్టేబుళ్లు రాజు, రాజేష్ కుమార్, కనకయ్య, హరిలాల్ లకు సీపీ అభినందించి రివార్డులు అందజేశారు.

రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీ కొట్టిన కారు

తలకు తీవ్ర గాయలై అక్కడికక్కడే మృతి



నవ తెలంగాణ-శామీర్‌పేట

రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని కారు ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయలై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్ధిపేట జిల్లా మార్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన బొడ్డు రమేష్(52) వంటపని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కాగా ఈనెల 3న ఉదయం అందాజ సమయం 4:45 గంటలకు తన హెూండా ఆక్టివా (టి ఎస్ 36డి 3488) పై పాములపర్తి నుండి హైదరాబాద్ పని వెళుతుండగా మార్గమధ్యంలో శామీర్ పేట మండలం తుర్కపల్లి పరిధిలోని అచ్చాయి పల్లి చౌరస్తా హెచ్ పి పెట్రోల్ బంకు వద్ద ఆక్టివా ఆపి చాయి త్రాగుదామని రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుండి కరీంనగర్ వైపు షిఫ్ట్ డిసైర్ కారు (టి ఎస్ 02 ఎఫ్ హెచ్ 4313) ను డ్రైవర్ అతి వేగంగా అజాగ్రత్తగా నడుపుతూ రోడ్డు దాటుతున్న బొడ్డు రమేషను ఢీ కొట్టడంతో తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి అక్కడికక్కడే మృతి చెందాడని మృతుని బంధువు సంతోష్ 8ఫిబ్రవరి2023న తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జోరుగా హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మాజీ ఎంపీపీ, టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో జోరుగా హాత్ సే హాత్ మూడవ రోజు కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, సుభాష్ నగర్ 130 డివిజన్, సూరారం కాలనీ పరిధిలోని ఏకలవ్య నగర్, జీవన్ జ్యోతి నగర్, ముత్తయ్య బస్తీ, సుందర్ నగర్, కూన మహాలక్ష్మి నగర్‌లలో కాంగ్రెస్ జెండా నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు ఎగరవేశారు. టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డి గడప గడపకు హాత్ సే హాత్ జోడో అభియాన్ స్టికర్ వేసి కరపత్రాలను పంచుతూ... బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల ద్వంద్వనీతిని, అధికారం కోసం మోసపూరిత హామీలతో ప్రజలకు జరిగిన అన్యాయం గురించి వివరించి, కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలను, కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని తెలియజేశారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రావణ్ కుమార్, ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షులు ఆవిజే జేమ్స్, సోమ్మన గారి శ్రీధర్ రెడ్డి , సంగం వీరేష్ గుప్తా, గురువా రెడ్డి, రామ్ చందర్, హేమ రాణి, సుల్తానా బేగం, పండరి రావు, యువజన నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి భారతీయ ఫిన్‌టెక్ వేదికగా ఫోన్ పే ఘనత

నవతెలంగాణ - హైదరాబాద్

యూపీఐ ఇంటర్నేషనల్ పేమెంట్లకు సహకారాన్నిప్రారంభించామని భారతదేశం లోని అతిపెద్ద డిజిటల్ పేమెంట్ల కంపెనీ అయిన ఫోన్ పే ప్రకటించింది. ఈ ఫీచర్ విదేశాలకు వెళుతున్న ఫోన్ పే భారతీయ వినియోగదారులకు యూపీఐని ఉపయోగిం చి విదేశీ మర్చంట్లకు తక్షణమే పే చేసేందుకు వీలు కల్పిస్తుంది. ఈ పురోగతి గురించి ఫోన్ పే సీఈఓ, సహ వ్యవస్థాపకుడు రాహుల్ చారి మాట్లాడుతూ... గడచిన ఆరేళ్లకు పైగా, భారతదేశ వ్యాప్తంగా మన జీవితాలను రూపాంతరం చేసిన యూపీఐ పేమెంట్ల విప్లవాన్ని అనుభవించడంలో తాము చాలా అదృష్టవంతులమన్నారు. ప్రపంచంలోని ఇతర భూభాగాలకు కూడా యూపీఐ అనుభవాన్ని అందించడంలో యూపీఐ ఇంటర్నేషనల్ మొదటి ప్రధాన అడుగుగా నిలుస్తుందన్నారు. ఇది ఒక గేమ్ఛేంజర్గా నిరూపించబడుతుందని, విదేశాలకు వెళ్లే భారతీయులు మర్చంట్ అవుట్ లెట్లలో పే చేసే పద్ధతిని పూర్తిగా మారుస్తుందని తాను గట్టిగా చెప్పగలన న్నారు. మార్కెట్కు కొత్త యూపీఐ ఫీచర్లను తీసుకునే మొదటి ఏపీపీ (థర్డ్ పార్టీ యాప్) గా నిలవడం పట్ల ఎప్పటిలాగే ఫోన్ పే గర్విస్తోందన్నారు.

యాదవులను అరెస్టు చేయడం అప్రజాస్వామికం

కుమార్ యాదవ్, యాదవ సంఘం నాయకులు



నవతెలంగాణ - కూకట్‌పల్లి

రాష్ట్ర జనాభాలో 20 శాతం ఉన్న యాదవుల అభ్యున్నతి కోసం, యాదవ కార్పొరేషన్‌ను ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేస్తూ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్ ఆధ్వర్యంలో, అసెంబ్లీ ముట్టడికి బయలు దేరిన యాదవులను ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్లో అరెస్ట్ అయిన యాదవ నాయకులను పరామర్శించడానికి వెళ్లిన యాదవ సంఘం నాయకులు కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ. యాదవులను అరెస్టు చేయడం ప్రజాస్వామిక విధానమైన చర్య అని.యాదవుల అభివృద్ధి కోసం యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్ లో మార్పులను సవరించి అసెంబ్లీ సమావేశాల లోపు పది వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వాని డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో గతంలోనే యాదవ కార్పొరేషన్ ని ఏర్పాటు చేసి కార్పొరేషన్ చైర్మన్‌ను కూడా నియమించడం జరిగింది. కానీ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ జనాభా గలిగిన యాదవుల కోసం ఎందుకు కార్పొరేషన్ ని ఏర్పాటు చేయట్లేదొ రాష్ట్ర ప్రభుత్వం యాదవులకి చెప్పాలన్నారు. యాదవులను కేవలం ఓటు బ్యాంకు రాజకీయానికి మాత్రమే వాడుకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో కొనసాగుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ యాదవుల అభివృద్ధి కోసం ఏం చేశారని ప్రశ్నించారు. యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రిని ఒప్పించలేని అసమర్థ మంత్రి అయిన తలసాని శ్రీనివాస్ యాదవ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోతే రాష్ట్రంలో ఉన్న యాదవులందరం పెద్ద ఎత్తున ప్రగతి భవన్ ని ముట్టడిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పర్వతాలు యాదవ్, బాలు యాదవ్, ఉదయ యాదవ్, అంజన్న యాదవ్, శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రిషబ్ పంత్‌ను చెంపమీద కొట్టాలనుంది : కపిల్ దేవ్



ముంబయి : ఇటీవల జరిగిన కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన టీమిండియా క్రికెటర్ రిషబ్ పంత్.. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. శస్త్రచికిత్సలు చేయించుకున్న అతడు పూర్తిగా కోలుకుని, తిరిగి మైదానంలో అడుగుపెట్టాలంటే కనీసం 6 నెలల నుంచి ఏడాది పట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రిషబ్ పంత్ గురించి ఇండియన్ క్రికెట్ లెజెండ్ కపిల్ దేవ్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'అన్ కట్' చానెల్‌తో మాట్లాడిన కపిల్.. పంత్ లేకపోవడంతో టీమిండియా బలం తగ్గిందని అన్నారు. పంత్ పూర్తిగా కోలుకోగానే.. అతడిని చెంప దెబ్బ కొట్టాలని ఉందని చెప్పారు."పంత్‌పై నాకు ఎంతో ప్రేమ. అతడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా. అప్పుడు వెళ్లి చెంప దెబ్బ కొడతాను. జాగ్రత్తగా ఉండమని చెబుతాను. నువ్వు లేకపోవడంతో జట్టు బలం తగ్గింది' అని చెబుతాను. అతడిని ఎంతో అభిమానిస్తున్నాను. అదే సమయంలో కోపంగానూ ఉన్నాను. నేటి యువకులు ఎందుకు అలాంటి తప్పులు చేస్తున్నారు? వారికి చెంప దెబ్బలు పడాలి.. అతను ప్రపంచంలోని ప్రేమనంతా పొందాలి. దేవుడు అతనికి మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలి. పిల్లలు తప్పు చేస్తే చెంపదెబ్బ కొట్టే హక్కు తల్లిదండ్రులకు ఉన్నట్లుగానే.. నేను పంత్ ను చెంపదెబ్బ కొట్టాలని అనుకుంటున్నా" అని చెప్పారు.



డబ్ల్యూటీసీ ఫైనల్... తేదీ,వేదిక ఖరారు

న్యూఢిల్లీ : ప్రతిష్టాత్మక ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) 2021- 23 సీజన్ ఫైనల్ తేదీని అంతర్జాతీయ క్రికెట్ మండలి ఖరారు చేసింది. ఇంగ్లండ్‌లోని ప్రఖ్యాత ఓవల్ వేదికగా జూన్ 7-11 వరకు ఈ మ్యాచ్ జరగనుంది. జూన్ 12ను రిజర్వుడేగా ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేసింది. రెండు సంవత్సరాల్లో ఆడే టెస్ట్ సిరీస్ ఫలితాల ఆధారంగా రెండు జట్లు ఫైనల్‌కు చేరుతాయి. కాగా, ఈ పాయింట్ల పట్టికలో ప్రస్తుతం ఆస్ట్రేలియా (75.56) అగ్రస్థానంలో ఉంది. ఇండియా (58.93) రెండో స్థానంలో కొనసాగుతోంది. ఆస్ట్రేలియాతో జరగబోయే టెస్టు సిరీస్‌లో రెండు మ్యాచ్‌లు గెలిస్తే టీమిండియా ఫైనల్‌కు అర్హత సాధించే అవకాశం ఉంది. ఈ రెండు జట్లతో పాటు మరో నాలుగు జట్లు ఫైనల్ బెర్తుపై కన్నేశాయి. మూడో ప్లేస్‌లో ఉన్న శ్రీలంక (53.33), నాలుగో స్థానంలోని సౌతాఫ్రికా(48.72), ఐదు, ఆరు ర్యాంకింగ్స్‌లో నిలిచిన న్యూజిలాండ్, వెస్టిండీస్‌కు ఫైనల్ చేరే అవకాశం ఉంది. ఇందులో న్యూజిలాండ్ గడ్డపై శ్రీలంక రెండు టెస్టులు ఆడాల్సి ఉండగా.. సౌతాఫ్రికాలో వెస్టిండీస్ రెండు మ్యాచ్‌లు ఆడాలి.

వ్యవసాయ కార్మికులకు సమగ్ర శాసన చట్టం తేవాలి

మిగులు భూమి పేదలకు పంచాలి

- దేశవ్యాప్త పోరాటాలకు రూపకల్పన
- వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మినేని వీరభద్రం
- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-అడిక్‌మెట్

దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కార్మికుల జీవన భద్రత కోసం పార్లమెంట్‌లో సమగ్ర శాసన చట్టాన్ని తీసుకురావాలని, సాగులో ఉన్న ప్రతి ఒక్కరికీ పోడుహక్కు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న మిగులు భూములను పేదలకు పంచాలని దేశవ్యాప్త పోరాటాలకు రూపకల్పన చేయనున్నామన్నారు. బెంగాల్ రాష్ట్రం హౌరాలో జరగనున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం 10వ మహాసభ పోస్టర్‌ను బుధవారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 17వ తేదీన జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగం నుంచి వచ్చే ఆదాయమే ఎక్కువన్నారు. వ్యవసాయరంగ ఉత్పత్తుల్లో ప్రధాన పాత్ర పోషిస్తూ వ్యవసాయ కార్మికులుగా ఉన్న దళితులు, గిరిజనులు, వృత్తిదారులు ఎలాంటి సామాజిక భద్రతా లేకుండా అభద్రతాభావంలో బతుకుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరికీ కూడు, గుడ్డ, నివాసం, జీవన భృతి కల్పించే బాధ్యతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే విధంగా పార్లమెంటులో సమగ్ర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

పోడు భూముల్లో సాగులో ఉన్న ఆదివాసీ గిరిజనులకు 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం కుటుంబానికి పదెకరాలు, మూడు తరాలుగా సాగులో ఉన్న గిరిజనేతర పేదలకు భూమిపై హక్కు పట్టా ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూ సీలింగ్ చట్టం ప్రకారం భూస్వాములు, పెత్తందారుల చేతిలో ఉన్న మిగులు భూములను బయటికి తీసి పేదలకు పంచాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పోరాటాలకు రూపకల్పన ఈ మహాసభలో చేస్తామని చెప్పారు. 17వ తేదీన జరగనున్న బహిరంగ సభలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, వ్యకాస జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, అధ్యక్షులు విజయ రాఘవన్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు, సీనియర్ నాయకులు పి.సోమయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, మచ్చ వెంకటేశ్వర్లు, కొండమడుగు నరసింహ, పొన్నం వెంకటేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

'పశు కౌగిలి' దినంగా

ప్రేమికుల రోజు

- కేంద్ర మత్స్య,పశు సంవర్ధక శాఖ ప్రకటన

న్యూఢిల్లీ : వైవిధ్యభరితమైన భారత సంస్కృతి, సంప్రదాయాలను కేంద్రీకరించీ, హిందుత్వ వైపు లాక్కెళ్తున్న బిజెపి ప్రతిదానిని పక్కదారి పట్టించే ఎత్తుగడలు వేస్తోంది. వీధులకు పేర్లు మార్చడం, మసీదులు, క్రైస్తవ మందిరాలు కింద హిందూ ఆలయాలున్నాయంటూ రభస చేయడం చూశాం..ఇప్పుడు భిన్న సంస్కృతులను ప్రతిబింబించే దినోత్సవాలను కూడా హైందవీకరించే పన్నాగం చేస్తోంది. ఈ క్రమంలోనే ప్రేమికులు దినోత్సవం జరుపుకునే ఫిబ్రవరి 14ను 'పశు కౌగిలి' (కౌ హగ్) దినోత్సవంగా జరుపుకోవాలని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి ఎస్ కుమార్ సింగ్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'మీరు ప్రేమికుల దినోత్సవాన్ని సంతోషంగా జరుపుకోవాలనుకుంటున్నారా? అయితే ఓ ఆవుని కౌగిలించుకోండి' అని అందులో పేర్కొన్నారు. సనాతన సాంప్రదాయాలు అంతరించిపోవడానికి విదేశీ సంస్కృతి కారణమవుతోందని పేర్కొన్నారు.

మతం పేరిట ప్రజల మధ్య చిచ్చు : భట్టి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మతం పేరిట దేశ ప్రజల మధ్య బీజేపీ చిచ్చు పెడుతున్నదని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల మధ్య విద్వేషాలను సృష్టించి రాజకీయ లబ్ది పొందడం కోసం విచ్ఛిన్నకర శక్తులు కుట్రలు పన్నుతున్నాయనీ, వాటి నుంచి దేశాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని తెలిపారు. కేంద్రం ప్రవేశ పెట్టిన రూ. 45లక్షల కోట్ల బడ్జెట్లో రూ.15లక్షల కోట్లు అప్పులు చూపిందన్నారు. దేశంలో పేదలు నిరుపేదలుగా మారుతుంటే, ధనవంతులు సంపన్నులుగా ఎదుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చలో మాట్లాడారు. దేశంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన హక్కుల చట్టం ప్రకారం ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్, గిరిజన యూనివర్శిటీ, ఐటీఐఆర్ ఇలా ఒక్క ప్రాజెక్టుకు కూడా నిధులు ఇవ్వలేదన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే కార్యకలాపాలకు నిధులు ఇవ్వకపోగా అడిగితే కేసులు, మాట్లాడితే ఐటీ, ఈడీ, సీబీఐ వస్తాయని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలకు ప్రభుత్వాలనే కూల్చివేస్తున్నదని విమర్శించారు. దేశంలో ప్రజస్వామ్యమే లేకుండా మోడీ నియంతృత్వ పాలన సాగిస్తున్నదన్నారు. ప్రపంచమే ఆశ్చర్య పోయేట్లుగా హిండెన్‌బర్గ్ నివేదిక అదాని ఆర్థిక నేరాన్ని బట్టబయలు చేసిందన్నారు. దేశాన్నే కాదు, ప్రపంచాన్ని మోసం చేసిండు. దేశాన్ని లూటీ చేసిండు. అదానిపై దాడి దేశం మీద దాడి అనడం సరికాదు. ఇండియా అంటే అదాని? అదాని అంటే ఇండియా మాత్రమేనా?. ఇండియా అంటే తమ రక్తాన్ని చెమటగా చిందించి ఉత్పత్తి సృష్టించిన కోట్లాది ప్రజలది ఈ దేశం' అని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.అదాని చేసిన ఆర్థిక నేరం వల్ల ఎస్‌బీఐ, ఎల్‌ఐసీ సంస్థల్లో తెలంగాణ ప్రజలు దాచుకున్న డబ్బులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో మిశ్రమ ఆర్థిక విధానాల ద్వారా ఆస్తులను సృష్టిస్తే...అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మోడీ ప్రభుత్వం ఆస్తులను అమ్ముతున్నదని విమర్శించారు. పోర్టులను కార్పొరేట్ల చేతుల్లో పెడుతున్న బీజేపీ...దేశం వారి దయాదాక్షిణ్యాలపై బతికేలా చేస్తున్నదన్నారు. మతం మత్తు లాంటిదనీ, దేశంలోనే కాదు రాష్ట్రంలో కూడా మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని తెలిపారు.

బడ్జెట్ అంకెలు అనుమానస్పదంగా ఉన్నాయి

రాష్ట్ర బడ్జెట్‌లోని అంకెలు అనుమానస్పదంగా ఉన్నాయని విక్రమార్క ఈ సందర్భంగా అన్నారు. రాష్ట్రానికి ఆదాయం రూ. 10 లేదా రూ.12వేలకు మించి రావడం లేదనీ, కానీ బడ్జెట్లో ఎక్కువగా చూపించారని చెప్పారు. 'ఆర్థిక మంత్రి హరీశ్ రావు గారు ఎంత పొడుగ్గా ఉన్నారో 2021-24 బడ్జెట్ను కూడా అంతే పొడుగ్గా పెట్టారు' అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలు ఆశించిన విధంగా బడ్జెట్ లేదన్నారు. ప్రభుత్వ ఖజానాకు రాబడి పెంచేందుకు ప్రజలపై ఏమైన పన్నులు వేస్తారా? వేయబోతున్నారా? చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కింద రూ.41,259, 17 కోట్లు చూపెట్టగా, కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.21,470.84 కోట్లు చూపించారన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు భూమి లేని నిరుపేదలకు భూమి, ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. ధరణిలో కాస్తు కాలం లేకుండా చేయడం వల్ల చాలా మంది రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములను వెనక్కి తీసుకోవడం సరైందికాదన్నారు. ఇబ్రహీంపట్నంలో 7,8వేల ఎకరాల అసైన్డ్ భూములను వెనక్కి తీసుకుని పేదలకు అన్యాయం చేసిందన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలను ఐటీఐ. పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని సూచించారు. సంఘమేశ్వర వద్ద రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను నిర్మించి 10 టీఎంసీ నీళ్లను మళ్లించుకుని వెళితే సాగర్ ఎడమ కాలువపై ఆధారపడి సేద్యం చేస్తున్న ఖమ్మం జిల్లాలోని మధిర, పాలేరు, వైరా, సత్తుపల్లి, ఖమ్మం నాగార్జునసాగర్ నియోజకవర్గాలు ఎదారిగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. చైతన్య, నారాయణ విద్యా సంస్థల ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలను కట్టడి చేయకుంటే రాష్ట్రానికి ప్రమాదమనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. తెలంగాణలో జరిగిన అన్ని పోరాటాలు, లక్ష్యాలు, ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెటును రూపొందించాలని కోరారు.

దుర్భరమైన పరిస్థితుల నుంచి

వెలుగులు నింపేదాకా

బడ్జెట్‌పై చర్చలో బీఆర్ఎస్ సభ్యులు పద్మాదేవేందర్ రెడ్డి



ఒకనాడు దుర్భర పరిస్థితులను ఎదుర్కొన్న తెలంగాణ... ఇప్పుడు సస్యశ్యామలమైందని బీఆర్ఎస్ సభ్యులు పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో తమ ప్రభుత్వం ప్రజల జీవితాల్లో వెలుగు నింపిందన్నారు. సమైక్య పాలనలో ప్రణాళికాబద్ధంగా తెలంగాణను విధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిదేండ్లలో రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దారు తెలిపారు. సంక్షేమ రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిపారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి దళితబంధుతో ఎస్సీ బిడ్డల జీవితాల్లో వెలుగులు నిండాయని చెప్పారు. సర్కారు స్కూళ్లను కార్పొరేట్లకు దీటుగా తీర్చిదిద్దితున్నామని వెల్లడించారు. కంటి వెలుగు అద్భుతమైన కార్యక్రమమనీ, మొదటి విడత కంటి వెలుగు మంచి ఫలితాలనిచ్చిందని తెలిపారు. కరోనా సంక్షోభంలోనూ తెలంగాణ ప్రగతి రథం ఆగలేదని గుర్తు చేశారు.

అమిగోస్.. ప్రయోగాత్మక చిత్రం కాదు



కళ్యాణ్‌రామ్

'బింబిసార' ఘన విజయం తర్వాత ఓ నటుడిగానే కాకుండా నిర్మాతగానూ నాపై మరింత బాధ్యత పెరిగింది. కథల ఎంపికలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి రావడంతో ఇప్పటి వరకు ఒక్క స్క్రిప్ట్‌ని కూడా ఫైనల్ చేయలేదు' అని హీరో కళ్యాణ్‌రామ్ అన్నారు. ఆయన తాజాగా నటించిన చిత్రం 'అమిగోస్'.

మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నూతన దర్శకుడు రాజేంద్రరెడ్డి దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. కళ్యాణ్ రామ్ త్రిపాత్రాభినయం చేసిన ఈ చిత్రం ఈనెల 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో హీరో కళ్యాణ్‌రామ్ బుధవారం మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

అందుకే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చా..

'బింబిసార, అమిగోస్, డెవిల్ చిత్రాలను 2020లో ఫైనల్ చేశాను. వీటిల్లో 'బింబిసార' ఎంతటి ఘనవిజయాన్ని సాధించిందో అందరికీ తెలిసిందే. ఈ సక్సెస్‌తో నాపై మరింత బాధ్యత పెరిగింది. మైత్రి మూవీ మేకర్స్ అధినేతలు 'అమిగోస్' కథ వినమని చెప్పారు. నూతన దర్శకుడు రాజేంద్రరెడ్డి చెప్పిన ఈ చిత్రకథలో నావెల్టీ ఉంది. ముఖ్యంగా డాపర్‌గ్యాంగర్స్ కాన్సెప్ట్ నాకు బాగా నచ్చింది. అచ్చ తెలుగులో చెప్పాలంటే ఒకేలాగ ఉండే ముగ్గురు వ్యక్తుల కథ ఇది. ఇది నాకు ఫ్రెష్ అంటెప్ట్ అనిపించింది. అందుకే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చా.

నమ్మశక్యం కాని కాన్సెప్ట్ కాదు

డాపర్‌గ్యాంగర్స్ కాన్సెప్ట్ అనేది నమ్మశక్యం కాని కాన్సెప్ట్ కాదు. ఇటీవల ట్విట్టర్‌ని కొనుగోలు చేసిన ఎలాన్‌మస్క్ మాదిరిగానే ఇంకొకరు ఉన్నారని వార్తలు వినిపించాయి. ఇలాంటిదే రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలోనూ వినిపించాయి. అయితే ఇది ప్రయోగాత్మక చిత్రం కాదు. దీనికి ముందు నేను చేసిన '118' సినిమా మాత్రం ప్రయోగాత్మక చిత్రమే. అయినప్పటికీ నా సినిమాలన్ని కమర్షియల్‌గా ఉంటాయి.అలాగే ఓ సినిమాలో నేను నటించేటప్పుడు కథలో, నా పాత్రలో ఫ్రెష్‌నెస్ ఉందా లేదా అని చూస్తాను. అలా సెలెక్టీవ్‌గా 'బింబిసార' చేశా. ఈ కథలో ఉన్న టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తోపాటు ఫాంటసీ ఎలిమెంట్స్ బాగా అలరించాయి.

ఇలాంటి సినిమాలు చేయటం చాలా కష్టం

ఇందులో మంజునాథ్, సిద్దార్థ్, మైఖేల్‌గా మూడు భిన్న పాత్రలను పోషించా. త్రిపాత్రాభినయం చేస్తున్నప్పుడు సాంకేతికంగా చాలా కష్టతరంగా ఉంటుంది. ఎందుకంటే మూడు పాత్రలు మూడు స్వభావాలతోపాటు, మూడు భిన్న గెటప్స్‌తో ఉంటాయి. వాటిని మేనేజ్ చేసుకుంటూ చిత్రీకరణ చేయడమంటే కత్తిమీద సామే. కథలోని ఫ్లో మిస్ అవ్వకుండా ఉండాలనే బాలయ్య బాబాయ్ సూపర్‌హిట్ సాంగ్ 'ఎన్నో రాత్రులొస్తాయి..'పాటను పెట్టాం. నాయిక ఆషిక రంగనాథ్ ఎంతో అద్భుతంగా నటించింది. మైత్రి మూవీ మేకర్స్ అభిరుచిగల నిర్మాతలు. వారితో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా తప్పకుండా మంచి విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉంది.

నవచిత్రం

మంచి కథతో అల్లంత దూరాన



విశ్వ కార్తికేయ, అలీ, హ్రితిక శ్రీనివాస్

'సబ్జెక్ట్‌ని నమ్ముకుని, అందుకు తగ్గ ఆర్టిస్టులను, సాంకేతిక నిపుణులను ఎంపిక చేసుకుని, ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా విజువల్ ఫీస్ట్‌గా తీసిన సినిమా 'అల్లంత దూరాన' అని హాస్య నటుడు, ఏ.పి.ఎలక్ట్రానిక్ మీడియా అడ్వైజర్ అలీ అన్నారు. గతంలో బాలనటుడిగా, ఆ తర్వాత హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్న విశ్వ కార్తికేయ హీరోగా, ప్రముఖ నటి ఆమని మేనకోడలు హ్రితిక శ్రీనివాస్ హీరోయిన్‌గా చలపతి పువ్వల దర్శకత్వంలో ఆర్.ఆర్.క్రియేటివ్ కమర్షియల్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మించారు. శ్రీమతి కోమలి సమర్పణలో నిర్మాత ఎన్.చంద్రమోహనరెడ్డి తెలుగు, తమిళ భాషలలో నిర్మించిన ఈ సినిమా ఈనెల 10న విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ వేడుక ప్రసాద్ ల్యాబ్‌లో జరిగింది. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన అలీ ట్రైలర్ విడుదల చేశారు. 'ఎంతో తపనతో ఒక మంచి ప్రేమకథా సినిమాను ప్రేక్షకులకు అందించాలని తెలుగు, తమిళ భాషలలో తీశాం. ప్రతీ ప్రేక్షకుడు మెచ్చుకునే విధంగా ఈ సినిమా ఉంటుంది' అని నిర్మాత నిర్మాత ఎన్. చంద్రమోహనరెడ్డి తెలిపారు. 'మంచి సీనియర్ ఆర్టిస్టులు ఈ సినిమాలో నటించారు' అని దర్శకుడు చలపతి పువ్వల చెప్పారు.

'ఈ సినిమా చేయడానికి సబ్జెక్ట్ నచ్చడమే ప్రధాన కారణం. మనసులను హత్తుకునేలా ఉంటుంది. రథన్ సంగీతం, కళ్యాణ్ ఛాయాగ్రహణం అలరిస్తాయి' అని హీరో విశ్వ కార్తికేయ, హీరోయిన్ హ్రితిక శ్రీనివాస్ అన్నారు.

పాన్ ఇండియా స్థాయిలో హిట్ కావాలి : బాలకృష్ణ



బాలకృష్ణ, శివ రాజ్‌కుమార్

కన్నడ చలనచిత్ర పరిశ్రమలో సూపర్ హిట్‌గా నిలిచిన శివ రాజ్‌కుమార్ 125వ చిత్రం 'శివ వేద'. ఈ చిత్రాన్ని ఆయన భార్య గీతా శివ రాజ్‌కుమార్ తమ సొంత సంస్థ గీతా పిక్చర్స్‌పై దీన్ని మొదటి ప్రాజెక్ట్‌గా నిర్మించారు.

ఈ సినిమాను కంచి కామాక్షి కలకత్తా క్రియేషన్స్ ద్వారా తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు. తెలుగులో నేడు (గురువారం) గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో బాలకృష్ణ మాట్లాడుతూ, 'ఈ చిత్ర ట్రైలర్ చాలా బాగుంది. కన్నడలో మాదిరిగానే తెలుగులో వస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా లెవల్‌లో బిగ్ హిట్ అవ్వాలి' అని తెలిపారు. 'నా భార్య గీతా శివరాజ్ కుమార్ నిర్మించిన ఈ సినిమాలో వినోదంతో పాటు మంచి మెసేజ్ ఉంది. చూసిన ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఫీల్ అవుతారు' అని హీరో శివ రాజ్ కుమార్ చెప్పారు.

'ఈ సినిమా ఎమోషనల్ డ్రామా, యాక్షన్ థ్రిల్లర్‌గా కూడా ఉంటుంది' చిత్ర దర్శకుడు హర్ష చెప్పారు. తెలుగు ప్రేక్షకులు అందరూ మా చిత్రాన్ని ఆదరించి పెద్ద హిట్ చేస్తారనే నమ్మకంతో ఉన్నాం అని నిర్మాత ఎం.వి. ఆర్.కృష్ణ తెలిపారు.

శివరాత్రి కానుక



'ఊ అంటావా మావా ఊఊ అంటావా మావా' చిత్ర బృందం

యశ్వంత్, రాకింగ్ రాకేష్, అనన్య, హిందోలా చక్రవర్తి, పూజ, సిమ్రాన్ కీలక పాత్రధారులుగా సీనియర్ దర్శకుడు రేలంగి నరసింహారావు దర్శకత్వం వహించిన చిత్రం 'ఊ అంటావా మావా ఊఊ అంటావా మావ'. తుమ్మల ప్రసన్న కుమార్ నిర్మాత.

మహా శివరాత్రి కానుకగా ఈ నెల 18న విడుదల కానుందీ చిత్రం. ఈ నేపథ్యంలో ఫిల్మ్‌ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ 'ఇప్పటి వరకురాని కామెడీ, హర్రర్ థ్రిల్లర్ ఇది. మామూలుగా నేను ఏ కథ అనుకున్నా.. దాసరిగారి సలహా తీసుకునేవాణ్ణి. ఆయన లేకపోవడంతో తమ్మారెడ్డి సలహాలతోపాటు దర్శకుడు అజయ్, చదలవాడ శ్రీనివాసరావు సూచనలు తీసుకుని ఈ సినిమా చేశాం. ఫైనల్‌గా ప్రసన్నకుమార్ అనుకున్నట్లు కథ కుదిరింది. మంచి సినిమా అవుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.

'రేలంగి నరసింహారావు చేస్తున్న 76వ చిత్రం. చక్కని కథతో తెరకెక్కించారు. కాశ్మీర్, హైదరాబాద్ ప్రాంతాల్లోని అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరణ చేశాం. ఫస్ట్ కాపీ చూశాం. అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. పాటలు చక్కగా కుదిరాయి. ఇందులో కామెడీ, హర్రర్ సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. చాలామందికి సినిమా చూపించాం. అందరికీ బాగా నచ్చింది' అని నిర్మాత ప్రసన్నకుమార్ చెప్పారు.

సందేశాత్మకంగా బ్రహ్మావరం



'బ్రహ్మావరం' చిత్ర నాయకానాయికలు

"బ్రహ్మావరం' పి.ఎస్.పరిధిలో.. ఏం జరిగింది? అనేదే ఈ సినిమా కథ. దీనికి మేం 'సమ్ టైమ్స్ మిస్టేక్స్ బ్రింగ్ జస్టిస్' అంటే కొన్నిసార్లు మనం చేసే తప్పులు కూడా.. కొంత జస్టిస్‌ను తీసుకొస్తాయి అనే థీమ్ లైన్‌ని కూడా ఇచ్చాం.

తప్పులు జస్టిస్‌ను తీసుకు రావడం ఏమిటి అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందేనని అంటున్నారు దర్శకులు ఇమ్రాన్ శాస్రి. సమ్మెట గాంధీ, ప్రేమ్ సాగర్, రూపా లక్ష్మి, బెల్లం కొండ స్రవంతి, హర్షిని,గురు చరణ్, సూర్య నటీ నటులుగా ఇమ్రాన్ శాస్రిని దర్శకుడిగా పరిచయం చేస్తూ డ్రీమ్జ్ ఆన్ రీల్జ్ నిర్మిస్తున్న చిత్రమిది.

ఈ సినిమా విజయవంతంగా షూటింగ్ పూర్తి చేసుకున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ మీడియా సమావేశం నిర్వహించి, చిత్ర ఫస్ట్‌లుక్‌ను గ్రాండ్‌గా రిలీజ్ చేసింది.

ఈ సందర్భంగా ప్రేమ్ సాగర్ మాట్లాడుతూ,'మంచి ఫ్యామిలీ సబ్జెక్ట్ ఉన్న ఈ సినిమాను చిన్న సినిమా అని చూడకుండా సమాజానికి పనికివచ్చే ఒక మంచి కంటెంట్‌తోపాటు మెసేజ్ ఉన్న ఇలాంటి సినిమాలు చూడండి' అని తెలిపారు.

'ఇది నా మొదటి సినిమా. అన్ని వర్గాల వారికి నచ్చే విధంగా ఇందులో అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. అందరూ ఎంజాయ్ చేసేలా ఇందులో చక్కటి సస్పెన్స్‌తో పాటు సినిమా మొత్తం చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది' అని హీరోయిన్ బెల్లం కొండ స్రవంతి చెప్పారు. చిత్ర దర్శకుడు ఇమ్రాన్ శాస్రి మాట్లాడుతూ,' ఈ సినిమాకి రచన, దర్శకత్వం వహించాను. ఇప్పుడు వచ్చే సస్పెన్స్ థ్రిల్లర్ కథలకి భిన్నంగా మేం ఫ్యామిలీ డ్రామాతో పాటు సస్పెన్స్‌ను జోడించి ఈ సినిమా తీశాం' అని తెలిపారు. నటుడు గురు మాట్లాడుతూ, 'ప్రొడక్షన్ పరంగా నిర్మాతలు అమెరికాలో ఉన్నా కూడా సినిమాకు ఏమి కావాలంటే అది ఖర్చుకు వెనుకడకుండా నిర్మించారు. మంచి కంటెంట్ తో వస్తున్న ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చేవిధంగా దర్శకుడు చాలా డిఫరెంట్‌గా తీశాడు' అని చెప్పారు.

'డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమాకు మ్యూజిక్ చేయడం చాలా సంతోషంగా వుంది. కంటెంట్‌ని నమ్ముకుని చేసిన ఈ సినిమాలో ఉన్న పాటలు అన్నీ అందరికీ నచ్చుతాయి' అని సంగీత దర్శకుడు సాకేత్ సాయిరామ్ అని అన్నారు.

మెప్పించే మిస్టర్ ధర్మ



కోటా శంకర్‌రావు, రమేష్ ఆర్.కె., ప్రదీప్‌రాజ్

శ్రీ వెంకటేశ్వరస్వామి మూవీస్ పతాకంపై ప్రదీప్ రాజ్ దర్శకత్వంలో రమేష్ ఆర్.కె. నిర్మిస్తున్న చిత్రం మిస్టర్ ధర్మ (బ్రదర్ ఆఫ్ యమ).

ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ వేడుక ఫిలింఛాంబర్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నిర్మాత, ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు బసిరెడ్డి ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు.

రచయిత, దర్శకుడు వడ్డేపల్లి కృష్ణ, దర్శకుడు బాజ్జీ, నటుడు కోట శంకరరావు, శాంత కుమార్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు. చిత్ర నిర్మాత రమేష్ ఆర్.కె మాట్లాడుతూ, 'ముంబయి ప్రాంతానికి చెందిన తెలుగువాడిని. మంచి కథా బలం ఉన్న చిత్రాల నిర్మాణం కోసం ఇండస్ట్రీకి వచ్చాను. పోలీస్ స్టోరీ బ్యాక్‌డ్రాప్‌లో సినిమా చేయడానికి దర్శకుడిని కథ చెప్పమని అడిగాను. నా భావాలకు అనుగుణంగా మంచి సన్నివేశాలు, పాటలు, ఫైట్స్ ప్రాధాన్యతను ఇస్తూ చిత్రాన్ని అనుకున్న విధంగా దర్శకుడు పూర్తి చేసారు. భానుచందర్, కోట శంకరరావు, శాంతి కుమార్ తదితరులు తమ పాత్రలకు తగిన న్యాయం చేశారు. కామెడీ, రొమాన్స్‌కి కూడా మంచి ప్రాధాన్యత ఉంది. త్వరలో సినిమా విడుదలకు ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నవతెలంగాణ

ఢిల్లీ మేయర్ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ

- నామినేటెడ్ సభ్యులకు ఓటింగ్ హక్కు లేదని సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- 13న త్రిసభ్య ధర్మాసనం విచారణ

న్యూఢిల్లీ : మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఘోర పరాభవం పొందిన బిజెపి నామినేటెడ్ సభ్యుల ఓటింగ్‌తో పాగా వేయాలని చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఈ మేరకు సుప్రీంకోర్టులోనూ ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నామినేట్ చేయబడిన సభ్యులను కార్పొరేషన్ సమావేశాల్లో ఓటు వేసేందుకు రాజ్యాంగం అనుమతించడం లేదని సుప్రీం కోర్టు బుధవారం స్పష్టీకరించింది. ఢిల్లీ మేయర్ ఎన్నికలను వరుసగా మూడోసారి కూడా ఉద్దేశ్యపూర్వకంగానే నిలుపుచేస్తున్నారంటూ ఆమాద్మీ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ప్రొటెమ్ స్పీకర్లకు సుప్రీం నోటీసులు జారీ చేసింది. ఎన్నికైన సభ్యులకు, నామినేటెడ్ సభ్యులకు మధ్య వ్యత్యాసానికి చాలా ప్రాధాన్యత వుందని ఈ కేసు విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ స్పష్టం చేశారు. దీనిపై ఈ నెల 13న త్రిసభ్య ధర్మాసనం సవివరమైన విచారణ చేపడుతుందన్నారు. అక్రమ మార్గాల ద్వారానైనా ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో తన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని సీనియర్ ఆప్ నేత మనీష్ శిసోడియా విమర్శించారు. తాజాగా సుప్రీం చేసిన వ్యాఖ్యలతో బిజెపికి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. ఆప్ మేయర్ అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్ తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది ఎఎం సింఘ్వీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విధ్వంసానికి పాల్పడుతున్నవారిపై చేస్తున్న న్యాయపోరాటమని పేర్కొన్నారు. మున్సిపాలిటీ ఎన్నికలు సకాలంగా పూర్తి కావాలని రాజ్యాంగంలోని 243 యు అధికరణ పేర్కొంటోందని గుర్తు చేశారు. గతేడాది డిసెంబరు 4న ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరిగా యని చెప్పారు. కానీ, మేయర్, డిప్యూటీ మేయర్, స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికలు మాత్రమూ మూడుసార్లుగా నిలిచిపోతూ వస్తున్నాయని అన్నారు. రాజ్యాంగంలోని 243ఆర్(2)(4) ని నేరుగా ఉల్లంఘిస్తూ నామినేటెడ్ సభ్యులను ఓటు వేసేందుకు ప్రొటెమ్ స్పీకర్ అనుమతించారని ఆయన తెలిపారు. ఇదేమీ కేవలం శాసనం కాదని, రాజ్యాంగమే వారిని ఓటు వేయడానికి అనుమతించడం లేదని జస్టిస్ పి.ఎస్.నరసింహా వ్యాఖ్యానించారు. జనవరి 6, 24 తేదీల్లో రెండుసార్లు నిలిచిపోయిన నేపథ్యంలో సకాలంలో మేయర్ ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ జనవరి 27వ తేదీన ఒబెరాయ్ సుప్రీంను ఆశ్రయించారు. నామినేటెడ్ సభ్యులు ఓటు వేయడానికి అనుమతించిన పక్షంలో మళ్లీ కోర్టుకు వెళ్లేందుకు అనుమతించాలని కూడా ఆమె అప్పుడే కోరారు.

11,200కి పైనే భూకంప మృతులు !

- అహర్నిశలు శ్రమిస్తున్న సహాయక సిబ్బంది

ఇస్తాంబుల్ : టర్కీ, సిరియాలను కుదిపేసిన పెను భూకంపంలో మృతుల సంఖ్య బుధవారానికి 11,200కి పైగానే వుంది. మరోవైపు శిథిలాల కింద చిక్కుకుపోయిన వందలాది మందిని వెలికితీసేందుకు సహాయక సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తున్నారు. 48 గంటలు గడుస్తుండడంతో పరిస్థితి మరింత దిగజారే అవకాశాలు వున్నాయని భయపడుతున్నారు. టర్కీలో ఇప్పటివరకు 8,574 మంది చనిపోగా, సిరియాలో 2,662 మంది మరణించారని ఇరు దేశాల అధికారులు, వైద్య సిబ్బంది తెలిపారు. టర్కీలో దాదాపు 50 వేల మంది గాయపడగా, సిరియాలో మరో ఐదువేలమంది గాయపడ్డారు. తొలిసారి వచ్చిన భూకంప కేంద్రమైన కహ్రామన్మారస్ లో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ పర్యటించారు. ఈ నగరంలో కుప్పకూలిన అపార్ట్‌మెంట్ శిథిలాల నుండి మూడేళ్ళ బాలుడు ఆరిఫ్ ఖాన్‌ను దాదాపు రెండు రోజుల తర్వాత సజీవంగా వెలికి తీశారు. కొద్ది గంటల తర్వాత అదియామన్ నగరంలో పదేళ్ళ బీటుల్ ఎడిస్‌ను ఇలాగే శిథిలాల నుండి కాపాడారు. ఈ రెండు సంఘటనలతో సహాయక కార్యకర్తల్లో ఇంకా ఆశలు సజీవంగా వున్నాయి. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని కాపాడగలమనే ఆశ కలుగుతోంది. ఇదిలా వుండగా, భూకంపాలకు ధ్వంసమైన ప్రాంతాలను ఏడాదిలోగా పునర్నిర్మాస్తామని ఎర్డోగన్ హామీ ఇచ్చారు.

జపాన్‌లో 2011లో సునామీ రావడానికి కారణమైన భూకంపం కన్నా ఇది శక్తివంతమైన భూకంపం. టర్కీలో బాధితుల్లో చాలామంది తమ కారుల్లోనే నిద్ర పోతున్నారు. టెంట్ కానీ, హీటింగ్ స్టవ్‌కానీ లేదని, పిల్లలు కూడా ఇబ్బందులు పడుతున్నారని, దానికి తోడు వర్షంతో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారిందని వారు వాపోతున్నారు. ఆకలితో లేదా ఈ భూకంపంలోనో తాము చనిపోవడం లేదని, ఎముకలు కొరికేస్తున్న చలితో పోయేలా వున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బుధవారానికి దాదాపు 25 దేశాలకు చెందిన సహాయక బృందాలు టర్కీ చేరుకున్నాయి. అలాగే సహాయం కూడా వెల్లువెత్తుతోంది. సిరియాలో రెబెల్స్ అదుపులో వున్న ప్రాంతాలకు సహాయ సరఫరాలు అందేలా చూసేందుకు అన్ని మార్గాలు అన్వేషిస్తున్నామని ఐక్యరాజ్య సమితి తెలిపింది.

సిరియాలో శిథిలాల్లో నవజాత శిశువు !

వాయవ్య సిరియా పట్టణంలో శిథిలాల కింద ఇంకా బొడ్డూడని నవజాత శిశువుని అక్కడి ప్రజలు గుర్తించారు. భూకంపం వచ్చిన సమయంలో ప్రసవించిన తల్లి వెంటనే చనిపోయింది. ఇతర కుటుంబ సభ్యులు కూడా శిథిలాల కింద నలిగి చనిపోయారు. కానీ తల్లి నుండి బొడ్డు తాడు కూడా వేరుపడని ఆ చిన్నారి మాత్రం మట్టిలో కప్పబడి ఏడుస్తూ కనిపించడంతో అధికారులు వెంటనే రక్షించి, ఆస్పత్రిలో చేర్చారు. విపరీతమైన చలి కారణంగా ఆ పాప హైపోథెర్మియాకు గురైందని, వెంటనే శరీరాన్ని వెచ్చ బరిచి, తగిన చికిత్స చేశామని వైద్య సిబ్బంది తెలిపారు.

బిల్కిస్ బానో కేసులో దోషుల విచారణకు బెంచ్ : సుప్రీంకోర్టు హామీ

న్యూఢిల్లీ : గుజరాత్ మత ఘర్షణల్లో బాధితురాలు బిల్కిస్ బానో కేసులో దోషులను విడుదల చేయడంపై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. గుజరాత్ మత ఘర్షణల సమయంలో బిల్కిస్ బానో కుటుంబ సభ్యులను హత్య చేయడమే కాకుండా, ఆమెపైనా అఘాయిత్యానికి పాల్పడిన దుండగులు దోషులుగా నిర్ధారణై యావజ్జీవ శిక్ష పడిన 11 మందిని బిజెపి ప్రభుత్వం శిక్ష పూర్తికాకుండానే క్షమాభిక్ష సాకుతో విడుదల చేసిన సంగతి తెలిసిందే.

అసెంబ్లీ ముట్టడికి కిసాన్ మోర్చా యత్నం

- అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ధరణి పోర్టల్‌ను ప్రక్షాళించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి కిసాన్ మోర్చా పిలుపునివ్వగా నాయకులను, కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. అసెంబ్లీ సమీపంలోకి కిసాన్ మోర్చా నాయకులతో పాటు రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి వెళ్లగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ధరణి పోర్టల్ కల్వకుంట్ల కుటుంబానికి కల్పతరువుగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలోని చాలా మంది రైతులు తమ భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారని గుర్తుచేశారు. రైతులు తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగేలా చేసిందన్నారు. అరెస్టు చేసి వారిని పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధు సూదన్ రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు జగన్ మోహన్ రెడ్డి, అంజయ్య యాదవ్, కిరణ్ గౌడ్, తిరుపతి రెడ్డి నిరంజన్ రెడ్డి, కృష్ణా రెడ్డి, తదితరులున్నారు.

రాష్ట్రంలో క్రీడా విధానం లేదు..

- బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో క్రీడా విధానం ఎందుకు ప్రకటించలేదో..దీని ప్రభుత్వ విధానమేంటో తెలపాలని బీజేపీ సభ్యుడు రఘునందన్‌రావు ప్రశ్నించారు. బుధవారం శాసన సభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి హరీశ్‌రావు వివరణను రఘునందన్‌రావు ప్రశ్నించారు. ప్రభుత్వానికి క్రీడా విధానముందని చెప్పారు. త్వరలో ఆ విధానాన్ని సంబంధిత మంత్రి ప్రకటిస్తారని తెలిపారు.

మంచినీరు లేని పాఠశాలలెన్నో..

తాగునీరు, పారిశుద్ధ్య వసతుల్లేక పిల్లలకు ఇక్కట్లు

- వారి అభ్యాసనా సామర్థ్యాల్ని దెబ్బతీస్తాయి : యునెస్కో నివేదిక



న్యూయార్క్ : మంచినీరు, మరుగుదొడ్డి, మురిగినీరు పోయే నాలా లేని పాఠశాలలు ప్రపంచంలో అనేకమున్నాయని ఐక్యరాజ్యసమితి సాంస్కృతిక సంస్థ 'యునెస్కో' ఆందోళన వ్యక్తం చేసింది. కనీస వసతుల మెరుగుదల కోసం ప్రభుత్వాలు, ఇతర సంస్థలు నిధుల వ్యయంపై దృష్టి సారించాలని పేర్కొంది. మెరుగైన వసతులు పిల్లల అభ్యాసనా సామర్థ్యాల్ని పెంచుతాయని నివేదిక రూపకల్పనలో పాలుపంచుకున్న హెల్త్, న్యూట్రీషియన్ నిపుణురాలు ఎమిలీ సిడానెర్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పాఠశాలల్లో నెలకొన్న వసతులపై యునెస్కో అధ్యయనం చేపట్టగా, సగం స్కూళ్లలో కనీస వసతుల్లేవని తేలింది. శుద్ధమైన తాగునీరు, చేయి కడుక్కొనేందుకు సబ్బు లేక పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పరిశోధకులు గుర్తించారు. ఒక మరుగుదొడ్డి, మురికినీరు పోయే నాలా ఉన్న పాఠశాలను 'కనీస పారిశుద్ధ్య వసతులు'న్న పాఠశాలగా పరిశోధకులు వర్గీకరించారు. ఈ లెక్కన కనీస వసతుల్లేని పాఠశాలలు ప్రపంచంలో మూడింట ఒకవంతు ఉన్నాయని నివేదిక తెలిపింది. మరికొన్ని వివరాలు ఈ విధంగా ఉన్నాయి. స్కూల్స్‌కు వెళ్తున్న ప్రతి ముగ్గురు చిన్నారుల్లో ఒకరు తాగునీటి సమస్యకు గురవుతున్నారు. ఇది వారి ఆరోగ్యాన్ని, పాఠశాలల్లో అభ్యాసనా సామర్థ్యాల్ని దెబ్బతీస్తోంది. 'పీరియడ్స్' సమయంలో స్కూల్‌లో నీరు, సబ్బులేకపోవటం బాలికలకు ఇబ్బంది కలిగిస్తోంది. ఉదాహరణకు భూటాన్‌లో ప్రతి నలుగురులో ఒక బాలిక పాఠశాలకు గైర్హాజరవుతోంది.

పిల్లల ఆరోగ్యంపై ప్రభావం : ఎమిలీ సిడానెర్

మూడింట ఒక వంతు పాఠశాలల్లో పిల్లలకు తాగునీరు అందుబాటులో లేదు. కనీసం ఒక మరుగుదొడ్డి లేదు. చేయి కడుక్కొనేందుకు నీరు, సబ్బు లేని పాఠశాలలు సగమున్నాయి. కోవిడ్-19 వైరస్, దోమ కాటు, డయేరియా..మొదలైన వ్యాధులు సోక కుండా ఉండాలంటే పాఠశాలల్లో కనీస వసతులు అత్యంత ముఖ్యమైనవని నిపుణు రాలు ఎమిలీ సిడానెర్ అభిప్రాయపడ్డారు. కనీస వసతులలేమి పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని హెచ్చరించారు. శుద్ధమైన తాగు నీరు పిల్లలకు ఇవ్వలేకపోతే, పాఠశాల ఆవరణలో పిల్లలు భోజనం చేయరాదని, దీనివల్ల పిల్లల్లో పోషకాహార లోపం తలెత్తుతుందని సిడానెర్ తెలిపారు.

సిరియా భూకంపం
శిథిలాల కింద తమ్ముడి తలను కాపాడుతూ...

చిన్నారుల ఫొటో సోషల్ మీడియాలో వైరల్



సిరియా : టర్కీ, సిరియాల్లో సంభవించిన పెను భూకంపం తీరని విషాదాన్ని నింపింది. ఎన్నో వేలమంది ఇప్పటికీ శిథిలాల కింద చిక్కుకుపోయారు. సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎటు చూసినా హృదయవిదారక దృశ్యాలే..! ఇంతటి విషాదంలోనూ ఇద్దరు చిన్నారుల దృశ్యం యావత్ ప్రపంచం దృష్టిని ఆకట్టుకుంది. ఇద్దరు చిన్నారులకు సంబంధించిన ఓ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. భూకంపం ధాటికి కుప్పకూలిన ఓ భవన శిథిలాల కింద ఓ బాలిక, తన తమ్ముడితో ఇరుక్కుపోయింది. స్లాబ్‌కు ఒకవైపు నేల, మరోవైపు పిల్లర్ సపోర్టుగా ఉండటంతో వారు ప్రాణాలతో బిక్కు బిక్కు మంటూ అక్కడే ఉండిపోయారు. ప్రాణభయంతో గంటలపాటు శిథిలాల కిందే ఉండిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో బాలిక తన తమ్ముడి కోసం ఆరాటపడింది. శిథిలాలకింద తమ్ముడు ఇరుక్కుపోయాడు. అతడి తలకు ఆ బాలిక తన చేయిని అడ్డంపెట్టింది. రక్షించింది. నీకు నేనున్నాను.. నీకేం కాదని భరోసా కల్పించింది. ఈ ఫొటోను సోషల్ మీడియాలో చూసిన నెటిజన్లంతా... అక్కా తమ్ముడి ప్రేమకు ఇంతకంటే నిదర్శనం ఇంకేముంటుంది అంటూ కామెంట్ చేస్తున్నారు. బాలికను ప్రశంసిస్తున్నారు. తమ్ముడికి ధైర్యం చెబుతూ ఆ బాలిక సహాయం కోసం ఎదురుచూసింది. ఇలాంటి సంఘటనలు టర్కీ, సిరియాల్లో కనిపిస్తున్నాయి.

మూడు నెలలుపాటు ఎమర్జెన్సీ

టర్కీలో సోమవారం సంభవించిన భూకంప తీవ్రతకు వేలాది మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. భూకంప తీవ్రతకు 10 ప్రావిన్సులు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఈ నేపథ్యంలో టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ ప్రభావితమైన 10 ప్రావిన్స్‌లలో మూడు నెలలపాటు ఎమర్జెన్సీని విధిస్తున్నట్లు ప్రకటించారు. దీనిపై ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 119 ప్రకారం పది ప్రావిన్స్‌లలో మూడునెలలపాటు అత్యవసర పరిస్థితిని విధించాలని మేం నిర్ణయించుకున్నాం. భూకంపం వల్ల శిథిలాల కింద ఉన్న మృతదేహాలను వెలికితీయడానికి రెస్క్యూ సిబ్బంది మరింత వేగంతో పనిచేస్తున్నారు' అని ఆయన అన్నారు. ఇప్పటివరకున్న తాజా సమాచారం ప్రకారం.. 5,895 మంది మతి చెందారని, 34,810 మందికి గాయాలయ్యా యని.. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని రెసెప్ మీడియా సమావేశంలో వెల్లడించారు. కాగా, టర్కీలో కహ్రమన్మరాస్, అదానా, అడియామాన్, ఉస్మానియే, హటే, కిలిస్, మలత్య, సాన్లియుర్ఫా, దియార్‌బాకిర్, గజియాంటెప్‌లు భూకంప ధాటికి అత్యంత ప్రభావితమైన ప్రావిన్స్‌లుగా ఉన్నాయి.

'కృషి' బాధితులు

- డబ్బుల కోసం లిక్విడేటర్‌ను సంప్రదించండి : సీఐడీ డీజీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

కృషి బ్యాంకులో పెట్టుబడులు పెట్టి మోసపోయిన బాధితులలో ఇప్పటి వరకు డబ్బులు తిరిగి పొందని వారు తమను లేదా లిక్విడేటర్‌ను సంప్రదించాలని సీఐడీ డీజీ మహేష్ భగవత్ కోరారు. 2001 లో కృషి బ్యాంకు వందలాది మంది డిపాజిటర్ల నెత్తిన కుచ్చుటోపి తొడిగి మూతపడ్డ విషయం తెలిసిందే. మొదట ఈ కేసును మహంకాళి పోలీసులు దర్యాప్తు చేయగా తర్వాత ఈ కేసును సీఐడీ చేపట్టింది. తన దర్యాప్తులో ఇప్పటి వరకు కృషి బ్యాంకుకు చెందిన ఆస్తులను కొన్నింటిని వేలం వేసి ఏడు వందల డిపాజిటర్లలో దాదాపు ఆరు వందల మందికి డబ్బులను లిక్విడేటర్ ద్వారా సీఐడీ చెల్లించింది. కాగా మరో వంద మంది వరకు డిపాజిటర్లకు డబ్బులు అందలేదని సీఐడీ డీజీ తెలిపారు. తాజాగా మరికొన్ని ఆస్తులను వేలం వేయడం ద్వారా డబ్బులు సమకూరాయనీ, ఈ నేపథ్యంలో ఇంత వరకు తమ డబ్బులు తీసుకోని బాధితులు తమ వివరాలు, సదరు బ్యాంకు నుంచి తమకు రావలసిన డబ్బుల వివరాలను పేర్కొంటు కృషి బ్యాంకు లిక్విడేటర్‌ను గాంధీభవన్ ఎదురుగా ఉన్న గృహకల్పభవన్‌లో కలువాలని డీజీ కోరారు. అలాగే సీఐడీ డీఎస్‌పీ వెంకట్‌రెడ్డిని (9440700870) కూడా డిపాజిటర్లు కలుసుకోవచ్చని ఆయన తెలిపారు.

ఫ్రాన్స్‌లో లక్షలాది మంది కార్మికుల భారీ ప్రదర్శన



పారిస్ : వివాదాస్పదమైన పెన్షన్ సంస్కరణ బిల్లుని వెనక్కి తీసుకోవాంటూ అధ్యక్షుడు మాక్రాన్‌ను ప్రజలు కోరుతున్నారు. ఈ బిల్లుని వెనక్కి తీసుకోవాలంటూ మంగళవారం సుమారు 2.8 మిలియన్లకు పైగా కార్మికులు ఆందోళన చేపట్టారు. పలు యూనియన్లు, వామపక్ష సంస్థల ఆధ్వర్యంలో రవాణా, విద్య, ఇంధన రంగాలకు చెందిన కార్మికులు ఫ్రాన్స్‌లోని ప్రధాన నగరాల్లో భారీ ప్రదర్శనలు చేపట్టారు. మరో వైపు ఈ బిల్లుపై మంగళవారం జాతీయ అసెంబ్లీలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఈ బిల్లుని ఉపసంహరించాలంటూ గత నెల నుండి లక్షలాది మంది కార్మికులు ఆందోళనలు చేపడుతున్న సంగతి తెలిసిందే. తనకు ప్రస్తుతం 60 ఏళ్లని, మరో రెండేళ్లలో పదవీ విరమణ పొందాల్సి వుంది. అయితే నూతన బిల్లు ఆమోదం పొందితే తాను మరో రెండేళ్ల పాటు పదవి విరమణ కోసం వేచి చూడాల్సివుందని, ముఖ్యంగా మహిళలకు ఇది చట్టవిరుద్ధమైనదని పారిస్ వీధుల్లో నిరసన తెలిపిన గ్రాఫిక్ డిజైనర్ అన్నే పేర్కొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ వెనక్కి తగ్గే వరకు నిరసన చేపడతామని ఫ్రెంచ్ డెమోక్రటిక్ కాన్ఫెడరేషన్ ఆఫ్ లేబర్ తెలిపింది. నూతన బిల్లు ఆమోదం పొందితే.. పదవీ విరమణ అనంతరం ఓ కార్మికుడు పూర్తి పెన్షన్ పొందాలంటే 43 ఏళ్ల పాటు యాజమాన్యం నగదు చెల్లింపులు చేయాల్సి వుంటుందని పేర్కొంది.

ఉపాధిలో మనమే నెంబర్‌వన్

- 10.66 కోట్ల పనిదినాలు పూర్తి
- 12 కోట్ల పనిదినాలకు ప్రతిపాదనలు పంపాం
- షరతులతో 11 కోట్ల పనిదినాలకు కేంద్రం అంగీకారం
- ఉపాధి హామీ చట్టం ఎనిమిదో కౌన్సిల్ సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



ఉపాధి హామీ చట్టం అమలు విషయంలో దేశంలోనే మన రాష్ట్రం నెంబర్ వన్‌గా నిలిచిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు. గతేడాది 10.66 కోట్ల పనిదినాలను పూర్తిచేశామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 12 కోట్ల పనిదినాలు కేటాయించాలంటూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అయితే, అనేక షరతులు పెట్టి కేవలం 11 కోట్ల పనిదినాలకే కేంద్రం అంగీకారం తెలిపిందని చెప్పారు. బుధవారం శాసనసభ సమావేశ మందిరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఎనిమిదో కౌన్సిల్ సమావేశం ఎర్రబెల్లి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, మల్లారెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ..ఉపాధి హామీ చట్టాన్ని మన రాష్ట్రం అత్యధికంగా ఉపయోగించుకుంటున్నదనే అక్కసు కేంద్రానికి ఉందన్నారు. అందుకే అనేక నిబంధనలు పెట్టి నిధులు ఆపేందుకు కుట్ర చేస్తున్నదని విమర్శించారు. కూలీలకిచ్చే గడ్డపారలు, గంపలు, పారలు, మెడికల్ కిట్లు ఇవ్వాలని అడిగితే కేంద్రం స్పందించడం లేదని విమర్శించారు. గ్రామాల్లో గొర్లు కాసేవారికి షెడ్లు వేసుకునేందుకు ప్రభుత్వమే స్థలాలు చూపే విధంగా కలెక్టర్లకు ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో పీటీజీలకు కనీసం 150 రోజుల పనికల్పించే విధంగా కేంద్రాన్ని కోరాలన్నారు. రైతు కల్లాలు నిర్మిస్తున్నామని చెప్పినప్పుడు అభ్యంతరం చెప్పకుండా ఇప్పుడు అడ్డుపడటాన్ని తప్పుబట్టారు. కల్లాల కోసం రూ.150 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టామన్నారు. ఈ పేరుతో రాష్ట్రానికి రావాల్సిన రూ.800 కోట్లను పదినెలలుగా కేంద్రం ఆపిందని విమర్శించారు. ఆ డబ్బులు మినహాయించుకుని మిగిలిన నిధులను విడుదల చేయాలంటూ ఒత్తిడి చేస్తే రూ. 276 కోట్లు మాత్రమే ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో 'ఉపాధి' ద్వారా 61 శాతం మంది మహిళలు పనిదినాలు పొందుతున్నారని చెప్పారు. పంచాయతీరాజ్ కమిషనర్ హన్మంతరావు మాట్లాడుతూ.. ఉపాధి హామీలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3135.7 కోట్లు ఖర్చుచేశామని తెలిపారు. గతం నుంచి కొనసాగుతున్న రాగా సాఫ్ట్‌వేర్‌ను మార్చి నరేగ సాఫ్ట్‌వేరు తెచ్చారనీ, దీనివల్ల ఇప్పుడు ఉపాధి హామీ పనులు చేసే బృందాల వద్దకెళ్లి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఫోటోలు తీసి కేంద్రానికి పంపాల్సి వస్తున్నదని తెలిపారు. పనికి ముందు, పని జరిగేటప్పుడు, పని జరిగిన తర్వాత ఫొటోలు తీయాలన్న నిబంధన సరిగాదని తెలిపారు.

అమెరికాలో అసాధారణ శరణార్థిగా బోల్సనారో !

దోరల్ (అమెరికా) : లాటిన్ అమెరికాలో అతిపెద్ద దేశమైన బ్రెజిల్‌కు ఒకప్పటి అధ్యక్షుడు జేర్ బోల్సనారో ప్రస్తుతం అమెరికాలో ఒక చిన్న ఫ్లోరిడా పట్టణంలో అసాధారణ శరణార్థిగా జీవిస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్ రెస్టారెంట్‌లో ఒంటరిగా తింటూ కాలం వెళ్ళదీస్తున్నారు. గత డిసెంబరులో ఇక్కడకు చేరుకున్న బోల్సనారో ఇక్కడనుండే బ్రెజిల్‌లో లూలా డసిల్వా ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్ర పన్నారు. దేశంలో అశాంతి రేపేందుకు ప్రయత్నించారన్న అభియోగాలపై బ్రెజిల్‌లో ప్రస్తుతం ఆయనపై దర్యాప్తు జరుగుతోంది. కాగా ఆయన ఈ ఆరోపణలను తిరస్కరిస్తున్నారు.

విలాసవంతంగా వుండే అధ్యక్ష భవనంలో వున్న బోల్సనారో ఇప్పుడు డిస్నీ వరల్డ్ రిసార్ట్ సమీపంలో ఒక చిన్న కమ్యూనిటీలో జీవిస్తున్నారు. అమెరికాలో మొదటి ఆరువారాలు బయటి ప్రపంచానికి పెద్దగా తెలియకుండా బతికిన బోల్సనారో శుక్రవారం ఒక కార్యక్రమంలో దాదాపు 400మంది మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగించారు. మియామీకి సమీపంలో దోరల్ నగరంలోని ట్రంప్ నేషనల్ హోటల్‌లో ఈ కార్యక్రమం జరిగింది.

బర్డ్‌ఫ్లూతో వేలాది పక్షులు మృతి

లిమా : గత కొన్ని రోజుల్లోనే బర్డ్‌ఫ్లూ వైరస్ వల్ల వేలాది పక్షులు మృతి చెందాయని ఫిలిప్పీన్స్ మీడియా వర్గాలు తెలిపాయి. ఎనిమిది రక్షిత తీర ప్రాంతాల్లో 55 వేల పక్షులు, 585 సీ లైన్స్ (నాలుగు కాళ్లతో ఉండే సముద్రపు చేపలు... లేదా పిన్నిపెడ్‌లు) మృతి చెందాయని సహజ ప్రాంతాల రక్షణ సంస్థ సెర్నాప్ అనే ఏజెన్సీ తాజాగా వెల్లడించింది. చనిపోయిన పక్షుల్లో పెలికాన్‌లు, వివిధరకాల గల్ పక్షులు, పెంగ్విన్‌లు ఉన్నాయని సెర్నాప్ ఏజెన్సీ ఓ ప్రకటనలో వెల్లడించింది. హెచ్5ఎన్1 అనే వైరస్ చనిపోయిన పక్షుల్లో ఉందని దీనివల్లే అవి మృతి చెందాయని లేబొరేటరీ పరీక్షల్లో తేలింది. దీంతో అధికారులు బయోలాజికల్ విజిలెన్స్ ప్రోటోకాల్‌ను ప్రకటించారు. ఇక పెరూ నేషనల్ ఫారెస్ట్ అండ్ వైల్డ్ లైఫ్ సర్వీస్ (ఎస్ఈఆర్ఎఫ్ఓఆర్) బీచ్‌కి పెంపుడు జంతువుల్ని తీసుకెళ్లొద్దని, అలాగే ప్రజల్ని కూడా బీచ్‌లకు వెళ్లొద్దని కోరింది. బొలీవియా, కొలంబియా, కోస్టారికా, ఈక్వెడార్, హోండురాస్, పనామా, పెరూ, వెనిజులాల్లో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందే అవకాశముందని వరల్డ్ ఆర్గనైజేషన్ ఫర్ యానిమల్ హెల్త్ (డబ్ల్యూఓఏహెచ్) గతవారం వెల్లడించింది. దక్షిణ అమెరికాలోని పక్షుల్లో కనుగొన్న ఏవియన్ ఫ్లూ వ్యాప్తి మరికొన్ని దేశాలకు వ్యాప్తి చెందే అవకాశముందని డబ్ల్యుఓహెచ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇక 2021 సంవత్సరం చివరలో యూరప్‌లో కూడా హెచ్5ఎన్1 వైరస్ వ్యాపించింది. అలాగే ఉత్తర, దక్షిణ అమెరికాల్లో ఉన్న పక్షుల్లో కూడా ఈ బర్డ్‌ఫ్లూ వైరస్ సోకింది. ఈ వ్యాధి ఉత్తర అమెరికా నుంచి వలస వచ్చే పక్షుల ద్వారా వ్యాపిస్తుందని గతంలో సెనాసా అనే వ్యవసాయ ఆరోగ్య సంస్థ తెలిపింది.

చైనా నిఘా బెలూన్ శకలాలను సేకరిస్తున్న అమెరికా

బీజింగ్ : తమ గగనతలంలో ఎగురుతున్న చైనా నిఘా బెలూన్‌ను ఆదివారం కూల్చివేసిన నేపథ్యంలో వాటి శకలాలను అమెరికా అధికారులు సేకరించడం ప్రారంభించారు. అమెరికన్ మిలటరీ వీటిని సేకరించి, విశ్లేషించడం ప్రారంభించిందని అధికారులు తెలిపారు. గతంలో కూడా చైనా బెలూన్లు అమెరికా గగనతలాన్ని ఉల్లంఘించిన ఘటనలు వున్నాయని అమెరికా నార్తరన్ కమాండ్‌కి చెందిన ఎయిర్‌ఫోర్స్ జనరల్ గ్లెన్ డి వాన్ హెర్క్ చెప్పారు. కాగా చైనా ప్రభుత్వం ఈ చర్యను 'అతిగా స్పందించడం'గా విమర్శించిన సంగతి విదితమే. కాగా, బెలూన్ శిథిలాలేవీ బీజింగ్‌కి ఇచ్చే ఆలోచన అమెరికాకు లేదని వైట్‌హౌస్ జాతీయ భద్రతా మండలి ప్రతినిధి జాన్ కిర్బీ తెలిపారు.

విశాఖలో చకచకా పనులు రాజధాని తరలింపులో భాగమేనా?

విశాఖ : ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖలో పలు పనులను ఆ రాష్ట్ర అధికార యంత్రాంగం చకచకా నిర్వహిస్తోంది. రాజధాని ఏర్పాట్లలో భాగంగా ఇవి జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. విశాఖలోని పిఎం పాలెం ఆఖరి బస్టాప్ వద్ద పోలీసు శాఖకు వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో మంజూరు చేసిన సుమారు 54 ఎకరాల స్థలాన్ని తాజాగా బుధవారం చదును చేస్తున్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు ఈ పనిలో నిమగ్నమయ్యారు. కొత్త సర్వే నెంబరు 92 నుంచి 100 వరకూ 54 ఎకరాల పైచిలుకు స్థలంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో పనులు జరుగుతున్నాయి. ఈ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ స్థలాన్ని చదును చేసేందుకు విశాఖపట్నం ఎంపి ఎంవివి సత్యనారాయణకు సంబంధించిన స్థలంలో నుంచి గ్రావెల్ సరఫరా చేస్తున్నారు. దీంతో, దుమ్ము, దూళి ఎగిరిపడుతుండడంతో స్థానికులు బుధవారం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది పోలీసులకు సంబంధించినదని సర్దిచెప్పి అధికారులు వారిని పంపించేశారు

అదానికి 406 ఎకరాలు

- ఏపీ ప్రభుత్వ నిర్ణయం
- అనంతపురం జిల్లాలో కేటాయింపుశ్రీ క్యాబినెట్ నిర్ణయం

అమరావతి : అదాని అక్రమాలపై దేశ వ్యాప్తంగా వ్యక్తమవుతున్న ఆందోళనను ఏపీ ప్రభుత్వం బేఖాతరు చేసింది. పార్లమెంటులో చర్చకు విపక్షాలు పట్టుబడుతున్న సమయంలోనే అనంతపురం జిల్లాలో మరో 406.40 ఎకరాల భూమిని అదాని సంస్థలకు అప్పగించడానికి రంగం సిద్ధం చేసింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అదానిగ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌కు 500మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు 406.40 ఎకరాల భూమిని ఎకరం రూ.5లక్షల వంతున ఇవ్వాలన్న ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. అనంతపురం జిల్లా తాడిమర్రిమండలం పెద్దకోట్ల దాడితోట గ్రామాల పరిధిలో ఈ భూములు కేటాయించనున్నారు. దీంతో పాటు కర్నూలులో 50 ఎకరాల విస్తీర్ణంలో న్యాయ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, 1998 డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థులు 4,534మందికి మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేస్తూ ఎస్‌జిటి పోస్టులను భర్తీ చేయాలని క్యాబినెట్ ఆమోదించింది. ఉగాదికి అందించే సంక్షేమ పథకాలకు కూడా మంత్రిమండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ సమావేశంలో 70 అంశాలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. క్యాబినెట్ నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మీడియాకు వివరించారు. వైఎస్‌ఆర్ లా నేస్తం, వైఎస్‌ఆర్ ఆసరా, ఇబిసి నేస్తం, వైఎస్‌ఆర్ కళ్యాణమస్తు, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెనలకు మంత్రి మండలి ఆమోదం తెలిపినట్టు ఆయన చెప్పారు. .ఈనెల10న కళ్యాణమస్తు, షాదీతోఫాలను ప్రారంభిస్తామని, కళ్యాణమస్తుకు దరఖాస్తు చేసుకునే వార పదవతరగతి పాసై ఉండాలని తెలిపారు. ఏ సీజన్‌లో పంట నష్టపోతే అదే సీజన్‌లోనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేందుకు కూడా ఆమోదం తెలిపినట్లు మంత్రి వెల్లడించారు. 28న జగనన్న విద్యా దీవెన పూర్తి స్థాయి రీ ఎంబర్స్‌మెంట్ రూ.700కోట్లు విద్యార్థులకు అందచేస్తామన్నారు. ఉగాది సందర్భంగా మహిళా సంఘాలకు 79లక్షల మంది మహిళలకు మూడో విడత సుమారు 6,500కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉగాది వేడుకలు వారం రోజుల పాటు చేసుకునేందుకు వీలుగా ఆసరా మూడో విడత పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద 3,255 ప్రొసీజర్స్‌ను ఎక్కడ వైద్యం చేయించినా పథకం వర్తించేలా మార్పులు చేస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో స్టేటస్ కో ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ

- 17న విచారిస్తామన్న సిజెఐ ధర్మాసనం

న్యూఢిల్లీ : ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో స్టేటస్ కో ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసును సిబిఐకి అప్పగిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. బుధవారం సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ ధర్మాసనం ముందు తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది సిద్ధార్థ లుత్రా అంశాన్ని లేవనెత్తారు. సిబిఐ చేతికి సాక్షులు వెళ్తే చేసేది ఏమీ లేదని సిద్ధార్థ లూత్రా అన్నారు. మెరిట్స్ ఉంటే హై కోర్టు తీర్పును రివర్స్ చేస్తామని ధర్మాసనం పేర్కొంది. స్టేటస్ కో ఇవ్వడానికి ధర్మాసనం నిరాకరించింది. త్వరితగతిన విచారించడానికి నిరాకరించిన ధర్మాసనం, 17న విచారణ జరిపేందుకు అంగీకరించింది.

బ్రిటన్‌లో జెలెన్‌స్కీ పర్యటన

లండన్ : ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య ప్రారంభమైన తర్వాత మొదటిసారిగా ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ బుధవారం బ్రిటన్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని రిషి సునాక్‌తో ఆయన చర్చలు జరుపుతారని బ్రిటన్ ప్రభుత్వం తెలిపింది. బ్రిటన్ పార్లమెంట్‌లో కూడా జెలెన్‌స్కీ ప్రసంగిస్తారని, బ్రిటన్ మిలటరీ చీఫ్‌లతో భేటీ అవుతారని తెలిపింది. సైనిక చర్య ప్రారంభమైన రెండు వారాల తర్వాత గత మార్చిలో మారుమూల ప్రాంతం నుండి జెలెన్‌స్కీ బ్రిటన్ పార్లమెంట్‌లో ప్రసంగించారు. రష్యా యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌కు సైనికపరంగా మద్దతునిస్తున్న అతిపెద్ద దేశం బ్రిటన్. ఇప్పటివరకు ఉక్రెయిన్‌కు ఆయుధాలు, సామాగ్రి రూపంలో 250కోట్ల డాలర్లకు పైగా మొత్తాన్ని పంపింది. నాటో ప్రమాణాలు కలిగిన యుద్ధ విమానాల్లో ఉక్రెయిన్ పైలట్లకు బ్రిటన్ శిక్షణ ఇస్తుందని సునాక్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ పర్యటన జరుగుతోంది. యుద్ధ విమానాలను పంపాల్సిందిగా ఉక్రెయిన్ తన మిత్ర దేశాలను కోరింది. అయితే బ్రిటీష్ యుద్ధ విమానాలను ఉక్రెయిన్‌కు పంపడం ఆచరణలో సాధ్యం కానిదని, కానీ శిక్షణ ఇస్తామని సునాక్ చెప్పారు. బ్రిటన్‌లోని స్థావరాల్లో 10వేల మందికి పైగా ఉక్రెయిన్ బలగాలు శిక్షణ పొందాయి. బ్రిటన్ పంపుతున్న ఛాలెంజర్ 2 ట్యాంకులపై కూడా వీరికి శిక్షణ అందింది.